

VETAPALEM



ఏ ఇతర ఆరోగ్య పానీయం
సంపూర్ణం కాదు
ఒక్క
కాంప్లాన్®
మాత్రమే బలానికి,
శక్తికి మీకు కావలసిన
ఈ 23 అతి ముఖ్యమైన
'ఆహారాలు'గల సంపూర్ణ పానీయం.
ప్రొటీన్
కార్బోహైడ్రేట్
కేల్షియమ్
లిపిడ్స్
ఫాస్ఫరస్
సోడియమ్
క్లోరైడ్ (సి ఎల్ రూపంలో)
పొటాషియమ్
ఐరన్
అయోడిన్
విటమిన్ ఎ
విటమిన్ బి1
రిబోఫ్లావిన్
నికొటినమైడ్
కాల్షియమ్ పాంటొథెనేట్
కోలిన్
పైరిడాక్సిన్ (బి6)
విటమిన్ బి12
ఫోలిక్ ఏసిడ్
విటమిన్ సి
విటమిన్ డి
విటమిన్ ఇ
విటమిన్ కె
వీటన్నిటితోపాటు
ట్రేస్ ఎలిమెంట్స్
(ఆరోగ్యకరమైన
జీవ ప్రక్రియల
కోసం)
ఒక్క కాంప్లాన్‌లోనే శాస్త్రీయంగా కూర్చబడిన పాళ్లలో ప్రోటీనులు, విటమినులు, ఖనిజ లవణాలు, కార్బోహైడ్రేట్‌లు, తదితర ముఖ్యమైన ఆహారాలు ఉన్నాయి.
'సంపూర్ణ' పోషణకోసం డాక్టర్లు ఎక్కువగా సిఫార్సు చేస్తున్నారు.
తినడానికి తీరిక లేదా?
కాంప్లాన్ భోజనానికి బదులు తక్షణమైన ప్రత్యామ్నాయం. తొందరగా వెళ్ళాల్సిన అధికారులకు, ప్రయాణీకులకు, ఆఫీసుల్లో పనిచేసే వారికి ఆదర్శవంతమైనది.
సయించటం లేదా?
కాంప్లాన్‌లో ఉండే 23 అతి ముఖ్యమైన 'ఆహారాలు' ఇచ్చే సంపూర్ణ పోషణ అతనికి ఏ ఇతర ఆరోగ్య పానీయం ఇవ్వలేదు. అందుచేత అతని పోషణలో లోపం ఎలాంటిదైనా కాంప్లాన్‌తో అతను ఆరోగ్యంగా ఉంటాడు.
మామూలు ఆరోగ్యవంతులకు.
మరింత ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉండేందుకూ, పైకి కనబడని ఆహా
లోపములనుంచి కాపాడుకునేందుకూ రోజూ కాంప్లా
త్రాగండి.
తినలేనంత జబ్బు చేసిందా?
కాంప్లాన్‌తో త్వరగా కోలుకోండి. సంపూర్ణ పోషణకు డాక్టర్లు దీనిని సిఫార్సు చేశారు.
Glaxo
Complan
THE COMPLETE PLANNED FOOD
CHOCOLATE FLAVOUR
2 కమ్మని రుచులలో: ఏలకికాయ-కుంకుమ పువ్వు చాక్లెట్ సాధారణ రుచిలో కూడా.
కాంప్లాన్
ఒకే ఒక సంపు
ఆరోగ్య పానీయ
గ్లాక్సో
పరిశోధన యొక
ప్రపం
వ్యాప్తమై
ఉత్ప
CA SGC-25-234 TL

ఏసిసి పుష్కల్

పుష్కలమైన పంటలకు "పుష్కల్" ఎరువులు వాడండి



"పుష్కల్" గ్రాన్యులేటెడ ఎరువులు ఆంధ్రప్రదేశ్ భూముల ప్రత్యేక అవుసరాల కనుగుణంగా తయారు చేయబడినవి, పంటకు ముఖ్యముగా కావలసిన మూడు పోషక పదార్థాలు, నత్రజని భాస్వరము, పొటాష్లు, కావలసిన పాళ్లలో కలపి పుష్కల్ ఎరువులు తయారు చేయబడినవి.

వరి, పొగాకు, చెఱకు, ప్రత్తి, మిరప కూరకాయలు, ఏ యితర పంటలకైన ప్రత్యేకముగా తయారుచేయబడిన పుష్కల్ ఎరువులు లభించును.

పుష్కల్ ఎరువులు వాడితే చేలోని ప్రతి మొక్కకు కావలసిన పోషక పదార్థాలన్ని కావలసిన పాళ్లలో లభించును.

పుష్కల్ ఎరువులు గుళికల రూపములో వుండుట వలన గాలికి ఎగిరిపోవు, నీటిలో కరిగి కొట్టుకు పోవు, అందువలన పొదుపుగా వాడి ఆదా చేయవచ్చును,


"పుష్కల్ ఎరువుల వాడకం పైరుకుబలం రైతుకులాభం"

ACC పుష్కల్ ఫెర్టిలైజర్

ది అసోసియేటెడ్ సిమెంట్ కంపెనీస్ లిమిటెడ్
వ్రాయుము :
సిమెంట్ మార్కెటింగ్ డివిజన్
(ఫెర్టిలైజర్ డిపార్ట్మెంట్)
పోస్ట్ బేగ్ నం. 18, రెహ్మత్ బిల్డింగ్, 66ఎ, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

maa ACC 13A

లోకంపోకడ — ఊమెన్



ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాధుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

[1938–1972]

శుక్రవారం : 1–7–'77

పింగళనామ సం. అధిక ఆషాఢమాస శు. పౌర్ణమి

సంపుటము 70 : సంచిక : 44

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

*

పోస్టులో ఏడాది చందా రు. 41–60

ఆరుమాసాల చందా రు. 20–80

విడి ప్రతి వెల 75 పైసలు

ఆంధ్రపత్రిక కార్యాలయము

గాంధీనగరం, విజయవాడ–520003.

విషయసూచిక

అట్టమీద బొమ్మ : జయసుధ (ఫొటో : జెవి)

హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర


డాక్టర్ తంగిరాల వేంకటనారాయణశాస్త్రి

క్రీస్తుశకం 848నాటి గుణకవి జయాదిత్యుని కాలానికి చెందిన అద్దంకి కందుకూరు శాసనాలలో ఒక తరువోజ, ఒక సీసం—క్రీస్తు శకం 10 వ శతాబ్దం నాటి యుద్ధమల్లుని బెజవాడ శాసనంలో ఐదు మధ్యాక్కరలు, భీమ మహారాజు ధర్మవరం శాసనంలో ఒక సీసం—మొత్తం ఎనిమిది పద్యాలు మాత్రమే నన్నయకు పూర్వం ఉన్నట్లు పండిత లోకం అభిప్రాయపడింది. తూర్పు—చాళుక్యులే ప్రథమాంధ్ర భాషాపోషకులని, తొమ్మిదవ శతాబ్దమే పద్యరచనకు ఆది కాలమని పండితలోకం భావించింది. కాని క్రీస్తుశకం ఆరవ శతాబ్దినుండే రేనాటి చోళుల శాసనాలలో దేశ కవితారీతులు గోచరిస్తున్నాయనే భావనకు లక్ష్యాలు స్పష్టంగా చూపిన వారు డాక్టరు తంగిరాల వెంకటనారాయణ శాస్త్రి. ఇప్పటికి లభించిన తొలి తెలుగు శాసనాలు వేయించిన ఎరికల్‌ముత్తురాజు మొదటి శాసనం [575 నాటిది] కలమళ్ల శాసనంలోని కల్‌ముత్తురాజు ధనంజయురేనాండు ఏళన్ చిరుంబూరి రేవణకాలు పంపు చెనూరు కాజు అరికళా ఊరిండవారు. . అనే వాక్యాలలో చంద స్సౌందర్యం దర్శించడంలో కొంత శ్రమఉన్నా క్రీస్తు శకం 600 నాటి రేనాటి చోళమహారాజు కోసినెపల్లి శిలాశాసనంలోని బాణువర్ణింతురు పొరగ నీ కీర్తి ప్రభు చోళ రట్టోడి పరహితుండి తుండు మొదలైన వాక్యాలలో సీసపాదం స్పష్టంగా.

"బాణువర్ణింతురు పొరగనీకీర్తి

ప్రభుచోళ రట్టోడి పరహితుండు"

కనిపించింది డాక్టర్ శాస్త్రికి. దానితో కొత్త వెలుగు కలిగింది తెలుగు సాహిత్యా నికి. దాదాపుతెలుగు శాసనాల ఆవిర్భావంతో పాటే తెలుగు మాత్రా చ్ఛందస్సు కూడా ఆవిర్భవించిందని డాక్టర్ శాస్త్రి విశ్వసించారు. పరిశోధనకు పూనుకున్నారు. ప్రాచీనాంధ్ర శాసనములు — ఛందో వికాసము అనే సిద్ధాంత వ్యాసం సిద్ధపరచి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సమర్పించి డాక్టరేట్ పొందారు. 1956 లోనే. డాక్టర్ శాస్త్రి ఇంతటితో ఆగ లేదు. నన్నయ పూర్వపు శాసనభాషలో రేనాటి చోళరాజు ఆస్థానంలోని ఒకానొక అజ్ఞాత కవి జీవితాన్ని — యాదృచ్ఛికంగా ఆంధ్రదేశాన్ని వర్ణిస్తూ చిత్రాక్షరి అనే కావ్యం రచించారు. దీనిలో పాత పదాలు మొత్తం 500 వాడారు. వాటిలో కొన్ని సులభగ్రాహ్యాలు కొన్ని దురవగాహాలు.తర్వాత డాక్టర్ శాస్త్రి రేనాటి శాసనకవి రాజు గొప్పదనాన్ని నన్నయ ... రకుని వినయధర్మ శీలాన్ని వెల్లడి చేసే గేయనాటికను రచించారు. పిదప స్త్రీకి, విద్యాశాలికి అవమానం జరిగితే, అవమానం జరిపిన వ్యక్తిని పంచభూతాలు నాశనం చేస్తాయనే వ్యక్తం చేసే ఒక భావ కావ్యాన్ని విచిత్ర మాత్రా చ్ఛందస్సుతో రచించారు. విజ్ఞానశాస్త్రాన్ని సవ్యంగా వాడుకోకపోతే నాశనంతప్పదు. విజ్ఞానానికి మానవుడు బానిస కాకూడదు — అనే వైజ్ఞానికుని ఆత్మగతం సెంసిన్స్వాల్ అనే కావ్యరూపం దాల్చింది. డాక్టర్ శాస్త్రి ప్రస్తుత వాంఛితం శాసనభాషకు వ్యాకరణం. ప్రతిపద వ్యుత్పత్తితో, సజాతీయ భాషారూప తారతమ్య పరిశీలనతో రచించాలని. అవును. శాస్త్రి వాంఛితం న్యాయమైందే.ఆయనకు ప్రాచ్య పాశ్చాత్య వ్యాకరణాల మూలబంధం బలంగా వుంది. జామిలో వేగాడేకుర్తి సత్యనారాయణ శాస్త్రిగారివద్ద వ్యాకరణం చదివారు. చిన్ననాటినుంచే ఆయనకు శాస్త్రాల పట్ల ఆసక్తివుంది. ఆయన గుంటూరు జిల్లా వెల్లటూరులో 1926 లో జన్మించారు. విజయనగర మహారాజా సంస్కృత కళాశాలలో భాషా ప్రవీణలో ఉన్నత తరగతిలో ఉత్తీర్ణులై, తెనాలిలో సంస్కృత కళాశాలలో ఉపాధ్యాయులుగా వున్నారు. తెనాలి కళాశాల పాలక వర్గ కార్యదర్శి బలిజేపల్లి ఆదిశేషాచలపతి ప్రోత్సాహంతో ఇంగ్లీషు నేర్చి, మెట్రిక్ ఇంటర్— ప్రథమశ్రేణిలో ప్యాసయి. జంధ్యాల భగవచ్ఛాస్త్రి ప్రోత్సాహంతో వాల్తేరులో బి. ఏ. ఆనర్స్, ఎం. ఏ. లు ప్రథమశ్రేణిలో వుత్తీర్ణులయి, లింగ్విస్టిక్స్‌లో బహుమతి పొందారు. 1956 లో డాక్టరేటు బిరుదు పొందారు. డాక్టరేట్ చేసేటప్పుడే ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఎం. ఎ. తరగతికి పాఠాలు చెప్పారు. 1962 నుంచి ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఉన్నారు. ప్రస్తుతం రీడరు. దేశంలో విశాఖ మొదలు అనంతపురం దాక, వేల కొలది సభలలో ప్రసంగించారు. ప్రజల ఆదరంతో సన్మానాలు పొందారు. ఈ విషయంలో ఆయన ఆంధ్రావళికి నిరంతరం కృతజ్ఞత తెలుపుతూంటారు. ప్రజలు తనకు చేసిన సన్మానాలకు కృతజ్ఞతగా పరిశోధనతో ఋణం తీర్చుకోవాలనే తహతహ ఆయనలో తొణికిసలాడుతున్నది. ప్రజలు, ప్రభుత్వం అలాటి అవకాశం కలిగిస్తే ఆయన స్వమితంగా ఎంతో పని చేస్తానంటారు. అలాటి అవకాశం డాక్టర్ శాస్త్రికి కలుగుగాక అని హృదయ పూర్వకంగా ఆశిస్తున్నాను.



డాక్టర్ తంగిరాల వేంకట నారాయణశాస్త్రి


సామాజిక భాషా సదస్సు

సమాజం వివిధ వర్గాల సమావ్నాయం. వర్గాన్ని పాత పద్ధతిలో కులం అని అందాము. కులాలు ఇంకా పోలేదు గనుక, పోవడం సులభం కాదు గనుక కులాల భాష వివిధం. బుద్ధి, బుద్ధి ఎక్కువగా వున్న కులం భాష ఇతర కులాల భాష పై పెత్తనం చెలాయిస్తుంది. కొంతకాలానికి మరికొన్ని కులాలు పైకి వచ్చి, తమ భాషను సంస్కరించుకొన్నా, క్రమంగా పాత గాడిలోనే పడి పోతాయి. కారణం ఈ కక్ష్య భూవ్యాకర్ణ కక్ష్యకన్నా శక్తివంతమైంది. ఈ అంతరాలు వ్యావహారిక, గ్రాంధిక భాషల మధ్య గల అంతరాన్ని తొలగించాలనేది జూన్ 6, 7 తేదీలలో తెలుగు ఎకాడెమీలో జరిగిన సామాజిక భాషా శాస్త్ర గోష్ఠి ప్రధాన చర్చితాంశం. విద్యామంత్రి శ్రీ ఎం. వి. కృష్ణారావు ఈ గోష్ఠిని ప్రారంభిస్తూ పిల్లలు మాతృ భాషలో బోధిస్తే ఏ విషయాన్నైనా త్వరగా అవగాహన చేసుకోగలుగుతారని, వ్యవహార భాషకు, గ్రాంధిక భాషకు మధ్య గల అంతరం తొలగక పోతే, మాతృభాషలో బోధన అనే లక్ష్యం నెరవేరదని అన్నారు. భాషద్వారా సమైక్య సాధనకు ప్రయత్నించాలని ఆయన మరొక సూచన చేశారు. అధ్యక్షత వహించిన విద్యాశాఖా కార్యదర్శి శ్రీ చావలి శ్రీనివాస శాస్త్రి తమ ప్రసంగంలో చాలమంది ఉపాధ్యాయులకు విద్యార్థులకు తెలుగులో విద్యా బోధనకన్నా ఇంగ్లీషులో బోధన గొప్ప అనే భావం వుందని, దీనిని తొలగించడానికి ప్రయత్నించాలని అన్నారు. ప్రారంభంలో తెలుగు అకాడెమీ డైరెక్టర్ శ్రీ ఎన్. వెంకటస్వామి స్వాగతం చెబుతూ అకాడెమీ

(50వ పేజీ చూడండి)

సీరియల్

మనసోమా క్షోభమయు



ఎం.పి.ఆర్. రాధాకృష్ణ

(గత సంచిక తరువాయి)

సాయంత్రం పెళ్ళివారు వచ్చేసరికి వీళ్ళు చేయవలసిన ఏర్పాట్లు కూడా పూర్తయాయి.

పెళ్ళివారంటే – నలుగురే నలుగురు!

అబ్బాయి... అతని తల్లిదండ్రులు, ఆడపడచు...

కాఫీలు, టిఫిన్లు... మర్యాదలు, మొహమాటాలవంటి లాంఛనాలు పూర్తిఅయాక అసలు అంశం వచ్చింది.

సుజాతను తెచ్చి వాళ్ళ ఎదురుగా చాప మీద కూర్చోబెట్టారు.

వచ్చిన నలుగురూ 'అమ్మాయిని' చూపులతో శల్యపరీక్షచేసి... సంతృప్తి పడినట్లే కనిపించారు.

"ఫరవాలేదు కను, ముక్కుతీరు బాగానే ఉన్నాయి..." అంటూ తన సంతృప్తిని పబ్లిగ్గానే ప్రకటించేసింది, ఆడపడచు.

'అమ్మాయి ఏం చదువుతున్నదన్నారు?' అంటూ అడిగాడు అబ్బాయి తండ్రి!

'బియస్సీ... రెండో సంవత్సరం చదువుతూంది. అబ్బాయి యిష్టపడితే డిగ్రీ పూర్తి చేసుకోవచ్చు. మా అమ్మాయిని చెప్పుకోవడం కాదుగాని, చాలా తెలివైన పిల్ల! మెడిసిన్‌లో సీటు వచ్చేదేగాని... అంత కాలం చదివించే అభిప్రాయంలేదు "అన్నాడు చలపతి రావు.

"ఆడదాని చదువు, గోడకు కొట్టిన సున్నం ఒకటే! మా యింటి కోడలు చదువులు చదివి ఉద్యోగాలు వెలిగించాలా, ఊళ్ళేలాలా? ఎంత చదువులు చదివినా... చివరకు ఆడదానికి వంటిల్లే ఆఫీసు. ఏదో సంసారపక్షమైతేచాలు. చదువుకున్నపిల్లలు మొగుడ్ని, అత్తమామల్ని లెఖ్ఖచేస్తారా ఏమన్నానా?" అంటూ సాగదీసిందిఅబ్బాయి తల్లి!

ఆమె సువర్ణాభిప్రాయాలు విన్న చలపతి రావు దంపతులకు గుండెలు ఝల్లుమన్నాయి!

వాళ్ళ పరిస్థితిని గమనించిన మధ్యవర్తి, కల్పించుకొని... "అమ్మమ్మ... అంతమాట అనకండి మీ అభిప్రాయం నాకు తెలుసు కదా! మీకు సరిపడని సంబంధమైతే యింత దూరం ఎందుకు తెస్తాను, మిమ్మల్ని! చలపతిరావుగారి వంశమంటే... నిప్పువంటిదన్న మాట. ఊర్లోనే కాలేజీ వుంది. అమ్మాయిని ఊరికినే ఉంచడం దేనికనిగాని... పిల్లరత్నం కదండీ...' అన్నాడు.

"దానికేముంది లెండి. ఏదో మాట వచ్చింది కాబట్టి అన్నాను. అంతే!" అన్నారావిడ!

మిగిలినవాళ్ళ మనసులు తేలికపడ్డాయి.

"అమ్మాయికి సంగీత మేమైనా నేర్పించారా?" అంటూ అడిగింది ఆడపడుచు.

"పెద్దగా చెప్పించలేదమ్మా! శెలవుల్లో ఏదో... అది యిష్టపడి నేర్చుకున్నదే... ఓ నాలుగు కీర్తనలు వచ్చు" అంది కామాక్షమ్మ అప్పుడేదో సర్దాపడి నేర్చుకున్న సంగీతం సమయానికి అక్కరకు వచ్చినందుకు, సంబరపడిపోతూ!

"ఏదీ... ఓ కీర్తన పాడించండి..." అంది ఆడపడుచు.

"ఇప్పుడెందుకు, అవన్నీ! వద్దు.." అనేశాడు అబ్బాయి చిరాగ్గా!

"రక్షించాడు..." అనుకుంది సుజాత.

"అదేంరా? రేపు పెళ్ళయేక పాడించుకొన వచ్చుగా! నీకూ బుద్ధి పుడితే... వరస కలపొచ్చుకూడా!" అంది ఆడపడుచు. తన జోక్‌కు తనే నవ్వేస్తూ!

"అవునవును..." అంటూ మిగిలినవాళ్ళు కూడా నవ్వారు.

జరిగిన కథ 1: చలపతిరావు, కామాక్షమ్మలకు సుజాత ఒక్కతే కూతురు. సుజాత పెద్దన్న రామం ఉద్యోగంలేక, చిన్నన్న మురళి నాటకాల పిచ్చితోను తిరుగుతుంటారు సుజాత, అరుణ, రజని క్లాస్‌మేట్స్. అరుణ టెన్నిస్ ఆడే శేఖర్‌ని ప్రేమిస్తుంది.

అబ్బాయి తండ్రి... "ఇక వెళ్తాం..." అంటూ లేచి నిలబడ్డాడు అతనితో పాటు అందరూ లేచారు.

అప్పుడు చూసింది సుజాత అబ్బాయిని.

సన్నగా, పొడవుగా, తెల్లగా... 'ఫరవాలేదు...' అనుకుంది.

అబ్బాయి తండ్రి చలపతి రావుతో వెళ్ళొస్తాం బావగారూ! ఏ విషయం త్వరలోనే ఉత్తరం వ్రాస్తాంలెండి" అన్నాడు.

"ఉత్తరం దేనికిబాబూ! నేనేవస్తాను. మాపోతన దగ్గరకు" అన్నాడు మధ్యవర్తి.

"శుభం. అలానే కానివ్వండి" అన్నాయన.

వాళ్ళందరిని జట్కా ఎక్కించి, వాళ్ళు వెళ్ళిపోయినతరువాత ముఖం చాటంత చేసుకొని లోపలికి వచ్చాడు మధ్యవర్తి.

"వాళ్ళు మన అమ్మాయిని చూసేముందు నాలుగు సంబంధాలు చూశారు. ఎక్కడా యింత సాఫీగా జరగలేదు రంగు చాలదనో, అమ్మాయి ఎత్తు తక్కువనో, కళ్ళు చిన్నవనో, ముదురు పెద్దదనో ఏదోఒక వంక అబ్బాయి అక్కగారు ముఖంముందే అనేసేది. ఆవిడ ఇంతవరకూ మెచ్చుకున్నది మన అమ్మాయినే! పిల్ల వాళ్ళకు బాగా నచ్చిందని గ్యారంటీగా చెప్పొచ్చు ఈ సంబంధం సెటిల్ కావడం ఖాయం' అన్నాడు

"వాళ్లేమో తరం అయుండి ఉన్నారో! మనం తూగొద్దూ" అన్నాడు చలపతిరావు!

"అయ్యో. వాళ్ళకేదేముంది ఎంతైనా కావాలంటారు. మనం దేనికి తూగలేం. అందుకే తూగించుకోవాలి. అమ్మాయి వాళ్ళకు నచ్చింది కదా! సర్ది చెప్పి ఎక్కువ ఆశలు పెట్టుకునేలా లేరు ఓ రెండు అట్టూ, యిటూ! అంతే! మీకు మాత్రం ఎంత మంది ఆడపిల్లలున్నారని! ఉన్నదొక్కతే. అబ్బాయికి ఏడువందలవరకూ వస్తుందట ఒకటి రెండు వేలకు చూసుకుంటే... ఇంకెవరో తన్నుకుపోతారు మరీ ఆశకు పోతే అది వేరే విషయం కానీ... మన అందుబాటులోకి వాళ్ళను తెచ్చేపూచి నాది. సరేనా?" అన్నాడు మధ్యవర్తి!

చలపతిరావు మనసు కుదుటపడింది

"భారమంతా మీదే అనుకోవాలి మీ దయవలన ఈ సంబంధం కుదిరితే ...

అదే చాలు..." అంది, కామాక్షమ్మ!

"కుదరక పోతుందమ్మా! మీరు చూస్తూ ఉండండి. చక్రం తిప్పుకొస్తాను" అని చెప్పి... "ఇక నేను వెళ్తాను. మళ్లీ కలుద్దాం ..." అంటూ వెళ్లిపోయాడు. మధ్యవర్తి!

దానితో ఒక ప్రకరణం ముగిసింది.

ఆ రాత్రి సుజాతకు సరిగా నిద్ర పట్టలేదు. ఆమె మనసంతా ఆ పెళ్లిచూపుల కార్యక్రమంతో కకావికలైంది...

'నలుగుర్ని చూసి... అందులో ఒకర్ని ఎన్నుకుంటారట అబ్బాయికి నచ్చితే చాలు..

అమ్మాయి ఇష్టాయిష్టాల ప్రశక్తే లేదు

ఎవరినో ఒకరిని.. ఎంచుకుంటారు..

దుకాణంలో వస్తువును ఎంచుకున్నట్లు..

సంతలో పశువును... ఎన్నిక చేసినట్లు...

'ఏమిటి అన్యాయం...' అనుకుంది బాధగా!

'కట్నం కానుకలు బాగానే అడిగేలా ఉన్నారు. వాళ్లెంత అడిగినా ఇవ్వటానికి సిద్ధపడుతున్నారు, తనవాళ్లు!

కానీ.. ఎక్కడి నుండి తెస్తారు అంత పైకాన్ని?

అప్పుచేసో, రేహనా...

లేకపోతే ఈ యిల్లు అమ్మేస్తారు. తన తండ్రి తాతలకాలం నుండి తరతరాలుగా సంక్రమిస్తున్న ఆస్తి యిదొక్కటే...

ఈ నాటికి.. తన పెళ్లి ధర్మమా అని.. ఇంటివారసత్వం.. ఈ తరంతో ముగుస్తున్నాది.

ఈ దారుణం సహించకూడదు.

తనకీ పెళ్లి ఇష్టంలేదని. నిష్కర్షగా చెప్పేయాలి' అనుకుంది, దృఢంగా!

'కానీ ఎలా చెప్పడం. తన్నడక్కుండానే.. తనుయిష్టపడినట్లుగానే భావిస్తున్నారంతా..

అదీకాక. తనువద్దంటే తండ్రి బాధపడ్తాడు. తల్లి గోల పెడుతుంది. ఇరుగు పొరుగు వాళ్లు వింతగా నోళ్లు నొక్కుకుంటారు. అదిమరీబాధ..

సరే.. చూద్దాం. ఎలా వ్రాసిపెట్టి ఉంటే. అలానే జరుగుతుంది...' అనుకొని కర్మసిద్ధాంతాన్ని మనోపశమనం కోసం ఎరువు తెచ్చుకుంది, సుజాత!

కలత నిద్రతోనే రాత్రంతా గడచింది.

* * *

"ఏమిటే పెళ్ళిచూపులు నీకే...!!"

అంటూ ఆశ్చర్యపోయారు స్నేహితురాళ్లిద్దరూ!

"అదేమిటే... చెప్పాపెట్టకుండా పెళ్లిచూపులు పెట్టించేసుకున్నావ్! ఒక్క మాట చెప్తే మేం కూడా వచ్చేవాళ్లంగా..." అంది రజని!

"వచ్చి ఏం చేసేవారు?" నవ్వుతూ అడిగింది సుజాత.

"ఆ పెళ్లికొడుకుని ముప్పతిప్పలు పెట్టేవాళ్లం! సరే ఆ పని పెళ్లిలో చేస్తాను. ఇంతకూ అతను నీకు నచ్చాడా?"

"నచ్చకపోవడమనేది, ఆడపిల్లల డిక్షనరీలోనే లేదు..."

"బావున్నాడా?"

"అజానుబాహువూ, అరవింద దళాయతాక్షుడు కాకపోయినా బాగున్నట్టే లెఖ్ఖ!"

"ఉద్యోగం?"

"బ్యాంకులో..."

"మైగాడ్... అయితే సెటిలయినట్టేనా?"

"కావచ్చు..."



వారఫలం

మహేష్

1–7–1977 శుక్రవారం మొదలు
7–7–1977 గురువారం వరకు

మేషం :— ప్రయోజనంగల వ్యక్తులను కలుసుకొంటారు. స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. విద్యా వైజ్ఞానిక రంగాలో ఖ్యాతి లభిస్తుంది. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. రావలసినడబ్బు అందగలదు. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

వృషభం :— వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. మీకంటే పెద్దవారు ద్వారా మీ సహకారాన్ని కోరవలసి వస్తుంది. మీ కార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండానెరవేరతాయి స్త్రీలకు—విలాసవస్తువులు కొంటారు. పుణ్యకార్యాల చేస్తారు.

మిథునం :— సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది ప్రయాణంలో శ్రమకలుగుతుంది వారం మధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణిస్తుంది. మిత్రులు సహాయం చేస్తారు. స్త్రీలకు — ఆరోగ్యం బాగుండదు. సంతోషకరమైన సమాచారం అందగలదు.

కర్కాటకం : మీ ఆలోచనలు ఫలిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వారం మధ్యలో ఆందోళనకలుగుతుంది. లాభం రావలసిన వ్యవహారాల్లోన నష్టం రావచ్చును ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అనవసరమైన వ్యయం జరుగుతుంది.

సింహం :— మీ అంచనాలు తారుమారు కాగలవు. పోటీవారితో వాదప్రతివాదాలు తగవు. వారం మధ్యలో ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. రావలసిన డబ్బు అందగలదు. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. దైవ కార్యాలు నెరవేరతాయి.

కన్య :— వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. ఆనవ

"కంగాట్యులేషన్స్" అరుణ, రజని ఒక్కసారే అన్నారు!

"ఒకవేళ నీకు అబ్బాయి వచ్చలేదనుకో! ఏం చేస్తావ్?" అడిగింది అరుణ!

"నచ్చలేదని చెప్పేస్తాను" సుజాత నవ్వింది.

'ఒకవేళ మీవాళ్ళు బలవంతం చేస్తే ...!'

"చేసేసుకుంటాను."

సుజాత సమాధానానికి శ్రోత లిద్దరూ తెల్లబోయారు.

'అదేమిటే? నచ్చకుండా ఎలా చేసుకుంటావ్?'' అంది అరుణ.

"అందరూ అన్నీ యిష్టపడే చేసుకుంటున్నారనుకున్నావా? మధ్యతరగతి కుటుంబాల్లో ఆడపిల్లలకు పెళ్ళికావడమే ఒకవరం. బుద్ధున్న ఆడకూతుర్లెవరూ... అబ్బాయి అందచందాల గురించి పట్టించుకోరు..."

"చదువు ఆపేసి పెళ్ళి చేసుకోవడం మాత్రం నాకు నచ్చలేదే రెండేళ్ళు ఎలానూ చదివావు. ఒక్క సంవత్సరం ఆగితే... డిగ్రీ చేతికి వస్తుంది" అంది, రజని!

"డిగ్రీతో ఏం చేయమంటావు నన్ను?"

"అందరూ ఏం చేస్తున్నారు ?"

"వంట చేసుకుంటున్నారు ఆడదానికి వంటిల్లే ఆఫీసు ... తెలుసా!" సుజాత నవ్వింది.

"యూ బ్రూట్! వంట తప్పించి ఆడదాని జీవితానికింకో ధ్యేయమేలేదా ?" రజని చిరాగ్గా అంది.

"లేదు" సుజాత సీరియస్‌గా అంది. "అంతా సవ్యంగా జరిగితే నాక్కాబోయే అత్తగారి అమ్మాయ్ల అభిప్రాయం ఇది"

"అదే నిజమైతే నాకసలు వంటేరాదు" అంది అరుణ!

సుజాత నవ్వింది. "నేను చెప్పేది మా బోటి మధ్యతరగతివాళ్ళ విషయం. 'అబ్బాయి నచ్చడం' అంటే ఏమిటో తెలుసా? అతని ఉద్యోగం, రాబడి, పైరాబడి ఇవన్నమాట! అంతేగాని రంగు, రుచి, వాసనకావు! ఇక నాకు నచ్చడమంటావా ? మా పెద్దవాళ్ళకు నచ్చితే నాకూ నచ్చినట్టే! కాకపోతే మాట వరసకు ఓసారి మన అభిప్రాయం కూడా అడగొచ్చు, అమ్మాయి ఓటూ కాదనదనే ధైర్యంతో వాళ్ళు మన అభిప్రాయం అడిగారు కదా అని నచ్చలేదనిచెప్పే అధికారం మాత్రం మనకులేదు!" అంది.

"బాగానేవుంది నీ వాదన నాకుమాత్రం నచ్చలేదు. నా దృష్టిలో ఆడపిల్లకు వివాహ విషయంలో సంపూర్ణ స్వాతంత్ర్యం ఉండాలి. అలా వీలుపడకపోతే ఆడపిల్లలంతా ఎదిరించాలి." అంది అరుణ.

"నీవరకూ వచ్చాక అలానే ఓ విప్లవాన్ని లేవదీద్దువుగాని. లేవండి, క్లాసుకు వేళైంది" అంది రజని

కాలేజి విడిచిపెట్టిన తరువాత ఎవరిదారిన వాళ్ళు ఇళ్ళకు బయల్దేరారు. ఎల్లమ్మ తోట కూడలిలో బస్సుదిగి, నడవసాగింది, సుజాత. అక్కడికి వాళ్ళయిల్లు ఒక్క ఫర్లాంగు మాత్రమే.

"ఏమండోయ్ మిమ్మల్నే" అన పిలుపుతో

తమసోమా జ్యోతిర్గమయ

అన్యమనస్కంగా నడుస్తున్న సుజాత ఉలికి పడి, ఆగి, వెనుతిరిగి చూసింది.

వెనుకనున్న డాబాయింటి అబ్బాయి.

వడివడిగా దగ్గరకువచ్చి "మీతో మాట్లాడాలి..." అన్నాడు, ఆయాసపడిపోతూ.

అప్పుడే రెండుమైళ్ళు పరిగెత్తి వచ్చిన వాడిలా తెగ రొప్పుతున్నాడు, చెమటలు కక్కేస్తూ.

"మీరా!" అని ఆశ్చర్యపోయి... "నాతో ఏం మాట్లాడతారు?" అంది, సుజాత!

"ప్లీజ్! కాదనకండి. ఇది నా అభ్యర్థన.." అన్నాడతను. వేడికోలుగా!

సుజాత ఒక్కక్షణం ఆలోచించింది... అతను మాట్లాడబోయేదేమిటో తనకు తెలుసు.'ప్రేమించాను. పెళ్ళి చేసుకుంటాను.,' అనొచ్చు! లేదా... 'ఆరాధిస్తున్నాను. నెత్తిన పెట్టుకొని పూజిస్తాను' అనొచ్చు. అతనేమన్నా వినటానికి తనకా ఇష్టం అభ్యంతంలేదు. ఎటొచ్చీ...నలుగురూ చూస్తే బాగోదు...

"ప్లీజ్! కాదనకండి..."అతను మళ్ళీ అభ్యర్థించాడు.

"సరే.. చెప్పండి..."అంది సుజాత, ఆలోచనకట్టిపెట్టి!

"ఇలా.. రోడ్డుమీదనా?" అన్నాడతను, చుట్టూ చూసి.

"ఏం.. భయంగా ఉందా?"

అతను కొంచెం కంగారు పడ్డాడు..

"భయమా? నాకు భయమేమిటి? ఎవరైనా

పరమైన సందేహాలు కలుగుతాయి. రాజకీయ వ్యవహారాల్లో శ్రమకలుగు తుంది. మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. స్త్రీలకు—వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. ఆడంబరంకోసం వ్యయం చేస్తారు.

తుల :— అన్ని వ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా ఉంటుంది సాటివారిలో గౌరవం లభిస్తుంది వారం మధ్యలో వృత్తిలో ఆదాయం పెరుగు తుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది ప్రయాణాలోచనలు చేస్తారు. స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. బంధు మిత్రులను కల్సుకొంటారు.

వృశ్చికం :- వ్యాపారంలో సాటివారిపోటి తగ్గుతుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. స్త్రీలకు — పుణ్య కార్యాలు చేస్తారు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

ధనుస్సు :— వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులనుకల్సుకొంటారు. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. మీ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. సంతోషకరమైన వార్తలనువింటారు. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. శుభకార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

మకరం :— వృత్తిలో ఆదాయం పెరుగు తుంది. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు బాగుంటాయి. నూతన వ్యవహారాలు లాభిస్తాయి స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అలంకార వస్తువులు కొంటారు.

కుంభం : — చేజిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును. వృత్తిలో శ్రమకలుగు తుంది. వారం మధ్యలో మీ కార్యక్రమాలుబాగుంటాయి. సాటివారిలో గౌరవం బాగుంటుంది మీ ప్రయత్నాలు ఫలించగలవు. స్త్రీలకు — ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మీనం :— సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం మధ్యలో ప్రయాస కలుగు తుంది. లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును మీ తాలూకు మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. స్త్రీలకు — కుటుంబ వ్యవహారాల్లో శ్రమకలుగు తుంది. సంతానానికి సౌఖ్య,సంతోషాలు లభిస్తాయి.

చూస్తే బాపుండదు. నాగురించి ఏవరేమనుకున్నా ఖాతరు చెయ్యననుకోండి. కానీ. మీరు ఆడవాళ్లు కదా..''అన్నాడు.

''నేను ఆడదాన్ననే విషయం ఇప్పుడు జ్ఞాపకం వచ్చినట్లుంది. మీకు! రోడ్డుమీద నిలబెట్టి పలకరించినపుడే మయింది. ఆ జ్ఞానం!''సుజాత కటువుగాఅంది!

అతను తెల్లబోయి... అంతలోనే తేరుకున్నాడు..'' క్షమించండి! మీతోమాట్లాడా లంటే..ఇదొక్కటేదారి. మీకు అభ్యంతరం లేకపోతే.. రేపు రామకృష్ణా మిషన్ దగ్గర స్కాండల్ పాయింటుకు వచ్చారంటే.. అక్కడమనం మనసులు విప్పిమాట్లాడుకోవచ్చు. విపులంగా!''అన్నాడు,

''నాకు అభ్యంతరం ఉండదని ఏందుకనుకుంటున్నారు ? ఏవరో ముక్కూ, మొహం తెలీని వ్యక్తి ఏక్కడికి రమ్మంటే అక్కడకు వెళ్ళడానికి.. నేను పిచ్చిదాన్నికాను...''

''మీరలా అనేస్తే:ఏంచేసేది, నేను? మనసులు విప్పిమాట్లాడు కోవాలంటే, అంతకు మించి మార్గంలేదు...ప్లీజ్!''

'చూడండి..మీపేరేమిటో నాకుతెలీదు.' అంది. సుజాత.

''మోహన్...''హుషారుగా అన్నాడతను.

''చూడండి, మోహన్‌రావుగారూ! మీరేదో మనసుల్ని విప్పేయడం, మాట్లాడ్డం అంటున్నారు. అంతగా మనసుల్ని విప్పేసి మరీ మాట్లాడుకోవలసిన విషయాలు ఏముంటాయో నాకు తెలీదు. ఇక రేపు మీ కోరిక ప్రకారం బీచ్‌కి రావడమంటారా? అది అసంభవం. ఎందుకంటే, మీతో మనసు విప్పేసి మాట్లాడవలసిన విషయాలేం లేవు నాకు ! పైగా యిందాక మీరు గుర్తుచేసినట్లు నేను ఆడదాన్ని! పరాయి మగాడితో రహస్య సమాలోచనలు నాకునిషిద్ధం. ఇప్పటికే మీకు నామాటలు అర్థం కాకపోతే మీకేమన్నా తెలివితేటలు, మెదడు అంటూ వుంటే అవన్నీ వ్యర్థమే. వస్తా. గుడ్ బై'' అని మరో మాటకు అవకాశం ఇవ్వకుండా వడివడిగా నడిచి వెళి పోయింది సుజాత!

అతను అవాక్కయి నిలబడిపోయాడు.

సుజాత యింటికిచేరి, స్నానంచేసి, బట్ట మార్చుకొని, తల్లి అందించిన చాట తీసుకొని, బియ్యంలోని రాళ్ళు ఏరుతూంటే ఊడిపడ్డాడు మురళి!

బెడ్డింగు మధ్యగదిలో పడేసి. దాన్నివిప్పి, పెద్ద కప్పొకటి బయటకు తీశాడు.

అప్పుడే అటుగా వచ్చిన కామాక్షమ్మ కొడుకును చూడగానే సంబరపడిపోయింది.

''వచ్చావ్రటా! ముందు వెళ్ళి స్నానం చెయ్యి. ఈలోగా కాఫీ కలిపి తెస్తాను'' అంటూ లోనికి పోబోతే మురళి ఆమె చేయి పట్టి ఆపాడు. ఆపి, కప్పును ఆమెకు చూపించాడు.

''ఏమిట్రా అది?'' కప్పును పరిశీలనగా చూస్తూ, అడిగింది ఆమె!

''వెండికప్పు! నీ కుమారరత్నం నటనా చాతుర్యానికి మెచ్చి ప్రథమ ఉత్తమ నటునిగా ఏన్నికచేసి మెచ్చి యిచ్చిన అపూర్వ బహుమానం. రాజమండ్రి పరిషత్తులో నన్ను సన్మానించారు కూడా'' అన్నాడుమురళి గర్వంగా!

''కాయ్ కోతలు'' అంది సుజాత!

'నీకు అలానే వుంటుందే! ఇంట్లోవాళ్ళకు నేనో చవటాయిలా అనిపిస్తానుగాని... ఊర్లోనికి వెళ్ళి అడుగు 'మురళీ'ది గ్రేట్' అంటే ఏమిటో తెలిసివస్తుంది'' ఉక్రోషంగా అన్నాడు!

''నాటకాల రాయుడంటారు. అంతేగా!'' సుజాత నవ్వింది!

''చూశావమ్మా.. దానిపొగరు!'' మురళి, తల్లికి ఫిర్యాదుచేశాడు.

కామాక్షమ్మనవ్వింది. ''ఇంకెంతకాలంరా. ఆపొగరు! దాన్నిచూసుకోవడానికి పెళ్ళివారు వచ్చారుగా!'' అంది.

''నిజం!!'' మురళి ఆశ్చర్యంగా అన్నాడు.

''ఈవాళో.. రేపో: వాళ్ళదగ్గరనుండి కబురు కూడారావచ్చు. ఆసంగతికేం గాని.. నువ్వెళ్ళి స్నానంచేసిరా!'' అంది కామాక్షమ్మ!

''స్నానానికేముందిలేవే! ఇంతమంచికబురు విన్నతరువాత స్నానం చేయకపోయినా ఫరవాలేదు. అదేదో తర్వాతచేస్తాను గాని.. ముందు కాఫియివ్వు...'' అన్నాడు, మురళి !

''ఆచేత్తోనే నాక్కూడా కొంచెం'' అంది,సుజాత!

''నువ్వు స్నానం చేసేముందు తాగావుగా'' కామాక్షమ్మ అంది.

''తాగిందిలేవే స్నానం చేశాక యింకో సారి తాగకూడదని రూలుందేమిటి? ఎప్పుడు మనసుపుడితే అప్పుడు తాగగలిగేది కాఫీ

తమసోమా జ్యోతిర్గమయ

వక్కటే! తీసుకురా, పాపం! పెళ్లయితే ఆ మొగుడుగారు కనీసం కాఫీ అయినాపోస్తాడో లేదో..దీనికి..'' అన్నాడు, మురళి!

కామాక్షమ్మ నవ్వుకుంటూ లోనికి వెళ్ళింది.

''ఇప్పుడు చెప్పవే..బుల్లెమ్మా! అబ్బాయి గారెలా ఉన్నారు?'' అని అడిగాడు, మురళి!

''కోతిలా...'' సుజాత, నవ్వింది.

''అంటే కోతిబావన్నమాట! తోకఉందా?'

''ఛీ .ఫో...'' సుజాత సిగ్గుపడింది.

''అబ్బో. అంతసిగ్గేమిటే! మనలోమన మాట. నీకు నచ్చాడా?''

''ఏమో...''

''అదేమిటే?'' మురళి ఆశ్చర్యంగా అన్నాడు.

''ఏమిట్రా..'' అంటూ వచ్చింది, కాఫీ కప్పులతో!

''అబ్బాయి నచ్చాడా, లేదా..అని అడిగితే.. చెప్పడంలేదు, చూడు..'' అన్నాడు మురళి, కాఫీ కప్పు అందుకుంటూ!

రెండో కప్పు సుజాతకు అందించింది. కామాక్షమ్మ...''అదేంచెప్తుందిరా! అయినా యిందులో నచ్చకపోవడానికేముంది? అబ్బాయి కుదురుగా ఉన్నాడు..మంచి ఉద్యోగం చేసుకుంటున్నాడు. చాలదూ!'' అంది.

''చాలదమ్మా! అన్నిటికంటే ముఖ్యం మనసులు కలవాలి. అవి కలవనప్పుడు ఎన్ని ఉన్నా లాభంలేదు'' అన్నాడు మురళి.

''చాల్లే ఊరుకో'' కామాక్షమ్మ కసురుకుంది.

''ఊరుకోను. ఏందుకు ఊరుకోవాలి? అసలు పెళ్లంటే ఏమిటి? నూరేళ్ల అనుబంధం. అవునా? ఆ అనుబంధమనే దానికి ప్రేమ - పట్టుకొమ్మ! ప్రేమలేని పెళ్లి ఎరువులేని పంటలా నిస్సారమైపోతుంది. కాబట్టి...''

మురళి మాటలకు మధ్యలోనే అడ్డుతగిలి అంది, కామాక్షమ్మ. ''కాబట్టి నువ్వు నోరు మూసుకొని స్నానంచేసిరా!''

''ఏంచేస్తాం! వినేరసజ్ఞులు కరువయారు. ఇదే డైలాగు స్టేజిమీద చెప్తే జనం వళ్ళు మరిచి కొట్టేస్తారు, చప్పట్లు'' అని లేచి, తువ్వాలు అందుకొని స్నానానికి వెళ్ళిపోయాడు.

మురళి మాటలకు సుజాత నవ్వుకుంటూంటే, బయటినుండి వచ్చాడు రామం.

''ఏమిటే అమ్మడూ నీలోనువ్వే నవ్వేసుకుంటున్నావు'' అన్నాడు కూర్చుంటూ.

''చిన్నన్నయ్య వచ్చాడులే' అంది సుజాత.

ఆమె పక్కనేఉన్న వెండి కప్పును చూసి ''ఓహో ఏదో ప్రైజు కొట్టేసినట్లుందే అబ్బాయిగారు'' అన్నాడు.

''మనం గుర్తించంగాని మంచి 'టాలెంట్' ఉంది, వాడికి'' అంది సుజాత.

''సర్లే నువ్వేమెచ్చుకోవాలి వాడిని'' అంటూ చప్పరించేశాడు రామం.

మాటల్లోనే చలపతిరావు కూడా వచ్చేశాడు.

''ఎప్పుడూ లేదు. నాన్న ఈరోజు పెందలాడే వచ్చేశారేం చెప్మా'' అన్నాడు రామం వీలైనంత చిన్నగా.

కానీ ఆ మాటలు ఆయన చెవిన పడనే పడ్డాయి.

బట్టలు మార్చుకొనివచ్చి ''ఏమిటోయ్ శ్రీరామచంద్రా, అంటున్నావ్'' అంటూ వాలుకుర్చీలో చారబడ్డాడు.

''అబ్బే నేనేమన్నాను'' అని తడబడి చెల్లెలివైపుచూసి ''నేనేమన్నానే'' అన్నాడు రామం.

వాడే మాన్యుడు!

ఎందుకయ్యా వాడినింకా
దోచుకుంటారు ?!
తినటానికి తిండి లేదు,
మొలచుట్టూ బట్ట లేదు,
ఎండా, గాలీ, వానలకు,
తలదాచే చోటులేదు !
ఈ గాలిలో విన్నారా ?
అతగాడి జాలిగాధే వినిపిస్తున్నది !
ఈ ధూళిలో చూశారా
అతగాడి వ్యధే కనిపిస్తున్నది !
కష్టజీవి వాడేనని,
కర్మజీవి వాడేనని,
నింగిసాక్షి నేలసాక్షి !
రవి చంద్రులు, నిత్య సాక్షులు !
పంచ భూతాలకు మాన్యుడైనా అతను
మన కంటికిమాత్రం అతి సామాన్యుడే !

— ఎస్. డి. సౌజన్య

సుజాత. నవ్వును పెదాలమధ్య బిగించి రాళ్ళు ఏరసాగింది.

"ఏమే అయిందా, నీ రాళ్లేరడం..." అంటూ వచ్చింది, కామాక్షమ్మ! భర్తను చూసి "అహా మీరు వచ్చేశారే చూళ్లేదు, నేను" అంది కాస్త ఆశ్చర్యంగా!

"ఇంటిల్లిపాది మహా ఆశ్చర్యపోతున్నారు. నేను మాత్రం కాస్త ముందు రాకూడదా ఏమిటి?" అన్నాడు చలపతిరావు నవ్వి!

కామాక్షమ్మ చాట అందుకొని లోనికి వెళ్ళి కాస్సేపటిలో కాఫీకప్పులతో వచ్చింది. ఒక కప్పు చలపతిరావుకు అందించి ఇంకొక కప్పు రామానికి అందించింది.

"అబ్బాయికి మరో రెండు మూడు నెలలలో ప్రమోషన్ వస్తుదంట." అన్నాడు చలపతిరావు కాఫీ చప్పరిస్తూ!

"అబ్బాయేమిటి? ప్రమోషనేమిటి? ఈ బడుద్దాయి లిద్దరికీ ఉద్యోగాలుకూడా లేవే!" అనుకొని ముందు తెల్లబోయినా అతను చెప్పిందితర్వాత అర్థమయింది కామాక్షమ్మకు

"ఓహో..." అంటూ తనూ చతికిల పడింది నేలమీద!

"ఏ విషయం రాత్రికి కబురు వస్తుంది" అన్నాడు చలపతిరావు కాఫీకప్పు కిందపెడుతూ

అప్పుడర్థమయింది అందరికీ చలపతిరావు తొందరగా ఆఫీసునుండి వచ్చేసిన కారణం.

ఇంతలో స్నానం ముగించుకొని మురళి వచ్చాడు. తండ్రినిచూసి గతుక్కుమని అంతలోనే సర్దుకున్నాడు.

"ఏరా నటశేఖరా? ఎప్పుడు రాక?" అంటూ అడిగాడు చలపతిరావు.

"అదేమిటి? నా ప్రైజు నాన్నగారికి చూపించలేదా?" అంటూ ఆశ్చర్యపోయాడు మురళి!

"తమరికి ప్రైజుకూడా వచ్చిందేమిటి? అని వ్యంగ్యంగా నవ్వి "ఓ రెండు రోజులు ఇంటిపట్టున ఉంటావా! మళ్లీ ఏదైనా ప్రోగ్రాముందా!" అని అడిగాడు చలపతిరావు

లేదన్నట్లు తలాడించాడు మురళి.

సంభాషణ మళ్లీ పెళ్లి కబుర్ల వైపు తిరిగింది!

అవి అంతులేని కబుర్లు.

అనుకున్నవే మళ్ళీ మళ్లీ అనుకోవడం...

అబ్బాయి చదువు, ఉద్యోగం, జీతం, గుణగణాలు...

కట్నాలు..కానుకలు...

ఎంతలో ఉంటారో?

ఐదువేలా?

అబ్బే..అంతతక్కువా?

పదివేలయితే— కష్టమే...

ఆరేడువేలయితే., ఫరవాలేదు.

లాంఛనాలు ఏమాత్రం అడుగుతారో...

వెండిచెంబు..పట్టుపంచ, పీటలమీదికి...

అబ్బాయికి, సూటు—

రిస్టువాచికూడా అడగొచ్చు, అలక పాన్పు మీద...

ఇవన్నీకాక—పెళ్ళి ఖర్చులు.

సారెకూడా ఘనంగానే పెట్టాలి.

* * *

సమయం గడిచి పోతున్నాది. ఎదురు చూస్తున్న వ్యక్తి ఎంతకూ రాడు. ఒక్కొక్కరే లేచి భోజనాలు ముగించేసరికి ఏనిమిదిన్నర అయింది.

కామాక్షమ్మ వంటిల్లు సర్ది, చేతులు కొంగుకు తుడుచుకునే సమయంలో దిగాడు, మధ్యవర్తి!

"అమ్మా! కామాక్షమ్మా..ఏదీ నానోరు కాస్త తీపిచెయ్యి..అంటూ" గట్టిగా అరిచాడు మధ్యవర్తి, హుషారుగా!

దానితో... అతను శుభవార్తే మోసు కొచ్చాడని తెలిసిపోయింది. అందరికి! ఉత్సాహంగా ఆయనచుట్టూ చేరారు.

"ఇదిగో.. తీసుకోండి, అన్నయ్యగారూ.." అంటూ మైసూరుపాకు ముక్క అందించింది. కామాక్షమ్మ అతనికి!

అతను, ముక్క కొరికి నోట్లోవేసుకుని.. "అహా.. దివ్యంగా ఉంది. పెళ్లికికూడా యిటువంటి తీపే చేయించాలి, మరి.." అన్నాడు గట్టిగానవ్వి!

అసలు విషయం తెలిసింది కాబట్టి.. ఇక మిగిలిన విషయాలు తెలుసుకోవాలనే ఆత్రుత పెరిగింది, అందరికి!


అతను..సావధానంగా కూర్చొని, మొదలు పెట్టాడు:

"వాళ్ల ఊరు వెళ్ళొచ్చాను. వాళ్ళకు అన్ని విధాల .మనసంబంధమే నచ్చిందట. వీలైనంతత్వరలో ముహూర్తం పెట్టించమన్నారు. ఆ పైన మీ యిష్టం" అన్నాడు.

"కట్నాలూ, కానుకలూ" అంటూ నసిగాడు చలపతిరావు. అతని ఆరాటమంతా అది తెలుసుకోవాలనే!

"ఇదిగో దానికే వస్తున్నాను" అనిగొంతు సవరించుకొని "మొన్న అనకాపల్లిలో వాళ్ళో సంబంధాన్ని చూశారా... వాళ్లేమో ఇరవైవరకూ యిస్తామన్నారట. అంతకు ముందు ఈ వూళ్ళోనే యింకో సంబంధాన్ని కూడా చూశారు. వారికేమో బోలెడంత ఆస్తి... ఉన్న దొకతే పిల్ల. వాళ్ళతదవంతరం...అంతా ఆడపిల్లదే కాబట్టి కట్నాల ప్రసక్తి లేక పోయినా... లాంఛనంగా ఓపాతిక వేలు పారేస్తామన్నారట! ఇహపోతే... మనసంగతి ... మన స్థితిగతులన్నీ ఉన్నదున్నట్లు వాళ్ళకు చెప్పాను. పిల్ల ముఖ్యంగాని సర్దుబాట్లు చేసు

(35 వ పేజీ చూడండి)



ఉప్పు కళ్ళు

పాలడుగు వెంకటేశ్వర రావు



ఒకరోజు సాయంత్రం స్కూలు నుంచి ఇంటికి రాగానె మంగమ్మ మూర్తిని అడిగింది.

'ఏవిటి అలావున్నారు?' అని. మంగమ్మ మూర్తి ధర్మపత్ని.

'ఎలాగున్నాను?' అని ఎదురు ప్రశ్నయితే వేసాడుగాని మూర్తి సంతోషంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నాడని అతనికీ తెలుసు.

'అదే. కళ్ళు మెరుస్తున్నాయి! ఉబ్బి లింగళ్ళాగ వున్నారు!! సంతోషంతో తబ్బిబ్బవుతున్నట్టుగ వున్నారు' అని పాయింటు తీసింది మంగమ్మ. చివరికి 'నిజమే' అని ఒప్పుకున్నాడు మూర్తి.

'అదితెలుస్తూనె వుంది. కారణ మేమిటి? అని! 'ఎరియర్సు' గాని వచ్చిజేబు బరువయిందా?' అని మరలా పృచ్ఛించింది మంగమ్మ ఉత్సాహంగా.

'ఉహూ'అన్నాడు మూర్తి.

'అమ్మాయికి మంచిసంబంధం ఏదన్నా దొరికిందా?'

'ఊ హూ.'

'పోనీ; ఏదరయినా గ్రీటింగు కార్డు'మీద నాలుగు కిలోల పంచదార దొరికి నట్టుందనుకుంటాను.'

'అదీకాదు' అన్నాడు మూర్తి,

అలాగ సవాలక్ష ప్రశ్నలు వేసి అతని ఆనందానికిగల కారణం తెల్సుకుని తనూ ఆనందిద్దామని ప్రయత్నించింది మంగమ్మ. కాని ప్రతిదానికీ ఉహూ, కాదు అనిసమాధానం చెప్పి ఆమెని నిరుత్సాహ పరచి ఆవేశం తెప్పించాడు మూర్తి.

'మరేమిటి నా పిండా కూడు? అదేదో చెప్పి తగలడ గూడదూ?' అని అరిచి విస్ఫురించింది మంగమ్మ. చివరికి విషయం బయట పెట్టాడు మూర్తి, చిద్విలాసంగా.

'రాజమండ్రి నించి ఉత్తరం వచ్చింది' 'చాలాకాలమయింది. మిమ్మల్నందర్నీ చూడాలనిపించింది. సోమవారం వస్తున్నాను' అని చంద్రం ఉత్తరం రాసాడు—' అని మూర్తి చెప్పగానె మొహం అదోక లాగ పెట్టుకుంది మంగమ్మ; బయటికయితే ఏమీ అనలేదుగాని అర్జంటుగా లోపలికి వెళ్ళిపోయి తన పనిలో చొరబడింది.

చొక్కా తీసి వంకీకి తగిలించి, మొహం కడుక్కుని, చిరుగుల బనీనుతోనే- విరిగిన

పడకకుర్చీలో జాగర్తగా కూర్చుని, పేపరు చదవటంలో మునిగి పోయాడు మూర్తి. కాసేపటికి అది అవతల పడేసి ఆలోచనలో పడ్డాడు.

–ఆమర్నాటి నుంచే తన ప్రయత్నంలో పడ్డాడు మూర్తి.

నెలాఖరు రోజులు.

చేతిలో పైసా లేదు.

మిత్రులందర్నీ అడిగేడు. తెల్సిన వాళ్ళందర్నీ సిగ్గు విడిచి అప్పుకోసం పాధేయ పడ్డాడు 'పాపం ఇదుగో' అని ఇచ్చిన వాడు ఒక్కడూ దొరకలేదు.

సుమారు పదేళ్ళయింది చంద్రాన్ని చూసి

ఈమధ్యలో రాక పోకలే లేవు!

ఇన్నాళ్ళ తర్వాత అభిమానం కొద్దీ చూసి పోదామని వస్తున్నాడు, చంద్రం. చేతిలో పైసా లేకుండా తమ్ముడ్ని ఆదరించి ఆలనా పాలనా ఎలాగ చూడటం!

నానా విధాల ప్రయత్నాలు చేసీ నిరుత్సాహ పడ్డాడు మూర్తి.

ఎంతో మధనపడి చివర్కి అలాగ అనుకుని ఆపని చేసాక గాని మూర్తి మనసు కుదుట పడలేదు.

అయితే- సోమవారంనాడు చంద్రం వస్తాడనగా ఆదివారంనాడు మంగమ్మ మూర్తిని అడగనే అడిగింది.

'ఏమండీ! మీచేతిని వుండే గడియారం ఏది?'

'ఉంది లేవే?'

'షాపులో రిపేరుకి ఇచ్చాను.'

'ఆబోడిగడియారాన్కి రిపేర్సు కూడానా? ఇంత తగలెయ్యాలి?'

'మరేం చెయ్యమంటావు?'

'తీసి అవతల పారెయ్య లేకపోయారూ?'

'అంతా పనే నేసాతే'

'అదేమిటి?!'

'పారెయ్య మన్నావుగా? నువ్వే అంటివి.'

'ఏదో అన్నానని నిజంగా పారేసారా?! ఇంతకీ అది ఏమయింది? నిజంగా రిపేరుకి ఇచ్చారా?'

ఆ గడియారం మూర్తికి వుద్యోగం వచ్చిన కొత్తలో భార్యాభర్తలు ఇద్దరూ వెళ్ళి ముచ్చటపడి కొనుక్కొన్నది. దాని అప్పటి ఖరీదు నూటయాభై రోజూ ఎన్నుకున్నా ఏమనుకున్నా ఆ భార్యాభర్తలమధ్య అపేక్షలు ఇంకా అటువంటి వాటి రూపంలో నిల్చి వున్నాయి!

అందుకే మంగమ్మ కంగారుపడి ఆ గడియారం ఏమయిందీ చెప్పమని రొక్కించింది మూర్తిని. అమ్మేశానని ఒప్పుకున్నాడు మూర్తి చివరికి.

దానిమీదె దగ్ధయాగం అయింది.

పిల్లల పీపులు మోగి ఆ రాత్రి భార్యాభర్తలు కోపంతో నిరాహారదీక్ష పూనారు.

సోమవారం వుదయమే చిన్న సూట్కేసు పట్టుకొని చంద్రం దిగాడు.

చంద్రం ఇప్పుడు నిరబడ్డాడు.

మనుపుదేలాడు.

ఉషారుగా వున్నాడు.

కులాసాగా కబుర్లు చెప్పాడు.

అన్నగారి పిల్లలకి స్వీట్సు తెచ్చి పంచాడు.

గడియారం అమ్మగా వచ్చిన డబ్బులో కొంత భార్య చేతికిచ్చాడు మూర్తి. లోపల ఏమనుకున్నా ఆ నాల్గు రోజులూ మరిదికి బాగానే మర్యాదలు చేసింది మంగమ్మ అదే పదివేలని సంతృప్తిపడ్డాడు మూర్తి.

అన్నదమ్ములిద్దరూ ఆప్యాయంగా కలిసి తిరిగారు. తెల్సిన వాళ్ళకి గొప్పగా తమ్ముడ్ని పరిచయం చేసాడు మూర్తి. ఖర్చు విషయంలో చంద్రం ఇప్పుడూ అంతే.

పిచ్చ ఖర్చు పెడతాడు! ఆ దురలవాటు వాడ్ని వదిలిపోనలేదు.

వద్దు మొర్రో అన్నా వినకుండా – హోటళ్ళకి తీసుకెళతాడు. ఇంటిల్లిపాదినీ సినిమాకని లాక్కువెళ్ళాడు. బజార్లో కనపడిన ప్రతిదీ కొన్నాడు. చేతికి ఎముక లేకుండా ఖర్చుచేసాడు.


రాజమండి చంద్రం అత్తవారి వూరు, పదేళ్ళకితం పెళ్ళయి అతను అక్కడే స్థిర పడ్డాడు. ఇంకా పిల్లలు లేరట! ఏదో వ్యాపారం చేస్తున్నానంటాడు. బాగానే వున్నట్టుంది. తమకా, తలిదండ్రులిచ్చిన ఆస్తిపాస్తులు మిగిలిలేవు. ఉన్నకాస్తా అప్పుడే అలాగ హారతి కర్పూరంలాగ హరించి పోయింది. పోయింది పోగా వున్న అన్నదమ్ము లిద్దరూ గుట్టుగా పరువుగా బ్రతుకు తున్నారు. అదేచాలు అన్న తృప్తి మూర్తికి.


ఇపుడు చంద్రానికి కాలునిల్చి స్థిరపడినందుకు ఎంతో సంతోషమన్పించింది మూర్తికి.

చిన్నప్పుడు చంద్రం నానాయాతన పెట్టాడు.

బుద్ధిగా చదువుకోరా అంటే వినేవాడు కాదు. ఇంట్లో దొరికింది పట్టుకుపోయి బస్తీవెళ్ళి తగలేసి వచ్చేవాడు. అప్పులు చేసే వాడు. తల్లి మొత్తుకునేది. తను ఏమి చెయ్యటానికి తోచక బిగదీసుకుని వుండేవాడు ఇప్పుడే ఇలాగ తయారయిన వీడు ఏమయి పోతాడని తల్లి బెంగపెట్టుకొనేది. చివరికి ఆ బెంగతోనె తల్లి పోయింది. తండ్రి ఎప్పుడో పోయాడు.

చివరికి – ఇల్లు అమ్మేటప్పుడు తనతో





ఉప్పు కళ్లు

తగాదా పెట్టుకున్నాడు చంద్రం. అందుకనె ఇన్నిరోజులూ సంబంధాలు లేవు. పోయింది పోగా అభిమానాలు కూడ అలాగ కరువయి పోయేయి.

జలోయి కర్పులు పెడతాడని మరిది మీద చిన్నచూపు మంగమ్మకి.

ఎవరి పరిస్థితి ఎటువంటిదయినా ఎవరీ 'దేహీ' అని యాచించనే కూడదు. అప్పుడు ఆత్మాభిమానం దెబ్బతింటుంది. ఎదుటివాడు బంధువైనా మిత్రుడయినా తిరస్కారం చూపిస్తాడు. ఆ దృష్టి లేదు చంద్రానికి.

తన కాళ్ళమీద తను నిలబడలేనివాడు కట్టుకున్నదాని ఎదుట కూడా పలచనై పోతాడు. కొంత వయస్సు మీదపడినాక ఇంకా ఇతర్ల మీద ఆధారపడాలనుకోవటం మనిషి అస్తిత్వాన్ని దెబ్బతీస్తుంది తను ఆ సంగతి చెప్పాడనె చంద్రానికి తన మీద ద్వేషం, కసి

అభిమానానికీ ద్వేషానికీ గల సరిహద్దు రేఖ చాలా పలచనయినది. అందుకే అనుబంధాన్ని తెంచుకుని దూరమయిపోయాడు చంద్రం.

ఇది గతం.

బాధా పూరితమయిన తమ్ముడి దురవస్థ చరిత్ర ఇన్నాళ్లకి తనని తను తెల్సుకున్నాడు చంద్రం. లోకతత్వాన్ని అర్థంచేసుకున్నాడు పరువుగా గుట్టుగా తన బ్రతుకుని తను లాగుకొని వస్తున్నాడు. మరుగున పడిన అభిమానం జాగృతమవగా ప్రేమతో పరామర్శకి వచ్చాడు అంత దూరాన్నుంచి ఇప్పుడు.

అందుకే ఎంతో సంతోషించేడు మూర్తి. గుండె పొరలలోను అంతరాంతరాలలోను ఇన్నాళ్ళుగా అదే మూర్తి కోరుకున్నదీను. ఆ నాల్గు రోజులూ సర్దాగా గడిపాక—

అయిదోనాడు—

'నేను రేపుదయమే వెళ్తానన్నయ్యా' అన్నాడు చంద్రం.

'అదేమి టూ! రాకరాక వచ్చావు. మరదలినీ తీసుకురాకపోతివి. ఉన్నట్టే లేదని మీవదిన ఒకటే ఇదిగా అంటుంది. తొందరేమి? మరి నాల్గు రోజులు పోయాక వెళ్లవచ్చులే' ఆప్యాయతతో అన్నాడు మూర్తి.

'టైము లేదన్నయ్యా ముందు గుడివాడ వెళ్లాలి. అక్కడ మనవాళ్ళందర్నీ కూడా చూడాలి. వదినగారు నాకోసం చూస్తూ వుంటాడు.'

'చూడవచ్చునులే.'

'పోనీ అక్కడే నాల్గురోజులుండి వెళ్లేప్పుడు మరల వస్తాలే.'

'సరే అలాగే చెయ్యి.'

ఆ రాత్రి అన్నదమ్ములిద్దరూ ఆరుబయట ప్రక్కప్రక్కన మంచాలు వేయించుకుని ఎన్నో కబురు చెప్పుకున్నారు. చిన్ననాటి సంగతులు పూర్తిగా తెలిసిన సంగతులూ మరెన్నో విషయాలు దొరిపోయాయి ద్దరికి కంటికి కునుకు వచ్చేసరికి అర్ధరాత్రి దాటింది.

మర్నాడుదయమే చంద్రం ప్రయాణానికి సిద్ధమయాడు.

మూర్తి మనసు బాధతో వూగిసలాడింది. అందరికీ చెప్పి వీధిలోకి వచ్చాడు చంద్రం. తమ్ముడ్ని అనుసరించాడు చంద్రం.

'అన్నయ్యా. మాట' గుసగుసలాడాడు చంద్రం.

'ఏం టూ?' దగ్గరకి వెళ్ళాడు మూర్తి.

'జేబులో డబ్బులు లేవు. రెండొందలుంటే ఇవ్వు.'

గతుక్కుమన్నాడు మూర్తి. మనసులో తళతళ మెరుస్తువున్న అద్దం భళ్ళున బ్రద్దలయింది. సిగ్గుతో, అవమానంతో తలవంచుకున్నాడు, మూర్తి తనే.

గడియారం అమ్మగా వచ్చిన డబ్బులో, ఖర్చయింది అవగా ఇంకా ఓ వంద మిగిలి వుంది. అది తీసి చంద్రం చేతిలో పెట్టాడు మూర్తి.

'వస్తానన్నయ్యా' సంతోషంగా కదిలాడు చంద్రం.

'తమ్ముడూ మరల రావద్దులే. అటునించి అటే రాజమండ్రి వెళిపో జాగర్త. ఉంటాను' గిరుక్కున వెనుదిరిగాడు మూర్తి. అలాగ అన్నందుకు ఒకక్షణం ఆశ్చర్యంగా అన్నని చూసి సాగిపోయాడు చంద్రం.

కళ్లలో పొంగిన కన్నీటిని తుడుచుకుంటూ లోపల్కి వచ్చాడు మూర్తి.

చంటిముండ గోలగోలగా ఏడుస్తోంది.

దాని వీపుమీద రాండోలు మోత మోగించింది మంగమ్మ.

అందుకు కారణం వుంది. పొయిమీంచి దించిన పాలగిన్నెలో తెలిసి తెలియక ఆకతాయి తనంగా ఉప్పుకల్లు వేసింది చంటిది.

పొంగిన పాలన్నీ విరిగిపోయాయి!

పి.హెచ్. కె ఆర్ — రాజమండ్రి

మీ జవాబులు చంద్రునిలో మచ్చలాగా ఈ పత్రికలో వుండడం.

బాగా లేదంటారు! కాని మచ్చలేని చంద్రుణ్ని మీరు ఊహించ కలరా ?

ఎమ్. ఎస్. ఆర్ — గుంటూరు

మనసులు కలిశాయి. మూడు ముళ్ళు వేసుకుందాం అనుకొనేసరికి. ఆవిడ ఆత్మీయులు తన ఆస్తిని కబళించాలని మా ఇద్దరి మధ్య విఘాతం కల్పించి.

ఆస్తి లేకుండా ఆవిడ వద్దు కబోలు మీకు! అసలు గొడవ అదీ— అంతేనా ! ?

వి. ఎ. ఎన్ — దమ్మాయిగూడెం

మనిషికి జీవితంలో కావలసిందేమిటి ?

ఒక పిడికెడు సానుభూతి! అది లభిస్తే ఎలాంటి బాధలనైనా ఎదుర్కొని బయటపడ వచ్చు.

వి. ఎస్. — అల్వాపల్లి


ప్రతి కాలేజీ అమ్మాయి కాలేజి ఆవరణలోకి వచ్చేసరికి అతివయ్యారంగా నడుస్తుంది ఎందుకని ? కుర్రాళ్ళు చూస్తున్నారని భ్రమపడా ?

కాదు. ఏ వాణిశ్రీయో ఏ సినిమాలోనో కాలేజి గరల్‌గా అలానడిచి ఉంటుంది! అందుకని !

ఎన్. ఎస్. ఆర్ — రాయ్‌పూరు

భగవంతుడు అందరినీ ఆడవారిగా ఎందుకు సృష్టించలేదు ? మగవారిని కూడా ఎందుకు సృష్టించాడు ? ఆడవారికి అండకోసమా ?

ఆదామ్ యీవుల కథ అడ్డం చెప్పకండి! ఆదామ్‌కి ఒంటరితనం సహించరానిదై తనపక్క టెముక యిచ్చి స్త్రీని సృష్టింప చేసుకున్నాడు! అందుకే ఆడది అర్ధాంగి అయింది కాబోలు !



ఎల్. వి. ఎస్ — గూడూరు

మన ముసలి హీరోలు వయసు అమ్మాయిలతో నటించాలనుకుంటారట !

పొరపాటు పడుతున్నారు. మనహీరోలూ మన రాజకీయ నాయకులూ ఎప్పుడూ ముసలి వాళ్ళు కారు !

ఎస్. ఎన్. ఆర్ — విశాఖపట్నం

కన్నీరు ఎంతో విలువైనది. జీవితంలో ఎన్నో విషయాలలో నిగ్రహించుకున్నా సినిమా చూస్తున్నప్పుడు, పుస్తకం చదువుతున్నప్పుడు మన ప్రమేయం లేకుండా కన్నీరు కారిపోతుందేమిటి విచిత్రం.

దీన్లో విచిత్రంలేదు. నిజజీవితంలో కన్నీరు తెప్పించే సంఘటనలు పట్ల కుతూహలం కనపరిస్తే బాధ్యతలు చుట్టుకుంటాయని భయం. తప్పించుకు తిరుగుతాం. అదే ఇలా సినీకష్టాలు చూసో, రచయిత వర్ణనా ప్రభావం వల్లో, కన్నీరు రాలకపోస్తే ప్రమాదంలేదు !

డి. ఎల్. కె — కొడాలి

మన చిన్నప్పుడు తల్లిదండ్రులు మంచి బుద్ధులు నేర్పిస్తారు. అదె విధంగా పెద్దయ్యాక కూడా చెపుతే మనకు నచ్చవు ఎందువలన ? విసుగు కూడా కల్గిస్తాయి కారణం ఏమిటి ?

అదే తరాల అంతరం అంటున్నారు. చిన్నతనంలో పిల్లలకి బుద్ధులు తిట్టికొట్టి చెప్పినా సరవాలేదు. కాని వయసొచ్చిన పిల్లలని స్నేహితుల్లాగా చూడాలెగాని బానిసల్లాగా చూడకూడదు. చిన్నతనంలో చిన్నపిల్లలు పెద్దయాక ప్రశ్నించడం మొదలు పెడతారు. అదిచెప్పని పెద్దలు చచ్చినట్టు పడివుండు అన్నట్లు అధికారం చెలాయించ చూస్తారు. ఎక్కడ అనవసరపు అధికారం చెలాయించడం ఉంటుందో అక్కడ ఎప్పుడూ తిరుగుబాటు తలెత్తుతూనె ఉంటుంది.

ఎమ్. జె. పి — కోమట్లపేట

స్త్రీకి స్వాతంత్ర్యం యిచ్చినా అది పరిపవ పద్ధతులలో ఉపయోగించుకోనప్పుడు స్త్రీని ఏం చెయ్యాలి ?

మీరిచ్చిన స్వతంత్రానికి అర్థం వేరులా తోస్తోంది. ఈ పూటకి సినిమాకి వెళ్లిరా ! రేపడిగితే తంతా అనడం కూడా స్వతంత్రం ఇచ్చామని గర్వపడె మగవాళ్లుంటారని విన్నాను.

ఆత్మహత్యకు దగ్గర త్రోవ ఏదో కొంచం చెప్పకలరా కె. రా. గారూ?

ప్రశ్నావళి చదవడమేనని గట్టిగా చెప్పేయాలని వుంది ! గాని మరీ స్వతంత్రం తీసుకున్నాననుకుంటారేమోనని మొహమాటంగా వుంది. ఎలా ? !

కె. బి. పి — సిద్దేశ్వరం

ప్రేమించడం కాదు గొప్ప ప్రేమించబడడంలో వుంది గొప్ప.

పెళ్లి సంగతెత్తే సరికి ప్రేమ పారిపోకుండా ఉండడమే గొప్ప !

బి. ఎస్. ఎన్ — పెద్దపల్లి


మనస్సు నిగ్రహించే మార్గం చెప్పండి.

మనస్సు దెబ్బతింటే అంతా దేవదాసులు కారు మనసును పనిలో నిమగ్నం చేసే వాళ్లు మనసు నింకో దారిలో పెట్టి మరిచిపోడానికి ప్రయత్నించే వాళ్లే యీ లోకంలో ఎక్కువ. బాధ్యత తప్పించుకొని, నింద పై వారిపైకి తోసేసి తమకు తామే పతనమైపోయి గొప్ప త్యాగం చేశామని గర్వపడేవాళ్లు— నిజమైన స్వార్థపరులు.

కె. వి. ఆర్ — విజయవాడ

ఏవి కావాలన్నా డబ్బు ఉండదు. యింకెలా?

చూడు తమ్ముడూ అక్కరలేనివి కొనడం ప్రారంభించే వాళ్ళు రాను రాను కావలసినవి కొనక పోవచ్చు. ఉన్న దాంతో కావలసినవి కొనడం — వివేకం.



ప్రేమ పరీక్ష

శ్రీకృష్ణునికి ఎనమండుగురు భార్యలు ఉన్నారు. వారుకాక రాధాదేవి ఉన్నది వీరందరూ అయనను గాఢంగా ప్రేమించే వారే! అయినా అతనికి మిగిలినవా రందరి కంటెను రాధయందే ఎక్కువ ప్రేమ ఉన్నది. ఈ విషయం అందరికీ తెలుసును కాని కారణం మాత్రం ఎవ్వరూ కని పెట్ట లేకపోయారు. ఒకనాడు నారదునికి ఈ రహస్య కనుగొనాలనే సంకల్పం కలిగింది. అతని శ్రీకృష్ణుని దగ్గర చనువు ఎక్కువ. అందవల్ల ధైర్యం వహించి ఈ విషయం ప్రస్తావించి కారణం తెలుపవలెనని అన్నాడు. "అది నా స్వంత విషయం. నా ఇష్టానిష్టాలను గురించి అడగడం సరికాదు" అని నవ్వుతూ సమాధానంచెప్పాడు, నారదుడు మరి మాటలాడలేదు: కొంత సేపు ఇద్దరూ ఇష్టాగోష్టి జరిపారు. కొంచెంసేపయాక శ్రీకృష్ణుడు ఏదో బాధ వ్యక్తంచేస్తూ పడుకున్నాడు "ఏమిటి బాధ?" అని నారదుడు ప్రశ్నించాడు. "విపరీతంగా కడుపు నొప్పి వచ్చినది. భరించలేకుండా ఉన్నాను. కాస్త మంచినీళ్ళు తెచ్చి పెట్టు – నీవు నా మహిషుల వద్దకు పోయి చిన్న పాత్రతో మంచినీళ్ళడిగి తీసుకురా. ఆ నీటిలో వారు కాలి బొటనవేలిని ముంచి మరీ యియ్యాలి సుమా!" అని చెప్పి పంపించాడు. నారదుడు రుక్మిణీదేవి దగ్గరకు వెళ్ళి సంగతి చెప్పి మంచినీళ్ళిమ్మన్నాడు. ఆమె తన కాలి బొటనవ్రేలిని ముంచిన నీరు ఇవ్వడానికిసమ్మతించలేదు. "పతివ్రత లెవరైనా తమ కాలు కడిగిన నీరు భర్తకు తాగడానికిస్తారా? ఇది ధర్మమా? అలాచేస్తే నేను జన్మజన్మలకూ నరకకూపంలో పడిపోనా?" అని బదులు చెప్పింది. సత్యభామ వద్దకు వెళ్ళి అడిగితే ఆమె "ఆ మాయలమారి ఏదో తమాషా చేస్తున్నాడు, మమ్మల్ని ఏడిపించడానికి. నా కాలివ్రేలు ముంచిన నీటిని ఇచ్చి నేను పాపానికి ఒడికట్టుకోలేను" అన్నది. మిగిలిన ఆరుగురు మహిషులూ కూడా ఆ విధంగానే సమాధానం చెప్పారు. అందరూ కడుపునొప్పి పోవటానికి భగవంతుణ్ణి ప్రార్థించారు. నారదుడు రాధవద్దకుపోయి అడగ్గా ఆమె మాత్రం అతడు కోరినట్లు నీరు ఇవ్వడానికి సమ్మతించింది. "నా కాలివ్రేలు ముంచిన నీరిస్తే మహాపాపం వస్తుందనీ, నరకకూపంలో పడిపోతాననీ నాకు తెలుసు. ఎలాంటి నరక బాధనైనా అనుభవించడానికి నేను సిద్ధమే. నా కృష్ణుని కడుపునొప్పి పోతే చాలు. అతని క్షేమమే నేను కోరేది. అతనికోసం ఎన్ని బాధలైనా అనుభవిస్తాను" అని అంటూ నీరిచ్చింది. నారదుడు ఆనీళ్ళు తెచ్చే సరికి శ్రీకృష్ణుడు లేచి కూర్చుని నవ్వుతూ "నారదా! ఇప్పుడు తెలిసినదా, నేను రాధను అధికంగా ఎందుకు ప్రేమిస్తున్నానో? ఇక ఆ నీటితో పనిలేదు. నాకే కడుపు నొప్పి లేదు" అని అన్నాడు. నారదుడు నిర్ఘాంతపోయాడు. రాధ ప్రేమ ఎట్టిదో అతనికి అర్థమయింది.



రేవుల ప్రగతి


దేశంలోని పది ప్రధాన రేవులు : కలకత్తా, పరదీప్, విశాఖపట్టణం, మద్రాసు, న్యూటూటికోరిన్, కాండ్లా, బొంబాయి, మార్మగోవా, న్యూమంగళూరు, కొచ్చిన్.


1975-76లో దేశంలో 10 పెద్ద రేవులలో 656.75 లక్షల టన్నుల సరుకును ఎగుమతి చేయటం, దిగుమతి చేయటం జరుగగా, 1976 – 77 లో 677.41 లక్షల టన్నుల సరుకును ఎగుమతి దిగుమతి చేయటం జరిగింది.

1975-76లో మనదేశంలోని పెద్ద రేవులలో 6,568 నౌకలు రావటం, వెళ్ళటం జరిగింది. 1976 – 77లో వీటి సంఖ్య 6,844కి పెరిగింది.

1976 – 77లో అన్ని రేవుల కంటే బొంబాయి రేవులో అత్యధిక మొత్తంలో సరుకు [172.90 లక్షల టన్నులు] ఎత్తటం, దింపటం జరిగింది. మార్మగోవా రేవుకు రెండవ స్థానం [134.50 లక్షల టన్నులు] లభించింది.

1976 – 77లో రేవులలో క్రూడ్ నూనెతో సహా పెట్రోలియం సరుకులకు మొదటి స్థానం [225 20 లక్షల టన్నులు] లభించింది. ఇనుముకు రెండో స్థానం [217 90 లక్షల టన్నులు] లభించింది. రేవులలో ఎగుమతి, దిగుమతి జరిగిన ప్రధాన సరుకులలో బొగ్గు, ఎరువులు, ఆహారధాన్యాలు మొదలైనవి వున్నాయి.





విప్పట్లు

బొంబాయిరవ్వను జల్లిస్తే కింద పిండి లాంటిది పడుతుంది. దాన్ని ఉప్మారవ్వలో కలిపితే ఉప్మా అడుగంటుతుందని, సాధారణంగా అట్లపిండిలో కలుపుతారు. అటా కాకుండా ఈ రవ్వపిండితో విప్పట్లు చెయ్యవచ్చు.

కావాల్సిన వస్తువులు :

బొంబాయి రవ్వ పిండి	2 కప్పులు
మైదాపిండి	1 కప్పు
బియ్యప్పిండి	3 కప్పులు
సెనగపప్పు	½ కప్పు
వేరుసెనగపప్పు	½ కప్పు

చేసే విధానం :

రవ్వపిండినీ, మైదాపిండినీ, బియ్యప్పిండినీ విడివిడిగా రెండుస్పూనుల డాల్డాలో గాని, నూనెలోగాని వేయించాలి. సెనగపప్పును ఒకగంట ముందుగా నానబెట్టి ఉంచుకోవాలి. వేరుసెనగపప్పును కచ్చాపచ్చాగా (చిన్న చిన్న ముక్కలుగా) దంచాలి.

విడివిడిగా వేయించిన రవ్వపిండినీ, మైదాపిండినీ, బియ్యప్పిండినీ, నానబెట్టిన సెనగపప్పునూ, దంచిన వేరుసెనగపప్పునూ కొంచెం జీలకర్ర, తగినంత ఉప్పూకారంవేసి, కొద్దిగా కాగిన నూనెను (ముద్దకావటానికి చాలినంత మాత్రమే) పోసి చపాతీపిండి కలిపినట్లు కలపాలి.

ఈ ముద్దగాచేసిన పిండిని చిన్న చిన్న ఉండలుచేసి పల్చగా (చపాతీ మందాన) ఒత్తి నూనెలో విరగా వేయించాలి.

విప్పట్లు కరకరలాడుతూ రుచిగా ఉంటాయి. సుమారు పది రోజులు నిలవ ఉంటాయిగూడా.

— పి. లీలాకుమారి

వంటలు

జామకాయ చట్నీ

కావలసిన వస్తువులు :— దోర జామకాయలు-పెద్దవి 2, ఎండుమిర్చి—4, చింతపండు— నిమ్మకాయంత, ఆవాలు — ఒక టీ స్పూన్, మెంతులు-ఒక టీ స్పూన్ -పచ్చిమిర్చి-4.

జామకాయలు చిన్న చిన్న ముక్కలు చేసి నూనె కొద్దిగా వేసి వేయించాలి. చింతపండు నీటితో తడిపి ఉంచాలి. ఎండు మిరపకాయలు, ఆవాలు, మెంతులు, నూనెతో వేయించాలి. తరువాత ఈ పోపు, జామకాయ ముక్కలు, చింతపండు, పచ్చిమిర్చి, తగినంత ఉప్పువేసి రుబ్బాలి.

ఏపిల్ చట్నీ

కావలసిన వస్తువులు:— ఏపిల్ పండ్లు— 2, ఎండుమిర్చి — 6, పచ్చిమిర్చి - 4, ఆవాలు — 1 టీస్పూన్, మెంతులు-½ టీ స్పూన్, ధనియాలు-½టీ స్పూన్, బెల్లం— ఒక చిన్న ముక్క, చింతపండు — నిమ్మకాయంత సైజు.

చేసే పద్ధతి :— ఏపిల్స్ పైచెక్కు తీసి ముక్కలు తరిగి పెట్టుకోవాలి. ఎండుమిర్చి, ఆవాలు, మెంతులు, ధనియాలు నూనెలో వేయించాలి. రోటిలో ఈ పోపు తగినంత ఉప్పువేసి దంచిన తరువాత ఏపిల్ ముక్కలు వేసి దంచాలి.

— సి. రాజ్యలక్ష్మి

దమాలూ

కావలసిన వస్తువులు:— ఒక కిలో బంగాళాదుంపలు (దాదాపు ఒకే సైజువి), తగినంత పచ్చిమిర్చి, ఉప్పు, పసుప్పొడి, కారప్పొడి, పోపు దినుసులు, నెయ్యి.

తయారు చేయు విధము :— బంగాళా దుంపలను మెత్తగా కాకుండ మధ్యరకంగా వుడికించి పొట్టుతీసి మధ్యకి రెండుగా కోయాలి. చిన్న చాకు తీసుకుని లోపలి భాగాన్ని తీసేయాలి. అన్నిటికీ ఆ విధంగానే డొంకలు పెట్టాలి. ఇప్పుడు బాణలిలో కొద్దిగా నెయ్యిని తీసుకుని వేడిచేసి పోపు దినుసులు వేసి వేయించి తర్వాత చాకుతో తీయగా వచ్చిన బంగాళాదుంప ముద్దను వేసి వేపాలి. ఇపుడు ఉప్పు,పసుప్పొడి,కారప్పొడి సన్నగా తరిగిన పచ్చిమిర్చి వేసి బాగా వేయించాలి. ఈ మిశ్రమాన్ని బంగాళాదుంప డొంకలలో నిండుగా పట్టించి రెండు డిప్పలని జోడించి విడిపోకుండా సన్నని దారంతో గట్టిగా కట్టాలి. వీటిని బాణలిలో మరిగే నేయిలో వేసి దోరగా వేయించి తీయాలి. వడ్డించేముందు దారం తీసేయాలి.

— శ్రీమతి గార్ల సరస్వతి.

ఒక అనసూయ కథ

మంథా వెంకటరమణారావు

(గత సంచిక తరువాయి)

రంగారావు నన్నుకూడా రమ్మన్నాడు. పిలిచేడు కదా అని బట్టలు వేసుకుంటే అక్క వచ్చి నాతో అంది. "సుగుణా! నీకు తల నొప్పిగా వుందని చెప్పి — నువ్వు రాకు!"

"నాకు తల నొప్పి లేదు... నాకు ఆ సినిమా చూడాలని వుంది."

"చూడాలని వుంటే వేరేగా వెళ్లు కాని మాతో రాకు."

"ఎవరితో వెళ్లమంటావ్? నాన్న సినిమాలకి వెళ్లరు — అమ్మ ఎప్పుడోకాని వెళ్లదు."

"ఒక్కర్తివీ వెళ్లు — కాని మాతో రాకు"

"ఎందువల్ల?"

"ఎందువల్లయితే నీకేం? నువ్వొస్తే మేం వెళ్లం!"

నాకూ పంతం ఎక్కువయింది—"నేనొస్తాను!" కాటుక దిద్దుకుంటూ అన్నాను.

"అయితే నువ్వొక్కర్తివే వెళ్లు — మేం వెళ్లం—"

నేను మేకప్పయి తయారయ్యేను. రంగారావు వచ్చేసరికి అక్క చెప్పిందికదా! "ఇవాళ ప్రోగ్రామ్ కేన్సిల్ చెయ్యండి — మరోనా డెప్పుడన్నా వెళ్దాం — నా కివాళ జ్వరం వచ్చినట్టుంది."

"అదేం! అడ్వాన్సు బుకింగ్ చేసేనే, మూడు టిక్కట్లు?"

"అమ్మేయండి!"

"అమ్మడానికి హాల్‌కి వెళ్తే పిక్చర్ చూడాలని బుద్ధి పుడుతుంది — పోనీ నువ్వు రా, సుగుణా! ఎలానూ రెడీ అయ్యేవ్‌కదా?" అని అతడే అన్నాడు.

అక్కకి కోపం, ఉడుకుమోత్తనం వచ్చేయి — "నే లేకుండా మీరిద్దరూ పిక్చర్‌కి వెళ్తారా!"

"అందులో తప్పేం వుంది?" ప్రశ్న వేసేడు.

ఏం తప్పందని చెప్పగలదు? ఆమె అతనితో వెళ్లగాలేంది, నే వెళ్తేనే తప్పౌతుందని ఎలా చెప్ప గలదు? అతని గుణంకాని, నా గుణంకాని మంచిది కాదని అనగలదా?

"పెళ్లి కావల్సిన పిల్ల — నలుగురూ నాలుగు మాటలంటారు" అని చెప్పింది.

"మన యిద్దరం వెళ్లినప్పుడు అనలేదా?" రంగారావు.

"మన సంగతి వేరు"

"ఏమిటి వేరు?" పట్టుదలగి వున్నా డెందుకో —

'మనం పెళ్లి చేసుకుంటాం అని అందరికీ తెలుసు."

"ఎవరికి తెలుసు?" నవ్వుతూ అడిగేడు.

"ఊరందరికీ తెలుసు."

"తెలిస్తే, సుగుణ నాతో వస్తే మరదలు బావగారితో పిక్చర్‌కి వెళ్లిందంటారు."

"అయితే వెళ్లడం మానరన్నమాట?"

అక్క తన మనసు మార్చుకొని సినీమాకి బయల్దేరదామనుకుంటున్న సమయానికి అన్నాను .. 'ఒక టిక్కెట్టెలానూ ఉందికాబట్టి అమ్మని తీసుక వెళ్దాం?"

"చాలా మంచి ఐడియా! మీ అమ్మవస్తే నీకింక అభ్యంతరం ఉంటుందా సంధ్యా? నీతో మరో సారి చూస్తాలే?" అన్నాడు రంగారావు.

నేను లోపలికివెళ్లి అమ్మని తయారవమన్నాను. కష్టంమీమ్మీద ఒప్పుకుంది. ఇప్పుడు అక్కకేం చేయ డానికీ పాలుపోలేదు. ఆమె రావడానికెలానూ వీలు పడదు —

నేనూ అక్కా ఒక గది వాడుకుంటున్నాం — ఆ గదిలోకివెళ్లేను పౌడరు మరోసారి రుద్దుకుందుకి. అక్క నా వెనకేవచ్చి గది తలుపువేసింది దాని కళ్లు మండుతున్నాయి.

"దొంగముండా! నువ్వా నీ దొంగెత్తులూనూ. మగాడితోనే నీకు పిక్చర్‌కి వెళ్లాలనిఉంటే నీ బాయ్ ఫ్రెండ్‌ని నువ్వు చూసుకో! రంగారావుతో వెళ్తే మాత్రం నేను ఒప్పుకోను. వెంటనే యీ బట్టలు మార్చేసుకొని; తలనొప్పిగా వుందని చెప్తావా లేదా?" అంటూ ఎదురుగా నిల్చుంది.

"నే చెప్పను! నేను రంగారావుతోనే వెళ్తాను!" పంతంవస్తే పంతమే నాకు.

అక్క పులిలా నా మీద కలియబడింది. నా చెంపలమీద ఎడాపెడా కొట్టింది. "నువ్వెలా

> ***జరిగిన కథ-7 :*** అనసూయ అక్కకీ, అన్నకీ పెళ్లయిపోతుంది. తండ్రి వుద్యోగం నుంచి రిటైరైపోతాడు. ఆర్థికబాధలు మనుషుల్ని ఎలా మార్చేస్తాయో అనిపిస్తుంది అనసూయకి అన్నని చూస్తుంటే. అనసూయ పెళ్లి ఆ యింట్లోవారికి ఓ సమస్యగా తయారవుతుంది. ఆ యింట్లో వుండే అందరి వెనుకా తలో కథ వుంది. ఒకరినొకరు ఓదార్చుకుని, కన్నీరు తుడుచుకుని కాలం వెళ్లబుచ్చుతుంటారు అందరూ. ఎస్.ఎస్.సి. పాసయిన అనసూయ చదువు ఆగిపోతుంది ఆర్థిక యిబ్బందులవల్ల. ఆడపిల్లలకి చదువనూ వ్రాయనూ నేర్పించటానికి బడి పెడ్తారు అనసూయా కనకదుర్గ. చిన్నతనంలోనే వైధవ్యం పొందిన స్నేహితురాలు నిర్మల చేత మెట్రిక్‌కు కట్టిస్తుంది అనసూయ. భర్త వదిలేసిన సుగుణతో పరిచయమవుతుంది అనసూయకి. తన జీవితంగురించి అనసూయకు చెప్పటం మొదలెడ్తుంది సుగుణ. సుగుణ అక్క సంధ్య, రంగారావు పెళ్లి చేసుకోవాలనుకుంటారు.

వెళ్తావో నేనూ చూస్తాను. వేలెడున్నావో లేదో వెధవ్వేషాలూ నువ్వూనూ..." అంటూ నేను కట్టుకున్న చీర లాగబోయింది. నేను అడ్డుకున్నాను — మరో నాల్గుగు అంటించింది—బొట్టు చెరిపేసింది— నా జుత్తు పీకేసింది— "ఈ గదిలోంచి బయట కొచ్చేవో...నిన్ను చంపేస్తాను! చంపేస్తానే దొంగ రాస్కెల్!" అని తను గదిలోంచి బయటపడి, పైనించి తలుపు గడిపెట్టింది.

తరవాతవెళ్లి నాకు తలనొప్పనీ, రానన్నాననీ రంగారావుకిచెప్పింది. ఆ రోజుకి వెళ్లడం జరగలేదు. అతను వెళ్లిపోయేక అక్కవచ్చి తలుపుతీసింది—అమ్మ నా అవతారంచూసి విస్తుపోయింది. జరిగినదంతా అమ్మకి చెప్పేను. అమ్మ అక్కని మందలించబోతే, అక్క అమ్మమీద విరుచుకపడింది. "నాకూ రంగారావుకీనా? దానికీ రంగారావుకీనా పెళ్లిచేస్తావ్? అది ముందుచెప్పు!"

"మీ ఇద్దరికి పెళ్లి నిశ్చయం అయిందికదే? ఆ ప్రశ్నేమిటి?"

"ఔనా? అయితే ఇదెందుకూ మధ్య? వచ్చిందగ్గర్నుంచి వచ్చినట్టుండక అతనితో ఇకఇకలూ, పకపకలూనూ..."

"నాకూ నీలాంటి బుద్ధులులేవు—" కోపంగా లేచేను.

"నా బుద్ధులు మంచివే. నీ బుద్ధులే పెడదార్లు పడుతున్నాయి."

మా ఇద్దరికీ కొట్లాట ఆరంభం అయింది. నాన్న ఇంట్లోలేరని గ్రహించే ఉంటావు — ఏమయితేనేం ఆ రోజునించి వాళ్లిద్దరిమధ్యా నన్ను యిరికించడం మానింది అమ్మ.

ఒకనాడు నేను స్కూలునించి వస్తూవుంటే రంగారావు దారిలో ఎదురయ్యేడు "సుగుణా! అలా బీచ్‌కువెళ్లి కూచుందాం పద ... నీతో కొన్ని ముఖ్యమైన సంగతులు మాట్లాడాలి." అన్నాడు.

ఆశ్చర్యపోయేను— ఏం మాట్లాడతాడు — ఒక పక్క కుతూహలత కలిగింది. మరోపక్క, వెళ్లడం మంచిదికాదేమో అనిపిస్తోంది. పదహారు, పద్దెనిమిదేళ్ల మధ్యవయస్సు అలాటిది అనసూయా. ప్రపంచంలో ఉన్న రహస్యాలన్నీ తెలుసుకోవాలనే ఉంటుంది. నేను జవాబివ్వకుండానే నా చేతిలోని పుస్తకాలు తీసుకొని, "పద" అన్నాడు.

కాఫీహోటల్‌కి తీసుకవెళ్లి టిఫిన్ ఇప్పించేడు తరవాత ఇద్దరం రామకృష్ణాబీచ్‌కి వెళ్లేం. అక్కడ ఒక నిర్జనప్రదేశం ఎంచుకొని కూర్చున్నాక అడిగేను. "ఏమిటి మాటాడతానన్నారు? చెప్పండి."

చెప్పేముందు నా చెయ్యి అందుకున్నాడు. ఈ గమ్మత్తేమిటో చూద్దామని ఊరుకున్నాను. అనసూయా! ఇలానే ఆడది మోసపోతుంది! తన ఉచ్చులో తనే పడుతుంది—చపలత్వం, కుతూహలత. ఇవన్నీ ఆ వయసు లక్షణాలు. ఆ ఉచ్చులని తప్పించుకోవాలంటే ప్రేమజ్వరంవున్న రంగారావులాటి వాళ్లని దూరంగా ఉంచటం ఒక్కటే మార్గం. అటువంటివాళ్లు ఏక్సిడెంటల్‌గానన్నా జీవితంలో తారసిల్లకూడదు.

అతను అప్పుడే నా అక్క సంధ్య శీలాన్ని పాడు చేసేడని నాకు తెలీదు. ఆమె అంటే కొత్తదనం

పోయి నా వెంటపడ్డాడని అంతకన్నా తెలీదు. అతని రూపాన్నిచూస్తే, పాపం, అమాయకుడు, ఈ మనిషి ఏ పాపమూ చెయ్యలేదు. చాలా నిజాయితీ పరుడు అనిపిస్తుంది.

మూడు మాటలు అన్నాడు — ఆ మాటలు అక్కతోనూ అనేఉంటాడు. ఎందరో మగాళ్ళు, ఎందరో ఆడవాళ్ళని తమ వుచ్చులోకి లాగడానికి నాందిగా యీ మాటలు అని వుంటారు...

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను." ఆ మూడు మాటలని సముద్రంవేపు చూసేడు.

ఆ మాటలకు నేను ఉలికిపడలేదు, ఆశ్చర్య పోలేదు. అతడి వాలకం గమనించగా అటువంటి మాటలే అంటాడని సూచాయిగా తెలుస్తూనే ఉంది కాని అతడామాటలు అనగానే నాలోని 'వ్యానిటీ' పొంగిపోయింది పాలనురుగులా — ఒక మగాడు, రంగారావంత అందమైనవాడు, నా అక్క వంటి అందకత్తెనుకూడా కాదని నన్ను ప్రేమిస్తున్నాడని చెప్తున్నాడు—ఆ నిజం ఎంతమీద కెత్తాలో అంతమీదకీ ఎత్తింది నన్ను.

కాని, చెయ్యి అతని చేతిలోంచి లాగేసుకొని ... "ఛ! ఏమిటా మాటలు ? మీరు అక్కని పెళ్లి చేసుకోబోతున్నారు..." అన్నాను.

సినీమాలో హీరో, హీరోయిన్‌తో చెప్పే డైలాగులు చెప్పేడు— "నువ్వు నమ్మవు సుగుణా! ఆ రోజు మనం పిక్చర్‌కి వెళ్లేం చూసేవ్? ఆ రోజే నిన్ను ఆడదానిగా మొదటిసారిగా చూసేను. చిన్న పిల్లనించి ఒక్కసారిగా కన్యగా మారిపోయి నా ముందు నిలబడ్డావు, నీ నుంచి కళ్లు తిప్పుకోలేక పోయేను." ఇలా ఏదో కవిత్వం మాట్లాడేడు. అతను కవే కదా ? అక్కా అతనూ మంచి కవిత్వం మాట్లాడుకొనేవారేమో! నాకు కవిత్వంతో పరిచయం లేదు. అందుకామాటలు ఒక చెవినివిని, మరో చెవిని వదిలిపెట్టేను.

నా కతన్ని పెళ్లాడాలని కాని, అతనితో ప్రేమ కథ నడుపుదాం అనికానిలేదు. ఒక మగాడ్ని ఆట ఆడిస్తున్నానన్న అహంభావంతో నా మనస్సు తృప్తి పొందుతోంది. అతడు నా ముందు తన మనస్సు బయటపెట్టీగానే అతడంటే నాకు ఇంటరెస్ట్ పోయింది. మరేముంది అతడి గురించి తెలుసు కుందుకి ?

కాని ఒక నిజం నేను గ్రహించలేదు. తన మనసు విప్పి, తన ప్రేమ వెల్లడించడానికి ఒక అవకాశం ఏ ఆడదన్నా ఏ మగాడికన్నా యిస్తే మరి జీడిమచ్చలా పట్టుకవదలడ్తని. అతడికీ అహంకారం వుంటుందికదా ? ఒక ఆడదాని పాదాలముందు తన మనసుని పడేసేక ఆమె కాదంటే అతడి అహమూ దెబ్బతింటుందికదా ? తన పట్టు నెరవేరుతేనేకాని అతని అహం తృప్తిపడదు.

అందువల్ల ఆ రోజునించీ నేను ఎంత దూరం పోదామని ప్రయత్నించినా అంత దగ్గరగా రావడానికి ప్రయత్నించేడు రంగారావు. అతడి ప్రేమలోపడి, అతడికి నేను లొంగిపోయివుంటే, వెంటనే నాలో ఇంటరెస్ట్ పోయి అక్కని తప్పకుండా పెళ్లి చేసు కొని వుండును. ఎందుకంటే నేను అక్కకన్న అందమైనదాన్ని కాను. తెలివైనదాన్నీ కాను.

ఒక కన్య చెప్పిన కథ

అతనితో సమానంగా కవిత్వ భాష మాటాడగలదాన్నీ కాను. కాని నాకు అతనిలో ఆకర్షణ కనిపించలేదు. ఆ రోజు అతడు నా ముందు ప్రేమని వెలిబుచ్చగానే నాక పోయిందా ఆకర్షణ. తరవాత నా వెంటపడితే అతడంటే విముఖతే ఏర్పడింది.

రంగారావుకీ పట్టుదల ఎక్కువయింది. నేను అతడికి లొంగే దారి అగుపించలేదు

"నన్ను పిక్చర్‌లకి మేటనీకి తీసుకవెళ్తానన్నాడు ఎన్నోసార్లు. నేను వెళ్లనన్నాను. ఇంట అందరినీ తీసుకవెళ్తానన్నాడు ఒకసారి అందరూ వెళ్లండి కాని, నేను మాత్రం వెళ్లనన్నాను. మా ఇద్దరిలోని మార్పు అక్క కనిపెట్టింది నేను ఎంత దూరం పోదామని అనుకుంటే అతడు అంత దగ్గరగా వద్దాం అని ప్రయత్నించేడు.

అక్కతో అతడి పెళ్లి వేగంగా అయిపోతే బాగుండుననిపించింది. స్కూల్‌ఫైనల్ పరీక్ష యిచ్చేను. మాకింక శెలవలు — అక్క బి. ఏ. ఫైనల్ యిచ్చింది. దానికీ శెలవలే. ఆ శెలవలలో అక్కకీ, రంగారావుకీ పెళ్లికి అన్ని సన్నాహాలూ చేసేరు నాన్న. ముహూర్తం పెట్టించేరు — లగ్న పత్రికలు అచ్చు కావడమే తరవాయి.

అక్కకి సంబంధించిన ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలని రంగారావు నన్ను మళ్లా బీచ్‌కి రమ్మన్నాడు. ఈ బాధని పూర్తిగా వదిలించు కుందామని వెళ్లేను. ఒడ్డంట నడుచుకుంటూ వెళ్లేం. ఒకచోట కూచున్నాం.

"ఎందుకు రమ్మన్నారో చెప్పండి..." అడిగేను.

"నిన్ను తప్ప నేను మరెవరినీ ప్రేమించలేను." మళ్లా నా చెయ్యి అందుకోబోతే లాక్కున్నాను.

"నేనేం చేసేది. ఎవరినన్నా ప్రేమించే హక్కు మీకుంది. అది మీ స్వవిషయం."

"నేను నిన్ను ప్రేమించొచ్చని ఒప్పుకుంటు న్నావా ?"

"ఒప్పుకుంటున్నాను. ఎందుకు ప్రేమించ కూడదు ? అది మీ స్వవిషయం..."

"అయితే నన్ను పెళ్లి చేసుకుంటావా ?"

నేను అదిరిపడ్డాను. నేనేమిటి ? ఇతన్ని పెళ్లి చేసుకోవటమేమిటి ? అక్కతో యితని పెళ్లి నిశ్చయం అయిందికదా !

"మీకు అక్కతో పెళ్లి నిశ్చయం అయింది."

"నీ అక్క సంగతి మరిచిపో — నీ సంగతి నువ్వాలోచించుకో అదే ప్రపంచ రీతి. నేను నీ భర్తగా వుండడం నీ కిష్టమేనా ?"

ఏ జవాబివ్వాలో నాకు తెలుసు. కాని కాస్త



పస్తాయించేసి, ఈ మనిషి మానసిక లక్షణం అర్థంకాక.

"నా ఇష్టం ఒక్కటే! మీరు సంధ్యని పెళ్లి చేసుకోవడం, దానికి విరుద్ధంగా జరగడం నా కిష్టం లేదు !"

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను."

"ఎప్పట్నించి ?"

"నిన్ను ఆనాడు చూసినప్పట్నించీ !"

"సంధ్యని ప్రేమించలేదా అంతకుముందు ?"

"ప్రేమించేననుకున్నాను – కాని అది ప్రేమ కాదని నిన్ను చూసేక తెలిసింది."

"మీ మనస్సు యింత చంచలమా? కొన్నాళ్లకి మరో ఆడదాన్ని ప్రేమించి, నేను మీలో కలిగించింది ప్రేమ కాదని అనుకోరని ఎక్కడుంది ?"

"అలా ఎప్పుడూ జరగదు ! నా మాట నమ్ము !"

"అక్కకూడా మీ మాటే నమ్మింది !"

"మీ అక్క సంగతి మరిచిపో... నీ సంగతి చెప్పు... నే అంటే నీ కిష్టమేనా ?"

"మీరంటే నా కెందుకు కోపం వుండాలి ?"

"ఇష్టమా కాదా ?"

"ఇష్టం అంటే దేనికి ? మీతో పిక్చర్లకి వెళ్లడం యిష్టమే. మీతో మాట్లాడడం యిష్టమే. ఇలా బీచ్‌లో కూర్చోడం యిష్టమే... ఈ పనులు నా స్నేహితు లెవ్వరితోనన్నా చెయ్యగలను !"

"నా భార్యగా అవడానికి..."

"మీకూ అక్కకీ పెళ్లి కుదిరి వుండకపోతే ఆలోచించి వుందును. కాని యిప్పుడు వీలుపడదు!"

"నేను మీ అక్కని పెళ్లి చేసుకోననుకో."

"అక్కని పెళ్లాడకపోతే మీ మొహమైనా చూడను – నేను మిమ్మల్ని పెళ్లాడ్డం సంగతి అటుంచండి..."

"నే అంటే అంత ద్వేషమా నీకు ?"

"మిమ్మల్ని పెళ్లాడనంటే ద్వేషిస్తున్నానని ఎందుకనుకోవాలి ?"

"ప్రేమించడంలేదని అనుకోవచ్చుగా ?"

"ప్రేమిస్తే పెళ్లి చేసుకోవాలని వుందా ? నే ప్రేమించిన అందరినీ పెళ్లాడితే నాకు యిప్పటికి డజను భర్తలుందురు !"

అతను ఆశ్చర్యపోయేడు. "అంటే నీ కప్పుడే అంతమంది ప్రియులున్నారా ?"

"ప్రేమించిన ప్రతివాడూ ప్రియుడే అవాలా ? వినండి – చిన్నప్పుడు నా బట్టలు ఉతికి తెచ్చే చాకలివాడ్ని ఎంతగానో ప్రేమించేను. వాడంటే నాకెంతో యిష్టం. కొన్నాళ్ల తరవాత నాకు సంగీతం చెప్పే మాష్టార్ని ఎంతగానో ప్రేమించేను. అతని పాటంటే ఎంతో యిష్టం. అలా ఎందరో వున్నారు. వారందర్నీ ప్రేమించేను మరి వారందర్నీ పెళ్లి చేసుకోవాలంటారా ?"

"ఓస్ ! అదా ! నీదంతా వితండవాదన ! అవన్నీ కాఫ్ లవ్స్ చిన్నప్పుడు అలానే అనిపిస్తుంది. విను సుగుణా. నేను మీ అక్కని పెళ్లాడినా దానిని ప్రేమించలేను."

"అన్ని పెళ్లిళ్లూ ప్రేమించేకే అవుతున్నాయా? ఒకవేళ అయినా, పెళ్లాడేక ప్రేమ ఎలానూ ఇంకేపోతుంది!"

"నువ్వు ఇంత సినిక్ వనుకోలేదు."

"అంటే?"

"అంటే దేనిమీదా గట్టినమ్మకం లేనిమనిషి అని అర్థం."

"నాకు ప్రేమంటే నమ్మకంఉంది. కాని ప్రేమ పేరుతో ఒకరికి అన్యాయంచేసి స్వార్థాన్ని చూసుకొనే మనుష్యులంటే నమ్మకంలేదు. ఇంక వెళ్లనా ?"

"కూర్చో! నా ప్రేమని కాలతంతున్నావా?"

"చూడండీ...నా కిష్టంఉన్నా లేకపోయినా మీ యిష్టాయిష్టాలని నా మీద రుద్దుదామని చూస్తున్నారు. ఇందులో నా యిష్టాయిష్టాలతో ప్రమేయంలేదా? ప్రేమ అంటే నిర్వచనం పెళ్లి అయితే నేను మిమ్మల్ని ప్రేమించటంలేదే అనుకోండి."

"మరేమిటయితే నన్ను ప్రేమిస్తావ్?"

"నా అక్క సంధ్యని పెళ్లి చేసుకున్నట్టయితే మిమ్మల్ని గౌరవించగలను...అదే నా ప్రేమ..."

"నా కర్థం కాలేదు. గౌరవం ప్రేమ ఎలా ఔతుంది ?"

"గౌరవంలేనిచోట ప్రేమ ఎలాగుంటుందో మీరు చెప్పండి వింటాను?" సవాలు చేసేను.

"మీ అక్కని పెళ్లిచేసుకుంటే నన్ను ప్రేమిస్తావా ?"

"గౌరవిస్తాను ..."

"అదేలే...గౌరవం పక్కనే ప్రేమ ఉంటుంది కదా?"

"ఔను..."

"సరే. మీ అక్కని పెళ్లి చేసుకుంటాను. నువ్వు మాట తప్పకూడదు. నన్ను ప్రేమించాలి.."

"అంటే?"

"నన్ను నీ ప్రియుడిగా స్వీకరించాలి. నువ్వు మరెవ్వరినీ పెళ్లాడకూడదు !"

ఆ మాటలకి నా కతడిమీద విపరీతమైన అసహ్యం వేసింది. అతడికి ప్రేమంటే ఒకే అర్థం

"అలా నే అనలేదు. ప్రేమపూర్వకమైన గౌరవమే ఉంటుందన్నాను ... అంతే తప్ప మీరన్న అర్థంతో నేననలేదు !"

"నేను ఏ అర్థంతో అన్నాను ?"

"మీ ఉంపుడుకత్తెగా వుండమంటున్నారు .. అంతే కదూ?" కోపంగా అన్నాను.

"లేదు. నా ప్రేమని అంత తేలికచెయ్యకు. నా భార్యగా ఉండు. కాదన్నానా? నీకు రేపే గుడిలో పుస్తె కట్టేస్తాను– మీ అక్కకి పుస్తె కట్టను "

"మీతో వాదించి లాభంలేదు. గుడ్ బై !" లేచేను.

"విను! మీ అక్కని పెళ్లాడను. దాంతో మీ అక్క ఆత్మహత్య చేసుకుంటుంది!"

"నన్ను మీరు పెళ్లాడితే ఆత్మహత్య చేసుకోదా ?"

"చేసుకోదు. నువ్వు నన్ను లోబరుచుకున్నావని ద్వేషిస్తుంది...కాని ఆత్మహత్య చేసుకోదు."

"మీరు పెళ్లాడకపోతే ఎందుకు ఆత్మహత్య చేసుకుంటుందో చెప్పండి ?"

"ఈ ఊరందరికి తెలుసు. నీకు తెలీదా!"

"ఊరందరికీ ఏం తెలుసు ?"

"పెళ్లి అవలేదన్న మాటేకాని మేం ఇద్దరం భార్యాభర్తలగానే వ్యవహరిస్తున్నామని..."

"అబద్ధం !"

"నీకు రుజువు చూపిస్తాను. ఈ ఊరులో ఒక హోటలుంది – అక్కడ గదులు అద్దెకివ్వబడతాయి గంటల లెక్కన. ఆ హోటల్‌కి ఎన్నిసార్లు మేం యిద్దరం వెళ్లిందీ ఆ హోటలువాడు చెప్తాడు..."

నేను మ్రాన్పడిపోయేను సంధ్య అంతదిగజారి పోయిందా? ఇందులో అక్క తప్పేమీ ఉండిఉండదు. అంతా యీ నీచుడు చేసిన కుతంత్రమే. వలపన్ని అక్కని మోసం చేసేడు. నన్నూ అదే చేద్దామని చూస్తున్నాడు. నీరసంగా కూలబడ్డాను. దుఃఖం ఎంత ఆపుకుందామన్న ఆగటంలేదు. ఏమిటీ దుర్దినాలు? అన్న పోవడం, నాన్న డబ్బంతా ఖర్చయి పోవడం – అక్క పెళ్లి అవుతుందనుకుంటే యీ మనిషి యిలా ప్రవర్తించడం. ఏం చెయ్యడం నేను? నాకు తెలీలేదు ఏం చెయ్యడమో.

ఈ మనిషిని ప్రేమిస్తాననీ, ప్రియురాలిగా ఉంటాననీ మాట ఇస్తే? మాటే కదా? అక్కతో ఇతడికి పెళ్లి అయిపోయేక నా మాట నిలపెట్టు కోకపోతే ఏం చెయ్యగలడు – ఈ మధ్యని ఏదో సంబంధంచూసి పెళ్లి చేసేస్తారు నాన్న. ఇలా అనుకొని...

"సరే...మీరన్నట్టే కానీండి – కాని అక్కని పెళ్లి చేసుకోండి..." అన్నాను.

"సరిగ్గా విను– నా ప్రియురాలిగా ఉంటానని ఒప్పుకుంటున్నావ్."

"ఔను."

"మరెవర్నీ పెళ్లాడవు."

"ఔను."

అక్కడికా పీడ విరగడైందనుకున్నాను – కాని విధి విలాసం మరోలా వుంది.

అక్క పెళ్లి నిశ్చయం కావటం, నాన్న పోవడం ఒకేసారి జరిగాయి.

మా బావలిద్దరూ వచ్చేరు. అంత్యక్రియలూ, కర్మ వాళ్లే జరిపించారు – మరెవ్వరున్నారు కనక మాకు. దిక్కూ మొక్కూ లేకుండా అయిపోయింది సంసారం.

* * *

రంగారావు మా ఇంటికి వస్తూనే ఉన్నాడు. అక్కతో పూర్వంలా మసలుతూనే ఉన్నాడు. నా కేసి అర్థవంతంగా చూస్తూనే ఉన్నాడు.

మాకు నాన్న మిగిల్చినఆస్తి ఏమీలేదు. పదివేల రూపాయల రొక్కంమిగిలింది అక్క పెళ్లికి. తరవాత నేనూ అమ్మా ఎక్కడుండాలి ? నా భావి ఏమిటి ? ఈ ప్రశ్నలన్నీ ఉత్పన్నమయ్యేయి.

ఈ ప్రశ్నలకి రంగరావే మార్గంచూపించేడు. అక్కకీ అతడికీ పెళ్లయేక అమ్మ నాతోసహా అతడితోనే ఉండిపోవచ్చుట. అతని సలహా నాకుతప్ప అందరికీ నచ్చింది. నేను తప్పించుకోలేని వుచ్చులో చిక్కకపోయేను.

పెళ్లికి ముహూర్తం నిశ్చయమయింది. ఇప్పుడు మా ఇంట్లో రాజ్యం రంగారావుదే. రోజూ వచ్చే

వాడు. అమ్మతో మంతనాలు జరిపేవాడు. హోటల్లో భోజనం ఆపేసి ఇక్కడే భోజనం ఆరంభించేడు.

నాన్నగారు గవర్నమెంట్ సర్వెంట్‌గా వుండే వారు కాబట్టి, అక్కకి అసిస్టెంట్‌గా ఉద్యోగం వేయించమని అప్లికేషన్ పెట్టించేడు. కలక్టర్‌చేత రికమెండ్ చేయించి, హైదరాబాదు పంపించేడు.

రంగారావు ఒక్కొక్కనాడు రాత్రుళ్లుకూడా మా ఇంట్లోనే వుండిపోసాగేడు. అతనికి నాన్న పడుకొనే గది యిచ్చేది అమ్మ. నేనూ అక్కా ఒక గదిలో పడుకొనేవాళ్లం. ఒకసారి అర్ధరాత్రి తెలివొచ్చి చూస్తే అక్క లేదు. బాత్‌రూమ్‌కి వెళ్లిందేమో అనుకున్నాను. ఎంతవరకూ రాకపోయే సరికి లేచి అతడి గదివేపు వెళ్లేను. లోనుండి అక్క గొంతు చిన్నస్థాయిలో వినిపించింది.

ఇద్దరిమీదా నాకు కలిగిన రోత ఇంతా అంతా కాదు. వచ్చి నా గదిలో పడుకున్నాను. మర్నాడు వాళ్ల ముఖాలు చూడ మనసొప్పలేదు. తప్పక తిరిగేను.

అనసూయా! దుష్టుడు మంచివాడికన్నా చాలా తెలివైనవాడై వుంటాడు దుష్టకార్యాలు చెయ్యడంలో. ఆ తెలివితేటలు లేకపోతే దుష్టుడిగా ఆ మనిషి మనలేడు. సమాజం పట్టుక దండిస్తుంది. సరైన దారిలో పెడదామని ప్రయత్నిస్తుంది. దొరక కుండా తప్పించుకుందుకి దుష్టుడి తెలివితేటలు విపరీతంగా వుంటాయి. మంచివాడి కటువంటి తెలివితేటలు అవసరంలేదు —

అక్కా, పెళ్లి ప్రయత్నాలు చురుకుగా సాగేయి. లగ్న పత్రికలు అచ్చు అయి వచ్చేయి. ఇంకా వాటిని పంపలేదు. అప్పుడు పడింది గొడ్డలిపెట్టు, పెళ్లి వారం రోజులుందనగా.

ఆ రోజు అక్క అమ్మతో కలిసి బట్టలు కొనుక్కుందుకి మార్కెట్ కి వెళ్లింది. నేను ఇంట్లోనే వున్నాను. వాళ్లని మార్కెట్లో చూసి, నేను ఒంటరిగా యింట్లో వున్నట్టు గ్రహించి రంగారావు యింటికొచ్చేడు. అక్కావాళ్లూ బజారుకి వెళ్లేరని చెప్పేను

"తెలుసు కాని నీతో మాట్లాడ్డానికి నేను వచ్చేను..."

"నాతోనా? ఏం మాట్లాడాలి?"

"మనం అనుకున్నదే — ఆ ఒప్పందం వున్నట్లేనా?"

"పెళ్లయేక అమ్మా నేనూ మీతోనే వుంటాం కదా?"

"ఉంటారు నిజమే — మీ అక్కకి పుస్తె కట్టేసేక నీ మాటని నిలబెట్టుకుంటావని నమ్మకం ఏమిటి?"

"నామీద నమ్మకం లేదా?"

"ఆడదాని మాట మీద నాకు నమ్మకం తక్కువ..."

"అయితే నా మాట ఎందుకు నమ్మేరు?"

"నమ్మలేదు."

"నమ్మకపోతే అక్కని ఎలా పెళ్లి చేసుకుంటు న్నారు?"

"ఇంకా చేసుకోలేదుకదా?"

ఒక కన్య చెప్పిన కథ

"చేసుకోరా?"

"చేసుకోను."

హడిలిపోయేను. "చేసుకోరూ? ఇప్పుడు మీరిలా అంటే అక్క గతేమవాలి? అక్క మరెలా తల ఎత్తుక తిరుగుతుంది?"

"మీ అక్కని నేను పెళ్లాడాలంటే, నీ మాట నిలబెట్టుకుంటావన్న హామీ వుండాలి నాకు..."

"హామీ ఇస్తున్నాను!"

"హామీ ఇలా ఇస్తే లాభంలేదు..."

"మరెలా ఇవ్వాలి?"

"అప్పు తీసుకున్నప్పుడు ఒక వస్తువు తాకట్టు ఉంచుతారు ఎగకొట్టకుండా..."

"మీరు మాకేమీ అప్పివ్వలేదే?"

"వాడుకుందుకి నా జీవితాన్ని మీ అక్కకి అప్పుగా ఇస్తున్నాను. ఆ అప్పుని నువ్వు తీర్చుకుంటా నంటున్నావ్ నీ జీవితాన్ని నాకుయిచ్చి. నువ్వు మా పెళ్లిఅవగానే పారిపోతే? నీకో లవర్‌లేడని నమ్మకం ఏమిటి?"

నాకు ఒళ్లు మండింది. "అయితే నువ్వనే దేమిటి?"

"అలా ఏకవచనం ప్రయోగించు. చాలా సంతోషిస్తాను. ఏమైనా నీ బావగారినేగా? నువ్వు నాకు ఒక వస్తువు తాకట్టు పెట్టాలి. నిన్నెంతగా ప్రేమించేనంటే సుగుణా, నేను మీ అక్కని పెళ్లాడినా, నువ్వూ నాతోఉన్నా, నువ్వు మరొకర్ని చూస్తే సహించలేను!"

"ఏం తాకట్టు పెట్టమంటావ్? వేగంచెప్పు!"

"ఒక్కటే...నీ శీలం..."

షాక్ తిన్నాను — గొంతు ఆర్చుకపోయింది — ఇదెక్కడి విడ్డూరం?

"ఏం అలా అయిపోయేవ్? నన్ను మోసగించ గలననుకున్నావ్‌కదూ? నీ సంగతి నేను కనిపెట్టేసేను. నాతో ఆటలాడగల ననుకున్నావ్ కదూ? అద్దంలోలా నీ భావాలు నీ ముఖంమ్మీద నాకు కనిపించిపోతాయి సుగుణా! ఏమంటావ్?"

"నా శీలమా? అంటే?"

"నువ్వూ నేనూ రేపు సాయంత్రం ఆ హోటల్‌కి వెళ్తాం...ఏ హోటల్‌కైతే నేనూ నీ అక్కా వెళ్లేవాళ్లమో; అక్కడికి. ఆ గది రేపు మూడునించీ ఆరువరకూ బుక్‌చేసి ఉంచేను."

"అంటే?"

"అంటే నువ్వనుకుంటున్నావే..."

"నేను ఆడితప్పను...నా మాట నమ్ము!"

"తరవాత ఎలాగూ జరగవల్సిందే కదా? కాస్త ముందు జరుగుతుంది."

"నువ్వాపని చేసేక అక్కని పెళ్లిచేసు కుంటావన్న నమ్మకం ఏమిటి? మా ఇద్దర్నీ వదిలి మరెవరితోనన్నా పోవచ్చు ... లేదా, అక్కని చేసుకో కుండా నన్నే పెళ్లాడతాననవచ్చు. అప్పుడు నేను కాదనే పరిస్థితిలో ఉండేఉండను అందుకేనా యీ ఎత్తు?" అని అడిగేను.

ఈ ప్రశ్నకి అతడు తడబడ్డాడు. కాని తేరు కున్నాడువెంటనే. "నువ్వు తెలివైనదానవే. అయితే, హోటల్‌కి నువ్వు వచ్చేక నీకు నేను రాసిఇస్తాను మీ అక్కతో నాకు సంబంధం ఉందనీ, ఆమెని పెళ్లి చేసుకుందుకు నిశ్చయం అయాకే ఆ సంబంధం ఏర్పడిందనీ, ఆమెని పెళ్లి చేసుకుంటానని హామీ ఇస్తూ, చేసుకోపోతే తగుచర్య నా మీద తీసుకో వచ్చునీ రాసిస్తాను. నువ్వు సాక్షి సంతకం చెయ్యి. అది పుచ్చుకున్నాకే నాతో రా..."

"అదొక కాగితం ముక్క..."

"మన సమాజంలో అందరూ నమ్ముతారు. అది తగిల్చి నా మీద రిపోర్టిస్తే నా ఉద్యోగంకూడా ఊడుతుంది."

"నేనూ మీకొక కాగితం రాసిస్తాను — అది తీసుకున్నాకే అక్కని పెళ్లాడండి."

"వారేవా! ఆ కాగితం నేనెవరికి చూపినా నా చర్మం ఒలిచేస్తారు. నువ్వు కాదంటే ఎవరికి రిపోర్టివ్వను?"

"నేను పెళ్లాడదలచుకుంటే నా కాబోయే భర్తకివ్వండి."

"నువ్వు అసలు పెళ్లే చేసుకోపోవచ్చు. నాకు తెలీకుండా ఎవడితోనో ఎక్కడికో పరారీఅయి పెళ్లి చేసుకోవచ్చు. నిన్ను నిర్బంధించి ఆ కాగితం రాయించుకున్నానని నీ భర్తకిచెప్పి నాకు చెప్పుదెబ్బలు కొట్టింపించవచ్చు. కాబట్టి గెట్ రెడీ!"

"నేను...నేను ఆడినమాట తప్పను."

"నేనూ ఆడినమాట తప్పను."

"మన ఒప్పందం...అక్కకి మీతో పెళ్లి అయేకఅని. ముందుమాత్రం నేను ఒప్పుకోను ..." ఖచ్చితంగా చెప్పేను.

"అయితే మీ అక్కకి నాతో పెళ్లి జరగదు — రేపు నీ కోసం సరస్వతీ టాకీస్ దగ్గర వెయిట్ చేస్తాను మూడుకి. నువ్వు రాకపోతే పెళ్లి ఆగి పోయిందనే లెక్కవేసుకో పెళ్లిపత్రికలు కూడా అచ్చయేయి..." ఆ మాటలని అతడు వెళ్లిపోయేడు.

"అనసూయా! నువ్వా పరిస్థితిలో ఉంటే ఏం చేసి ఉందువు?" సుగుణ నన్ను అడిగింది.

సుగుణకథ వింటూఉంటే ఆ రంగారావువంటి మనుష్యులమీద నా మనస్సు భగ్గున మండిపోతుంది కోపంతో—తడుముకోకుండా జవాబిచ్చేను. "నేనైతే ఇంతవరకూ కథ రానివ్వనక్క - ఆ నాడే సుఖాస చెప్పేసి ఉందును. అక్కపెళ్లి అయితే అయింది లేక పోతే లేదు. ప్రాణంపోవాలి కాని అతడు రమ్మన్న చోటికి వెళ్లిఉండను."

సుగుణ నవ్వింది — "మనమిద్దరం ఒకే మూసలో పొయ్యబడ్డవాళ్ళం - నేను వెళ్లలేదు. నేను ఒక నిర్ణయానేకొచ్చాను ఈ మనిషి నన్ను తీవ్రంగా కాంక్షిస్తున్నాడు. కాబట్టి నేనులేకుండా ఉండలేడు. ఎలాగో ఒకలాగ నన్ను తనదానిని చేసుకుంటేనే కాని బతకలేడు. కాబట్టి నేను వెళ్లకపోతే ఏం చేస్తాడు? అక్కని పెళ్లిచేసుకోనుఅంటే ఇంక అతడి ముఖం చూడేచూడను. అందువల్ల నష్టం అతడికే. అక్కని పెళ్లిచేసుకుంటే, నేనూ అమ్మా, అక్కతో కూడా అతడి ఇంటికివెళ్లం. నేను అతడికి అప్పుడు దక్కే అవకాశం ఉంది...అలా అనుకుంటాడు. కాని అక్కని పెళ్లిచేసుకోపోతే అతడికి అంతాపోతుంది మరి మా గడప తొక్కలేడు.

"అందువల్ల నేను వెళ్లలేదు." సుగుణ చెప్పింది —

''కాని పెళ్లి తప్పిపోయిందా?''

''ఔను—తప్పిపోయింది. నేను మర్నాడుమూడు గంటలకి వెళ్లకపోగానే, రెండురోజుల తరవాత ఇంటికివచ్చి, చాలా సీరియస్ గా ముఖంపెట్టి, అమ్మనీ, అక్కనీరమ్మని చాలా ముఖ్యమైన విషయం మాట్లాడాలన్నాడు: ఆ ముందురోజే అక్కలూ, బావలూ వచ్చేరు. వాళ్లుకూడా ఎచ్చిమూగేరు. అందరూ మూగేక దెబ్బతిన్నపక్షిలా ముఖంపెట్టి అన్నాడు. ''ఏమండీ! మీరందరూ పెద్దమనుష్యులని నమ్మేను. కాని నమ్మినవాడిని మోసం చేస్తారని అనుకోలేదు.''

అమ్మ భయంగా అడిగింది. ''ఏమిటండి ? ఏం మోసం చేసేం?''

''మీకూ తెలుసు. మీ అమ్మాయికీ తెలుసు — ఎందుకు నన్నడుగుతారు?''

అక్క ముఖం వివర్ణమయింది. ''ఏమిటి రంగా ? నేనేం మోసం చేసేను?''

''ఎంతో నమ్మేను! ప్రాణంగా చూసుకున్నాము. అన్నీ...అన్నీ'' తల పట్టుకున్నారు.

''ఏం జరిగింది?''

''మీ అమ్మాయినే అడగండి...''

ఒక కన్య చెప్పిన కథ

"ఏం జరిగిందే సంధ్యా? మీ ఇద్దరూ కొట్లాడుకున్నారా?"

"లేదమ్మా—ఏమీ జరగలేదు — ఏం రంగా ... నేనేం తప్పుచేసేను?" అడిగిందక్క.

"నేను నా నోటితో చెప్పలేను ఇదుగో ... ఇవాళ ఈ ఉత్తరం వచ్చింది. చదవండి మీకే అర్ధమవుతుంది. దాంతోకూడా కొన్ని ఫొటోలున్నాయి — అవీ చూడండి. నా కివాళ పోస్ట్‌లో వచ్చిన ఉత్తరం ఆది. అంతా చదివి నేను ఏం చెయ్యాలో మీరే నిశ్చయించండి. మీరు ఆ పక్కగదిలోకి వెళ్లి చూడండి వదినగారూ—ఇవి అన్నగార్లు ... అత్తగారు చూడ వలసినవికావు..." అంటూ జేబులోంచి పెద్దకవరు తీసి మా పెద్దక్కకిచ్చేరు. పెద్దక్క, రెండో అక్క ఆ ఉత్తరం పట్టుక లోపలికిపోయేరు. వారితోకూడా అందరం వెళ్లేం.

ఇతను ఏదో ప్లాన్‌వేసుక వచ్చేడని నాకు అర్ధమౌతూనే ఉంది. నా మీద ప్రతీకారం తీర్చుకుంటున్నాడు ... ఫొటోలేమిటి? కొంతసేపయ్యేక నేనున్న గదిలోకి పెద్దక్క మాటలు, అమ్మ మాటలు వినిపించేయి. "కొంపముంచేవుకదే సంధ్యా! నీ కీ పోయేకాలం బుద్ధులెప్పట్నించీ వచ్చేయే? ఏ ముఖం పెట్టుకొని ఆ పెద్దమనిషిని నిన్ను పెళ్లాడమని చెప్పగలను?

అందరూ మళ్లా అ గదిలోకి వెళ్లేం. పెద్ద బావగారు కోపంతో అతనిముందే అక్కచెంపలు ఛెళ్లుమనిపించేరు. "ఇవెక్కడి బుద్ధులే సంధ్యా నీకు? నేనే నాడన్నా అనుకున్నానే నువ్విలాచేస్తావని? నీ అన్నకి చెల్లెలివే అనిపించుకున్నావ్! వాడితోపాటు నువ్వూ చావలేకపోయేవ్!"

అతన్ని రంగారావు అడ్డుకున్నాడు — "కొట్టకండి కొట్టకండి — మీ కుటుంబం పేరు ప్రతిష్టలు పాడుచెయ్యాలని నా ఉద్దేశం కాదు. నన్ను మీరేం చెయ్యమంటే అదే చేస్తాను. పుస్తె కట్టక తప్పదు రంగారావ్ అంటే నాకేం అభ్యంతరం లేదు కట్టడానికి..."

అక్కచెంపలు కందిపోయేయి. ఏడుస్తోంది. "నేనే తప్పుచెయ్యలేదు బావా. నేనేపాపం ఎరుగను!"

"ఏమీ ఎరగవు? పన్నవకుమార్ అన్న మనిషి నీకు తెలుసునా?"

"తెలుసు—అతను నా క్లాస్‌మేట్..."

"అతని దగ్గరకి నోట్సుకోసం వెళ్లేదానివా?"

"వెళ్ళేదాన్ని. అతడి చెల్లెలూ ... నేనూ స్నేహితురాళ్లం..."

"అతడితోనూ, అతడి చెల్లెలితోనూ ఎప్పుడన్నా పిక్చర్స్‌కి వెళ్లేవా?"

"అమ్మకి తెలుసు—వెళ్లేను— కాని వాళ్ల నాన్నగారి కిక్కడ్నించి బదిలీ అయితే, సెకెండియర్‌లో వెళ్లిపోయేడు ఢిల్లీ. అక్కడ మిలటరీలో చేరేడు చదువు మానేసి, ఆ ర్మీ లో. ఏడాదిక్రితం కారు ప్రమాదంలో చచ్చిపోయేడు."

"చచ్చిపోయేడు — కాని అతని ఫ్రెండుని అతని డైరీలోని కొన్ని పేజీలూ, కొన్ని ఫోటోలూ, పంపేడు ఇతనికి, అతని ఫ్రెండు రంగారావుకి కూడా ఫ్రెండట, రంగారావు పంపిన ఇన్విటేషన్ చూడగానే సంధ్య విన్నపేరేఅని ఆశ్చర్యపోయి... ఆ డైరీ... ఆబొమ్మలూ పెట్టెలోంచి తీసి, నువ్వు పెళ్లి చేసుకోబోగే ఆడదీ, ఈమే ఒక్కరేమొ చూసుకో అని పంపేడు. అతని రహస్యాలన్నీ ఇతడికి తెలుసునుట — పన్నవకుమార్ చచ్చిపోయేక అతని డైరీ, ఉత్తరాలు అతను ఉంచుకున్నాడుట ... నువ్వు అతనికి రాసిన ఉత్తరాలు కూడా కొన్ని ఉన్నాయట..."

"ఏదీ ఇలా చూడనీండి — నన్ను చూడనీండి— నిజానిజాలు నేను చెప్తాను ..." అంటూ అక్క అంటూన్నా ఎవ్వరూ వినిపించుకోలేదు.

ఆ కోపంలో ఎవరికీ ఒళ్లు తెలియటంలేదు — కాని నిజం నాకు తట్టింది. ఇదంతా రంగారావు పన్నాగం—తన స్నేహితుడు తనకి రాసినట్టు ఆకాశ రామన్న ఉత్తరం సృష్టించేడు. పాతడైరీలో కొన్ని పేజీలలో దస్తూరీమార్చి ఆ చచ్చిపోయిన ప్రన్నవ కుమార్ రాసినట్టుగా రాసేడు. ఆ ఫోటోలేమిటో? పన్నవకుమార్ అక్కతో ఫోటోలుతీయించుకున్నాడా? అవి ఇతగాడెలా సంపాదించేడు? ఆ ఉత్తరం తనపేర వచ్చినట్టు మొన్ననో, నిన్ననో పోస్ట్‌లో వేసిఉండాలి. లేదా తనపేరవచ్చిన ఏదో ఓ కాళీకవర్లో ఇవిపెట్టి ఉండొచ్చు.

[ఇంకా వుంది]



'దేవతలారా దీవించండి'లో విజయలక్ష్మి

ఎన్. టి ఆర్ పై వాణిశ్రీ కెందుకంత కోపం ?

మధు (ఎన్. టి. ఆర్), రాధ (వాణిశ్రీ) ప్రేమించుకున్నారు. దిన దిన ప్రవర్ధమాన మవుతున్న వారి ప్రేమ ప్రవాహంలోకి కొన్ని శక్తులు ప్రవేశించి మధుపట్ల రాధకు దురభిప్రాయం ఏర్పడేలా చేశాయి. ఫలితంగా వారిద్దరిమధ్య ఏపుగా పెరిగిన వలపువృక్షం వ్రేళ్లతోసహా పెకలించబడింది. రాధ మధును కాదని వదలుకున్నా, మధు మాత్రం రాధను మరచి వుండలేకపోయాడు. తన మనోవేదనను తన ప్రేయసికి నివేదించుకుందామని ఒకరోజు రాధ దగ్గర కెళ్ళాడు.

మధుని చూచిన రాధ నివ్వెరపోయింది. ''నువ్వా! ఎందుకొచ్చావిక్కడికి'' అని ప్రశ్నించింది. ''గతం గుర్తుకొచ్చి దూరమైన తీరంలో నిలిచివున్న నిన్ను చూడాలని'' అంటూ విచారవదనంతో రాధవైపు చూసాడు. ''నేను మాత్రం నిన్ను చూడాలనుకోవడంలేదు. జరిగిపోయిన క్షణాల్ని, మిగిలిపోయిన జ్ఞాపకాల్ని నేనెప్పుడో చెరిపేసాను. కనుక నువ్వు రావడమే అనవసరం. వెళ్లిపో ఇక్కడ్నుంచి'' అంటూ కర్కశంగా పలికింది రాధ. అందుకు మధు మనసు బాధపడింది. అంత బాధలోనూ ''రాధా! చెరిపివేసినా చెరిగిపోయేదికాదు గతం. చింపేస్తే చిరిగిపోయేదికాదు జ్ఞాపకం. ప్రతిరోజూ ఒక పండుగలా ఒకప్పుడు గడిపాం. అందుకే యీ పండుగరోజున...'' అంటూ గతాన్ని గుర్తుచేయ ప్రయత్నించాడు మధు. ''పండుగరోజు గనుకనే వెళ్లి తప్పత్రాగి ఒళ్లుమరచి పడుకో'' అని మధుని రెచ్చగొట్టింది రాధ. రాధ తనమీద లేనిపోని అభాండాలు వేస్తున్నా మధు మాత్రం తన పట్టుదల వదల్లేదు. ''లేదు రాధా! నిజంగా యీరోజు తాగలేదు. నీతోడు'' అంటూ ఆమెను నమ్మించ ప్రయత్నించాడు.

కానీ ఫలితం శూన్యం. రాధ మరింత రెచ్చిపోయింది. ''అవును. నీమీద పెరిగిన అసహ్యంతో ఆ ప్రేమను తుడిచేసాను. నాకు మిగిలిన కన్నీళ్లతో ఆ జ్ఞాపకాలను చెరిపేసాను. నువ్వనే మనిషి నా జీవితంలో వచ్చావనే విషయం కూడా మరచిపోయాను'' అంటూ నిర్దయగా, నిర్దాక్షిణ్యంగా పలికింది రాధ.

రాధ, మధుల మధ్య చెలరేగిన ఆ కలత కలతగానే వుండిపోయిందా లేక వారి కలయికకు దారితీసిందా ? అనే సందేహాలకు సమాధానంగా తయారైన చిత్రమే ఇందిరా మూవీస్ వారి ''ఎదురీత'' వర్ణ చిత్రం. శాఖమూరి రామచంద్రరావు నిర్మించిన యీ చిత్రానికి విక్టరీ మధుసూదనరావు దర్శకత్వం, వి. యస్. ఆర్. స్వామి ఛాయాగ్రహణం, సత్యానంద్ సంభాషణం, సత్యం సంగీతం సమకూరాయి. ఈ చిత్రం జూన్ 23 వ తేదీ విడుదలౌతుంది.

'అనసూయ'లో వాణిశ్రీ



ఏప్రిల్ 30 గండం తప్పిన రోజు!

గోపీకృష్ణా మూవీస్‌వారి "అమరదీపం" వర్ణచిత్రం షూటింగ్ వాహినిలో జరుగుతూండా రోజు. సెట్లో ఆ రోజు హీరో కృష్ణంరాజు గారు, జయసుధ, మాధవి, మురళీమోహన్ ప్రభృతులు వున్నారు. షూటింగ్ మధ్యలో కాస్త గ్యాప్ దొరికేసరికి అందరం పిచ్చాపాటీ మొదలెట్టాం. జయసుధ మాట్లాడుతూ "ఈరోజు నేనిలా సెట్లో వున్నానని తలచుకుంటేనే ఆశ్చర్యమేస్తూంది. ఏప్రిపో వాళ్ళి నదాన్ని బ్రతికాను" అని నిట్టూర్చింది. అంత ప్రమాదం ఎప్పుడు జరిగిందండీ అనడిగాను. "ఏప్రిల్ 30వ తేదీ నేను, మా మమ్మీ, నా చెల్లెలు ఫ్లైట్‌లో హైదరాబాద్ బయల్దేరాము. మరుసటి రోజు అంటే మే 1వ తేదీ "అర్ధాంగి" షూటింగ్‌లో పాల్గొనాలి మరి. మేం బయల్దేరిన వేళావిశేష మేమిటోగానీ ఆ రోజు వాతావరణం వుగ్రరూపం దాల్చింది. మేం ప్రయాణం చేస్తున్న ఫ్లైట్ వున్నట్టుండి క్రిందికి, మీదికి వూగడం ప్రారంభించింది. ఆ వూపులకు ఫ్లైట్‌లో వున్న వస్తువులు చెల్లాచెదరవడం మొదలెట్టాయి. ఏర్ హోస్టెస్‌తోసహా బెల్టు ధరించి సీట్లో కూర్చుండిపోయారు. విమానం అలా వుధృతంగా అటు, ఇటు వూగుతుంటే, నాకు చాలా భయమేసింది. ఈ రోజుతో మన ఆయుస్సు తీరింది అనుకుని మా చెల్లెల్ని గట్టిగా కౌగలించుకుని వుండిపోయాను. అదృష్టవశాత్తు మా కెలాంటి అపాయం జరగలేదు. ఎదురైన వాతావరణాన్ని, ఒడుదుడుకులన్నింటిని తప్పించుకుని మమ్మల్ని గమ్యస్థానం చేర్చాడు ఆ పైలట్. మేం ప్లేన్ దిగుతుంటే ఏరోడ్రోమ్ డోర్స్ అన్నీ బంద్ చేసున్నట్లు కన్పించింది మాకు కారణం ఏమిటని అడిగితే ఆ రోజు హైదరాబాద్‌లో పెద్ద తుఫాన్ అని తెల్సింది. ఎలాగైతేనేం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కు బిక్కుమంటూ రెస్ట్‌హౌస్ చేరుకున్నాం. ఆ రోజంతా నా మనస్సు ఎంతగానో కలవరపడింది. ఆ సంఘటన జరిగినప్పట్నుంచి ఏప్రిల్ 30వ తేదీని మరచిపోలేకుండా వున్నాను" అంది జయసుధ.



సినిమా

జూన్‌కు ఇంద్ర ధనుస్సు రెడీ

హీరో కృష్ణ కధానాయకుడిగా ఉదయలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ నిర్మిస్తున్న "ఇంద్ర ధనుస్సు" వర్ణ చిత్రం జూన్‌లో జరిగే వారం రోజుల షూటింగ్‌తో పూర్తవుతుందని నిర్మాతల్లో ఒకరైన నన్నపనేని సుధాకర్ చెప్పారు. ఇటీవల ఈ చిత్రానికిగాను కొన్ని ముఖ్యమైన సన్నివేశాలు హైద్రాబాద్‌లో చిత్రీకరించారు దర్శకుడు కె. బాపయ్య. జూన్‌లో జరిగే షూటింగ్‌లో ఒక పాటకూడా చిత్రీకరింపబడుతుంది అన్నారు టి. సుబ్బానాయుడు.

ఊటీ బ్యూటీని చక్కగా వుపయోగించుకున్నారనిపించింది "ఇంద్ర ధనుస్సు" లోని కొన్ని పాటలను చూచినపుడు. కొన్ని కొన్ని దృశ్యాలను చూచినపుడు హీరోకృష్ణ సాహసం బోధపడుతుంది మనకు.

"నేనొక ప్రేమ పిపాసిని, నీ వొక ఆశ్రమవాసివి." అంటూ హీరోకృష్ణ నటిస్తూ పాడిన ఆత్రేయపాట ప్రతి హృదయాన్ని కదిలిస్తుంది. "ఇంద్ర ధనుస్సు" చిత్రంలో వెరైటీ కృష్ణను చూడగలం మనం. హీరోకృష్ణ, ఊర్వశి శారదల నడుమ మొలకెత్తిన ప్రేమ ఎలాంటి మలుపులకు దారి తీసింది? ప్రేమ పూజారిగా హీరోకృష్ణ తన ప్రయత్నంలో కృతకృత్యులయ్యారా! అనే ప్రశ్నలకు సమాధానమే "ఇంద్ర ధనుస్సు".

బాపయ్య స్క్రీన్ ప్లే, దర్శకత్వంలో తయారవుతున్న ఈ వర్ణ చిత్రానికి మోదుకూరి జాన్సన్ మాటలను, కె. వి. మహదేవన్ సంగీతాన్ని, పి. భాస్కరరావు కెమేరాను, కె. రామలింగేశ్వరరావు ఆర్ట్‌ను, నరసింహారావు కూర్పును, సి. మస్తాన్ రావు సహకార దర్శకత్వాన్ని సాయి ప్రొడక్షన్స్ సమకూర్చే బాధ్యతలను స్వీకరించారు. ఈ చిత్రం త్వరలో లక్ష్మి ద్వారా విడుదలౌతుంది.

'రాజా రమేష్'లో హాలం

సినిమా విశేషాలు

దేవీపట్నం చూడరబాబూ

అంటూ శ్రీ రమణ చిత్ర ఆర్ట్సు యూనిట్ దాదాపు వందమంది దేవీపట్నానికి పయనం అయ్యారు.

మదరాసులో వేడిగాలులు దారుణంగా వుంటున్న యీ తరుణంలో ఆంధ్రదేశంలో ఎండలు మరింత వుధృతంగా వుంటాయి అని తెలిసికూడా శ్రీ రమణ చిత్ర బృందం అక్కడికి వెళ్లడానికి కారణం లేకపోలేదు.

నిర్మాత శ్రీమతి సీతాపద్మరాజు నిర్మిస్తున్న "డూ డూ బసవన్న" చిత్రం తాలూకు పాటల చిత్రీకరణ దేవీపట్నంలో జరపాలని, దర్శకుడు బి. వి. ప్రసాద్‌గారు నిర్ణయించడంవల్ల, అక్కడికి వెళ్లడం జరిగింది, అన్నారు నాయక పాత్రధారి శ్రీ చలం.

"దేవీపట్నంలో ఏం చేశారు" అని చలంగారిని అడిగాను. "దీపతో సరసం...సల్లాపం...శృంగారం చేశాను" అన్నారు బసవన్న చిత్రనాయకుడు.

"డూ డూ బసవన్న" చిత్రం యొక్క యిన్‌డోర్ షూటింగును జులైలో సారథీలో జరపడానికి, చలం నిర్ణయించారు.

ఈ కొత్తతరహా చిత్రంలో గుమ్మడి, అంజలీదేవి, నాగభూషణం, పండరీబాయి, నిర్మాత, త్యాగరాజు, సాక్షి రంగారావు, కె. విజయ, పొట్టి ప్రసాద్ ముఖ్య పాత్రధారులు.

సాంకేతిక శాఖలను పినిసెట్టి, సత్యం, ప్రకాష్, సోమనాథ్, రవి నిర్వహిస్తున్నారు.

ఈ చిత్రంలో "గొర్రెపోతు" ఫీట్సు ప్రత్యేక ఆకర్షణ.

ఆదివారం స్పెషాలిటీ ఏమిటి ?

అనగానే ఎవరి విషయంలో అనే ప్రశ్న వుదయిస్తుంది మీ మనసుల్లో. అందుకే ఈ క్రింది సంభాషణాన్ని మీముందుంచుతున్నాను.

జయసుధ, మాధవి క్లోజ్ ఫ్రెండ్స్. మాధవి ఒక లక్షాధికారి అన్నయ్య అనుంగు చెల్లెలు. జయసుధ ఒక మధ్య తరగతి కుటుంబీకుని ఏకైక కూతురు. అప్పుడప్పుడు కాలక్షేపం కోసం మాధవి ప్రోద్బలంతో వాళ్ల ఇంటికెళ్లి షటిల్‌కాక్ ఆడ్తో వస్తుండేది జయసుధ. రోజులాగే ఆ రోజు కూడా గేమ్ ఆడ్డం పూర్తిచేసి గలగలా నవ్వుతూ గుమ్మం లోపలి కడుగెట్టారు మాధవి, జయసుధ. ఎదురుగ్గా సోఫాలో కూర్చొనున్న వ్యక్తిని చూసేసరికి బిత్తరపోయింది జయసుధ. మాధవి మాత్రం వూరుకోలేదు. "గుడ్ గాడ్! ఈరోజు సముద్రాలు ఇంకిపోవడమో, నక్షత్రాలు రాలిపోవడమో జరుగుతుంది" అంది తన అన్నయ్య కృష్ణంరాజు నుద్దేశించి. "ఏం ఎందుకని" అంటూ ప్రశ్నించారు కృష్ణంరాజు. "ఆదివారం సాయంత్రం నువ్వు ఇంట్లో వున్నావంటే అంతేమరి" అంటూ మనసులోని మాటను బయటపెట్టింది మాధవి. "ఏమోనమ్మా! ఈమధ్య సాయంత్రంపూట ఇంట్లోనే వుండాలనిపిస్తోంది" అంటూ సమాధాన మిచ్చారు కృష్ణంరాజు.

పై సంభాషణాన్నిబట్టి యిదంతా ఒక చిత్రంలో అని అర్థమై వుంటుంది మీకు. ఆ చిత్రం పేరు "అమరదీపం". హీరో కృష్ణంరాజు సమర్పణలో గోపీకృష్ణా మూవీస్ నిర్మిస్తున్న ఈ భారీ వర్ణ చిత్రానికి కె. రాఘవేంద్రరావు దర్శకుడు. శ్రీ యు. వి సూర్యనారాయణరాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి జయకృష్ణ నిర్వహణాధికారి.

బాలచందర్ చిత్రాలలో శరత్

"కన్య ... కుమారి"లో గిటార్ సింగర్‌గా, "జీవితనౌక"లో దుష్టుడుగా నటించి, వెరైటీ నటుడుగా ప్రేక్షకులను రంజింపచేసిన శరత్‌బాబుకు బాలచందర్‌గారి రెండు చిత్రాలలో అవకాశం వచ్చింది.

ఒక చిత్రం షూటింగు సారధీలో జరుగుతూ వుంది. మరొక చిత్రం "పట్టణ ప్రవేశం" చెన్నపురిలో జరుగబోతూంది.

తీస్తే మర్డర్స్ లేని చిత్రం తియ్యాలి !

ప్రసాద్ స్టుడియోలో శ్రీ రామకృష్ణా ఆర్ట్సువారి "గడుసు పిల్లోడు" వర్ణచిత్రం షూటింగ్ జరుగుతుందారోజు. స్ట్రెయిప్డ్ బ్లాక్ కలర్ స్లాక్, వైట్ కలర్ ఫాంట్ ధరించి, ఫ్రెంచ్ కట్ మీసాలతో వున్న ఓ వ్యక్తి విడో వేషంలో వున్న రాజబాబు నుద్దేశించి "బామ్మగారూ! నాకు తెలియకడుగుతాను మీరు మాటిమాటికి మా బావగారి దగ్గరున్నప్పుడు, మా బావగారి దగ్గరున్నప్పుడు అంటుంటారు. మరి మీరు భర్తగారి దగ్గర వున్నదెప్పుడు" అని ప్రశ్నిస్తూ కన్పించారు. అదే షాట్‌ను రెండు, మూడుసార్లు ట్రయల్ చూసి ఫైనల్‌గా ఒక టేక్‌ను "ఓకే" చేశారు దర్శకుడు కె. బాపయ్య. ఆ టేక్ అయ్యేసరికి సరిగ్గా "టీ" టైమైంది. ఫ్రెంచ్ కట్ మీసాల వ్యక్తి బయటికొచ్చారు. నేనాయన్ను సమీపించి "మీ క్రొత్త చిత్రం ఎప్పుడండీ" అనడిగాను. "ఇప్పట్లో ఏమీ లేదండి. ఈసారి చిత్రమంటూ తీస్తే సాధ్యమైనంతవరకూ మర్డర్స్ లేకుండా చిత్రం తీయాలనుకుంటున్నాను. అందువల్లే చిత్ర నిర్మాణానికి జాప్యం జరుగుతూంది" అన్నారు నవ్వుతూ. ఇంతకూ, ఫ్రెంచ్‌కట్ మీసాల వ్యక్తెవరో చెప్పలేదుకదూ. అతని మారు పేరు హాస్యపు జల్లు. అసలు పేరు అల్లు (అల్లురామలింగయ్య).



'జీవన తీరాలు'లో కృష్ణంరాజు, సుధ

దేవదాస్‌కు అభినందనలు

మద్రాస్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో లెక్చరర్‌గా పనిచేసి "ఓ సీత కథ" ద్వారా వెండితెరకు పరిచయమైన కనకాల దేవదాస్ దర్శకత్వం అనే క్రొత్త బాధ్యతను స్వీకరించిన విషయం మీకందరికీ తెలుసుగా. రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి "నిజం" నాటకం ఆధారంగా కళాభారతి ఇంటర్నేషనల్ బ్యానరుపై దేవదాస్ డైరెక్ట్ చేసిన "నిజం" చిత్రాన్నిగూర్చి పరిశ్రమలో మంచి మాటలు వినిపిస్తున్నాయి. "డ్రామాను సెల్యులాయిడ్‌పై చక్కగా ఎక్స్‌ప్లాయిట్ చేశారు; చెప్ప దలుచుకున్న విషయాన్ని సూటిగా చెప్పడానికి ప్రయత్నించారు దేవదాస్" అని సినీ విమర్శకులు కొందరు అభిప్రాయ పడుతున్నారు.

మేకప్‌లు లేకుండా ఒకే షెడ్యూల్లో వరంగల్లు సమీపంలోని విస్నూరులో పూర్తయిన ఈ చిత్రంలో గుమ్మడి నటనను గూర్చి పదేపదే చెప్పుకుంటున్నారు. నారాయణరావు, శరత్‌బాబు, శ్రీనాథ్, రాంబాబు, అంకినీడు, రాజేంద్రప్రసాద్, విఠల్ ప్రసాద్, పొట్టి ప్రసాద్, హేమాచౌదరి, రమాప్రభ, జయమాలిని, గిరిజారాణి, కృష్ణప్రియ, లక్ష్మీదేవి తదితర పాత్రలను పోషించిన ఈ చిత్రానికి సురేందర్‌రెడ్డి నిర్మాత. విద్యాసాగర్ ఎగ్జిక్యూటివ్ నిర్మాత.

మీ "నిజం" చిత్రంగూర్చి రెండు మాటలు చెప్పండి అనడిగాను దేవదాస్‌గార్ని. "కోర్టుకు చెవులే కానీ కళ్లు లేవు, చెప్పే సాక్ష్యాలనుబట్టి తీర్పు నిస్తుంటుంది చట్టం. నిజాన్ని నిర్భయంగా చెప్పకపోతే నిరపరాధులుకూడా ఒక్కొక్కసారి శిక్ష ననుభవించాల్సి వస్తుంది. అందుకే నిజాన్ని నిర్భయంగా చెప్పండి. నిరపరాధుల్ని రక్షించండి అనే సందేశమే మా ఇతివృత్తం" అన్నారు దేవదాస్.

గడుసు అమ్మాయిలో క్రొత్తవాళ్ళు

నెం. 8 విజయరాఘవాచారి రోడ్‌లో ద్వారకా ఆర్ట్స్ ప్రొడక్షన్స్ వారి ఆఫీసు వుంది. ఆ సంస్థ కె. ప్రత్యగాత్మ దర్శకత్వంలో "గడుసు అమ్మాయి" అనే చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం పాఠకుల కిదివరకే తెలిపాను. చిత్రం పూర్తయిందని తెల్సింది. విడుదలెప్పుడో తెల్సుకుందామని వారి ఆఫీస్ కెళ్ళాను. ఏమిటండీ విశేషాలు ? ఎప్పుడు విడుదల మీ చిత్రం ?" అనడిగాను నిర్మాత రాఘవేంద్రరావుగార్ని. "జూన్‌లో చేయాలను కుంటున్నాం. మా చిత్రంలో విశేష మేమిటంటే చాలామంది క్రొత్తవాళ్లను కొన్ని శాఖల ద్వారా పరిచయం చేస్తున్నాం. నృత్య దర్శకుడిగా సుబ్రమణ్యాన్ని, పాటల రచయితగా వాగభైరవగార్ని నేపథ్య గాయకుడిగా కె. రామచంద్రరెడ్డిని, ఉపకథానాయికగా కుమారి రజనిని మా "గడుసు అమ్మాయి" చిత్రంతో పరిచయం చేశాం అన్నారు నిర్మాత రాఘవేంద్రరావు.

జయసుధ, మురళీమోహన్, జగ్గయ్య, మోహన్‌బాబు, అల్లురామలింగయ్య, వంకాయల సత్యనారాయణ, లక్ష్మీకాంత్, ఝాన్సీ, సీతాలత, రజని, విజయలక్ష్మి, రావికొండలరావు, రాజేశ్వరి, శ్యామల ముఖ్య పాత్రలను పోషించిన యీ చిత్రానికి కె. ప్రత్యగాత్మ దర్శకత్వాన్ని, బొల్లిముంత రచన్ను, తాతినేని చలపతిరావు సంగీత దర్శకత్వాన్ని, వి. యస్. ఆర్. కృష్ణారావు ఛాయను, తోట హేమచందర్ కళను, కృష్ణస్వామి కూర్పును సమకూర్చారు. పూర్ణా విడుదలచేసే ఈ చిత్రానికి నిర్మాతల్లో పి. వెంకటేశ్వరరావుగారొకరు.

'ఎదురీత'లో సత్యనారాయణ, జగ్గయ్య



అవార్డుకు అర్హమైన చిత్రం

ఆర్ట్ ఎంటర్ ప్రైసెస్ వారి "ఊరుమ్మడి బతుకులు" చిత్రాన్ని ఇటీవల ప్రముఖులు చూచారు. అందరూ ఒకే భావాన్ని వ్యక్తం చేశారు. సహజత్వం ప్రతి ఫ్రేములో వుట్టిపడేలా ఈ చిత్రాన్ని నిర్మించిన డైరెక్టర్ బి. యన్. నారాయణగార్ని అభినందించారు. జాతీయ అవార్డు నందుకునే యోగ్యత ఈ చిత్రానికుందని అభిప్రాయ పడ్డారు.


బహుళ ప్రజారణ పొందిన "ఊరుమ్మడి బతుకులు" నాటకాన్ని చిత్రంగా నిర్మించే వుద్దేశ్యంతో జి: కె. మూర్తి, జె. వెంకటార్య హైదరాబాద్‌కు సమీపానగల పనుమామల గ్రామంలో 16 రోజులు షూటింగ్ జరిపి చిత్రాన్ని పూర్తి చేసుకొచ్చారు. గ్రామాల్లో కామందుల, భూస్వాముల అధికారాలకు, అహంకారాలకు పేద ప్రజలు అమాయకులు ఎలా బలై పోతున్నారు అనే అంశంపై నడిచేకథ "ఊరుమ్మడి బతుకులు". రీ–రికార్డింగ్ కూడా ఈ చిత్రానికి ప్రత్యేక పద్ధతిలో చేసారు సంగీత దర్శకుడు యం. బి. శ్రీనివాసన్.

లక్ష్మి విడుదల చేసే ఈ చిత్రానికి కథ, మాటలను సి యస్. రావు, ఛాయను లక్ష్మణ్‌గోరే సమకూర్చ: స్క్రీన్ ప్లే, దర్శకత్వం బి. యస్. నారాయణ నిర్వహించారు. తెలుగులో అవార్డు చిత్రాలు రావడం లేదనే కొఱతను ఈ చిత్రం తీరుస్తుందని పల్వురభిప్రాయ పడుతున్నారు.

మహారథి మంచిని పెంచాలి

"నేటి సమాజంలో ధన దాహం పెరిగి పోయింది. స్వార్థం విలయతాండవం చేస్తూంది. బంధుత్వం బజారు పాలౌతుంది. మానవత్వం మాసి పోతూంది. అమానుషత్వం అగ్రరూపం దాలుస్తూంది. న్యాయం నడివీధిలో నాట్యం చేస్తూంది. ధర్మం దగాకోరుల చేతుల్లో నలిగిపోతూంది. సత్యం సారాయంగట్లో సరసమాడుతూంది. నీతి నీడకోసం వెతుకుతూంది. ఇలా అస్తవ్యస్తంగా మారుతున్న పరిస్థితులకు పరిష్కారమే లేదా? ఇట్టి విషమ పరిస్థితుల్ని ఎందువల్ల ఎదుర్కోవలసి వస్తుంది" అనే సమస్యలను సహేతుకంగా చర్చిస్తూ మహారథి సృజించిన కథే "మంచిని పెంచాలి." "మంచి యన్నది పెంచుమన్నా, మమతను పంచుమన్నా" అనే సందేశాన్ని ప్రబోధించే చిత్రమే మహారథి "మంచిని పెంచాలి"

ఒంగోలు దగ్గర పూర్తయిన ఈ చిత్రానికి ఏ. యం. రాజా సంగీత దర్శకత్వం వహించడం ఒక విశేషం. కర్నాటి వీరయ్య, పోలంరాజు వెంకటేశ్వర్లు నిర్మించిన ఈ చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్‌ప్లే దర్శకత్వమును మహారథి, వి. యస్. ఆర్. కృష్ణారావు కెమేరాను, కె. రామలింగేశ్వరరావు కళను, కె. గోపాలరావు కూర్పును సమకూర్చారు. శ్రీధర్, కె. విజయ ఒక జంటగా, ఈశ్వరరావు, ఫటాఫట్ జయలక్ష్మి మరొక జంటగా, పద్మనాభం, గిరిజారాణి ఇంకొక జంటగా నటించిన ఈ చిత్రంలో సావిత్రి, కాంతారావు, హరిబాబు, మనోరంజన్, కె. వి. చలం హేమా చౌదరి, ఛాయా దేవి. తదితర పాత్రలను పోషించారు.





'ఊరుమ్మడి బ్రతుకులు'లో సత్యేంద్రకుమార్, మాధవి

త్వరలో విడుదలౌతున్న చిత్రాలు

విశ్వ భారతీ మూవీస్ పతాకం క్రింద మాదిరెడ్డి సులోచన నవలాధారంగా జి. రాధాకృష్ణమూర్తి నిర్మించిన చిత్రమే "తరం మారింది." అనాదిగా పాతుకుపోయిన మూఢాచారాలను మట్టుపెట్టి, కాలానుగుణంగా అభిరుచులు, అభిప్రాయాలు, మార్చుకోవాలి అని చాటి చెప్పే ఇతివృత్తమే "తరం మారింది." ఈ తరం ప్రతినిధిగా హీరో శ్రీధర్ నటించిన ఈ చిత్రంలో పల్లవి, శోభ, దాశరథి, ప్రసాదరావు, ప్రదీప్ మున్నగు క్రొత్త వాళ్ళతోబాటు లక్ష్మీకాంత్, సీతాలత, సుధ ముఖ్య పాత్రలను పోషించారు. సింగీతం శ్రీనివాసరావు ఈ చిత్రానికి దర్శకుడు.

శ్రీ వాణీ ఆర్ట్ కంబైన్స్ బ్యానరుపై పి. చంద్రశేఖరరెడ్డి దర్శకత్వంలో ఎన్. బి.

సినిమా

సుబ్బరాజు నిర్మించిన "ఒకే రక్తం" జూన్‌లో విడుదలౌతుందని తెలుస్తుంది. రెబల్‌స్టార్ కృష్ణంరాజుగారు హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి గీత ప్రసాద్, కొమ్మినేని, జయప్రద, కె. విజయ, పండరీబాయి, మరియు రావుగోపాలరావు ప్రధాన పాత్రలను పోషించారు.

మురళీకృష్ణా మూవీస్ పతాకం క్రింద కె. యస్. ఆర్. దాస్ దర్శకత్వంలో యం. కె. రాధ ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మించిన జంగిల్ బ్యాగ్రౌండ్ చిత్రం "దేవుడున్నాడు జాగ్రత్త" త్వరలో విడుదలౌతోంది. రంగనాథ్, ప్రభాకరరెడ్డి, గిరిబాబు, కాంతారావు, త్యాగరాజు, దేవిక, జయమాలిని, సి. ఆర్. వరలక్ష్మి, మిక్కిలినేని, నాగేష్, నూతన నటి సుచిత్ర ముఖ్య భూమికలను ధరించారీ చిత్రంలో.

దాసరి నారాయణరావుగారు కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం సమకూర్చిన బాబ్ అండ్ బాబ్ ఆర్ట్ పిక్చర్స్ వారి "ఓ మనిషి తిరిగిచూడు" చిత్రం విడుదలకు ఉరకలేస్తోంది. దిడ్డి శ్రీహరిరావుగారు నిర్మించిన యీ సందేశాత్మక చిత్రంలో మురళీమోహన్, జయసుధ, ఈశ్వరరావు, మోహన్‌బాబు, గోకిన రామారావు, జి. ఎస్. ఆర్. మూర్తి, కె. విజయ, నిర్మల, జయవాణి, పేకేటి, బెనర్జీ ప్రధాన పాత్రలను పోషించారు.

శ్రీ జయవాణీ ఆర్ట్స్ పతాకం క్రింద చక్రవర్తి దర్శకత్వంలో జె. జె. కృష్ణప్రసాద్ నిర్మించిన "అదృష్టవంతురాలు" చిత్రం రిలీజ్‌కు రెడీ అయింది. చలం, సత్యనారాయణ, దేవదాస్, నాగభూషణం, షావుకారు జానకి, ప్రభ, మమత, వై. విజయ, మీనాకుమారి, ఉదయచంద్రిక, మాడా, కె. కె. శర్మ, ఆనందమోహన్ ముఖ్య పాత్రలను పోషించారీ చిత్రంలో.

హీరో కృష్ణ కథానాయకుడిగా, వాణిశ్రీ కథానాయికగా వెంకటరమణ పిక్చర్స్ బ్యానరుపై ఎల్. భాస్కరరావు, ఎస్. కనకసుందరరావులు భారీయెత్తున నిర్మించిన "జన్మ జన్మల బంధం" వర్ణ చిత్రం అతిత్వరలో విడుదలౌతుందని తెలుస్తోంది. చాలారోజుల తర్వాత హీరో కృష్ణ, కళాభినేత్రి వాణిశ్రీ కల్సి నటించడం ఒక విశేషాంశం యీ చిత్రంలో. పి. సి. రెడ్డి దర్శకత్వంలో ముస్తాబయిన యీ చిత్ర ఇతివృత్తమేమనగా, పవిత్రమైన ప్రేమకు చావులేదు. ప్రేమించుకున్న మనుషులు గతించినా, వారి మనసులుమాత్రం పరిభ్రమిస్తూనే వుంటాయి. ఏదో ఒక జన్మలో కలుసుకుంటుంటాయి.

—శ్రీనివాస్

విముక్తి

కె. మోహనరావు



ెండ నిప్పులు చెరుగుతుంది. గోడ గడియారం పన్నెండు గంటలు కొట్టింది. వీధులు ర్మానుష్యంగా వున్నాయి. రాజారావు సైకిల్ ాపులో తన పని తను చేసుకు పోతున్నాడు. ఇద్దరు నివాళ్లు వున్నా రాజారావుకి వూరికే కూర్చోబుద్ధి ాదు. వాళ్లతో సమానంగా పని చేస్తాడు. ప్రక్కన ఆవధానిగారు కుర్చీలో కూర్చుని పేపరు చదువు కుంటున్నారు. ఆయన ఖాళీ సమయం అంతా రాజారావు షాపులోనే గడిపేస్తారు. ఇది యీనాటిది ాదు. సరిగ్గా పదిహేను సంవత్సరాలనుండి జరుగు తోంది. అందరు హాస్యానికి ఆవధానిగారికి షాపులో వాటా వుంది అంటారు. అయినా ఆయన లెక్క చెయ్యరు రాజారావంటే ఆయనకు అమిత వాత్సల్యం. రాజారావు పొరపాటున యీ ప్రపంచంలో పుట్టాడని ఆయన నమ్మకం. రాజారావు పదహారేళ్లప్పుడు తండ్రిని పోగొట్టుకుని తల్లిని, యిద్దరు తమ్ముళ్లని, యిద్దరు చెల్లెళ్లను ఆస్తిగా సంపాదించుకున్నాడు. పుస్తకాలు విసిరికొట్టి సైకిల్‌షాపులో ప్రవేశించాడు. అప్పటినుండి అతని భుజస్కంధాలమీద సంసారం నడిచిపోతుంది. ఇద్దరు చెల్లెళ్లకు పెళ్లి చేసాడు. తమ్ముళ్లను చదివించాడు. సైకిల్‌షాపుకి వోనరు అయ్యాడు. ఇవి సాధించటానికి సరిగ్గా పద్దెనిమిది సంవత్సరాలు పట్టింది.

''భోజనానికి వెళ్ళటంలేదూ'' అవధానిగారు ప్రశ్నించారు.

''లేదండి. పని చాలవుంది. భోజనం పంపమని చెప్పివచ్చాను'' అన్నాడు రాజారావు.

''పనులెలాగూ వుంటాయోయ్. అందుకోసం కడుపు మాడ్చుకోకూడదు''

''నిజమేనండి కాని సాయంత్రానికి యీ నాలుగు కొత్తసైకిళ్ళు బిగించెయ్యాలి. పిల్లలకి కొత్తమోజు యెంతుంటుందో మీకు తెలుసుగా. వాళ్ళఆశ నిరాశ చెయ్యటానికి మనస్సు వొప్పదు.''

అవధానిగారు పేపరు కిందికిదించి రాజారావు వంక వాత్సల్యంతో చూసారు. రాజారావు జీవితంలో అనుభవించిందిలేదు. తన జీవితం తమ్ముళ్లకు, చెల్లెళ్లకు అర్పించాడు. అంతలో రాజారావుచేతిలో పని ఆగిపోవటం తదేకంగా రోడ్డుమీదికి చూడటం చూసి ఆయనకూడ రోడ్డువైపు చూసారు.

రోడ్డుమీద పార్వతి కనిపించింది. పార్వతి అందమయింది. అయినా కుంకుమ నోచుకోలేదు. పెళ్ళయిన సంవత్సరంలోపునే భర్తను పోగొట్టుకున్న అభాగ్యురాలు. ఆమెకిప్పుడు ముప్ఫయి సంవత్సరాలు. ఆమె సంఘసంస్కర్త రాఘవరావు చెల్లెలు. స్కూల్లోటీచరుగా పనిచేస్తుంది. తీరికసమయాల్లో ప్రయివేట్లు చెప్తుంది. ఆ పైన యింట్లో చేతినిండాపని.

పార్వతిని చూసినప్పుడల్లా రాజారావు కళ్ళల్లో యేదో వెలుగు కనిపిస్తుంది. ఆమె కనిపించేంతవరకు చూసి తర్వాత నిట్టూర్పువిడిచి పనిలో నిమగ్ను డయ్యాడు.

''పాపం బానిస'' అన్నారు అవధానిగారు.

రాజారావు కంగారుపడిపోయి ''యెవరు'' అని అడిగాడు.

''అదే పార్వతి నంటున్నాను. చాలా వుత్తము రాలు. అన్న పేరుకి సంఘసంస్కర్త అయినా చెల్లెలు పెళ్ళిమాట ఎత్తడు''

''కారణం''

''కారణం చాలాచిన్నది. పార్వతి రెండుచేతులా సంపాదిస్తుంది. యింటిలో బండెడుచాకిరి చేస్తుంది. అటువంటి పెన్నిధి చేతులార వదులుకోవటానికి చాల విశాలహృదయుడయి వుండాలి''

''స్వార్థం'' కోపంగా అన్నాడు రాజారావు.

''బానిసత్వం యెప్పుడో రూపుమాసిపోయింది కాని యిది అంతకంటే హీనమయింది. కొందరి బ్రతుకులు చాల హేయమయిన బ్రతుకులోయ్.

యెన్నోసాపాలుచేస్తేకాని అటువంటి నికృష్టజీవితం లభించదు'' అన్నారు బాధగా.

''అందుకు పరిష్కారంలేదా మాస్టారూ'!

''యెందుకు లేదు. పార్వతి తనంతతాను ముందడుగువేసి పెళ్ళి చేసుకోవాలి.''

రాజారావు ముఖంలో బాధ ద్యోతకమయింది. మౌనంగా అవధానిగారిమాటలు మననం చేసుకుంటూ వుండిపోయాడు.

అవధానిగారు తిరిగి ''చూడు రాజారావు మనిద్దరి స్నేహం ఒకనాటిదికాదు. నీ సంగతి నాకు తెలుసు. నీ హృదయం అమృతమయం. అందరికి సంతోషం పంచిపెట్టాలని అనుకునే స్వభావం కాని పరిస్థితులు గమనించుకోవాలి. అపాత్రదానం పనికి రాదు. పార్వతీ బానిస అన్నానుకదూ, అదే బహుశ నీకుకూడ వర్తిస్తుంది'' అన్నారు.

రాజారావు చేతిలోరెంచి వదిలేసి ఆయనవంక తెల్లబోయి చూసాడు.

''క్షమించు రాజారావు. నీ మనస్సు కష్ట పెట్టాలని నా వుద్దేశ్యంకాదు. నిజం చెప్తాను. నీకు ముప్ఫయిఅయిదు సంవత్సరాలు పైబడినా మీ అమ్మగారికి నీ పెళ్ళి చెయ్యాలనే వుద్దేశ్యం కలుగ లేదు. వచ్చిన సంబంధాలు వెనక్కి త్రిప్పివేసింది. కారణం యేమిటోతెలుసా. వడ్డించిన విస్తరి యెవరు వదులుకోరు. నీకు పెళ్ళాం బిడ్డలువుంటే వాళ్ళని చూడవేమో అని ఆమె భయం. యింకొక వింత విషయం యేమిటంటే మిగతాపిల్లల మీదున్న ప్రేమ నీ మీద కనిపించదు. నీ మీద అధికారం, వాళ్ళమీద ప్రేమ, ఆమె మనస్సు రాయిచేసుకుంది. అందరి సుఖం కోసం నిన్ను బలిదానం చేసింది. మీ చెల్లెళ్ళకు తమ్ముళ్ళకు నీవంటే ప్రేమలేదు. కేవలం నీవు వాళ్ళ సాధకబాధకాలు తీర్చవలసిన మనిషివి. కోరటం వాళ్ళ జన్మహక్కు. తీర్చవలసిన బాధ్యతనీది. ఇది ఇంటికి పెద్దవాడై పుట్టినందుకు దేవుడిచ్చిన శాపం. ఆ యింటి నాలుగు స్తంభాల్లో నువ్వొకడివి.''

రాజారావు ముఖం వుగ్రరూపం దాల్చింది.

విముక్తి

''మాస్టారూయివాళ మీరు చాలా వింతగా మాట్లాడు తున్నారు'' అన్నాడు కోపంగా.

''అవును రాజారావు. అందుకే క్షమించ మన్నాను. మనిద్దరిమధ్యవున్న స్నేహం చాల సున్నిత మైనది. నా మనస్సులోవున్నది చెప్పటం మంచిదిగా తోచింది. నీ బాగు నాకు కావాలి. హాయిగా పెళ్ళి చేసుకో. జీవితంలోవున్న మాధుర్యంకూడ చవిచూడు. జీవచ్ఛవంలా బ్రతకటం అమానుషం''

రాజారావు దిగ్గునలేచాడు. ''మాస్టారూ మీ వంట్లో బాగోలేదు. వెళ్ళి విశ్రాంతి తీసుకోండి'' అన్నాడు కోపంగా.

అవధానిగారు అవాక్కయి చూసారు. ఓడి పోయానని తలఅడ్డంగాఊపి న్యూస్‌పేపరు టేబిల్ మీదపెట్టి లేచినుంచున్నారు.

''రాజారావు నువ్వు నాకు కొడుకులాంటివాడివి. యింతకాలం బిగపెట్టిన బాధ,భావాలు నీకు చెప్పటం ధర్మం అనిపించింది. అందుకని వెళ్ళగక్కేసాను. నా మనస్సు తేలికఅయింది. నీకు యీ షాపు, యిల్లు తప్పించి బయట ప్రపంచం తెలియదు. దేవుడే నిన్ను కాపాడతాడు. వస్తాను'' అని వికలమయిన మనస్సుతో భారంగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి పోయారు.

రాజారావు కండ్లఅంచులమీద నీళ్ళు నాట్యం చేసాయి. రాజారావు గుండెలు ఎవరో పిండినట్లు అనిపించింది. యింతకాలం పార్వతిమీద సానుభూతి చూపించాడు. అదే విషయం తనకి వర్తిస్తుందని అనుకోలేదు. తను ముప్ఫయిఅయిదు సంవత్సరాలు వచ్చేదాకా వంటరిగా యెలా వుండిపోయాడు. అమ్మ యెప్పుడు పొరపాటునకూడ పెళ్ళిప్రస్తావన తేలేదు. పోనీ తమ్ముళ్ళను, చెల్లెళ్ళను సంతృప్తి తరచగలిగాడా, లేదు. పెళ్లిళ్ళుచేస్తే యింకా పెద్ద సంబంధాలు తేలేదని ఆంక్ష. నగలుకొంటే ఇంకా ఎక్కువ పెట్టికొనలేదని నిష్ఠూరాలు బట్టలు నచ్చలేదు. తనకి స్వార్థపరుడు అనే బిరుదు యిచ్చేసి అత్తవారింటికి కళ్ళ నీళ్ళతో వెళ్ళి పోయారు చెల్లెళ్ళు. తమ్ముళ్ళు తనని తెలివి తక్కువ వాడిగా జమకట్టేసారు. తను పెద్దగా చదువుకో లేదు. యింగ్లీషు సినిమాలు చూడలేదు సినిమా యేక్టర్ల పేర్లు తెలియవు. వాళ్ళలాగ బెల్‌బాటమ్స్ వెయ్యలేదు. సైకిలెక్కి జాంయ్ మని వూరంతా సర్వే చెయ్యలేదు. వాళ్ళ దృక్పథంలో తను రాతి యుగం వాడు. మరి తల్లి సంగతేమిటి? అవధాని గారు చెప్పినట్లు నిజం స్పష్టంగా కనిపిస్తూనేవుంది. తల్లి అందర్ని ప్రేమగా చూస్తోంది. వాళ్ళ ఆలనా పాలనా చూస్తోంది. తన దగ్గరకు వస్తే పెడ సరం, పుల్ల విరుపు మాటలు వస్తాయి. రాజారావు యీజీచెయిర్‌లో కూలబడి పోయాడు. ఆలోచనలు ముసురు కొచ్చాయి. బుర్ర వేడెక్కిపోయింది.

గడియారం రెండు గంటలు కొట్టింది

''అయ్యగారు, భోజనానికి వెళ్ళరా. పోనీ నేను వెళ్ళి తెస్తాను'' అన్నాడు పనికుర్రవాడు.

''వద్దు, నేనే వెళ్తాను'' అని లేచాడు రాజారావు. మనస్సు భారంగా వుంది. అమ్మ భోజనం యెందుకు పంపలేదు. తనంటే యెవరికి ప్రేమలేదు.లోపల కోపం, పైన ఎండ. అడుగులు గబ గబ ముందుకు పడ్డాయి.

తలుపు కొట్టగానే జానకి వచ్చి తలుపు తీసింది.

రాజారావు లోపల అడుగు పెట్టలేదు. ''భోజనం యెందుకు పంపలేదు'' అని సూటిగా అడిగాడు.

''బాగుంది, బయటనుంచి అరవకపోతే లోపలికి రావచ్చుగా'' అంది జానకి కోపంగా.

''నేను అడిగిందానికి సమాధానం రాలేదు''

''చిన్నాడికి తలనెప్పిగా వుంది. పెద్దవాడు షాపుకి రావటానికి వెనకాడుతున్నాడు''

''అంటే నేను అంత హీనమయిన పని చేస్తున్నానా''

''అలా అని కాదు. ఎమ్. ఎ. చదివేవాడు యెన్నో కలలు కంటాడు, వాళ్ళ దర్జాలు వేరు. వాళ్ళ వూహలు వేరు. వాళ్ళని అనిమాత్రం లాభమేముంది''

''నేను యీ యింటిలో వుండటం కూడ నచ్చదేమో'' అన్నాడు రాజారావు కోపంగా.

బాగుంది యివన్నీ అర్థం చేసుకోవటానికి చదువు, సంస్కారం వుండాలి. ఊరికే వాడ్ని ఆడి పోసుకోవటం యెందుకు. ఈ మధ్య వాళ్ళంటే నీకు పడటం లేదు''అంది జానకి భృకుటి ముడిచి వేస్తూ.

''నిజం అమ్మా. నాలో చదువు, సంస్కారం లేవు. ఉత్తి స్వార్థపరుడ్ని'' అని వెనక్కితిరిగి కోపంగా అడుగులు వేసుకుంటూ తిరుగుముఖం పట్టాడు.

''అదేమిటి అలా వెళ్ళిపోతున్నావు. భోజనం చెయ్యవూ'' అన్న జానకి మాటలకు రాజారావు జవాబు చెప్పలేదు.

రాజారావు అవధానిగారి యింటికివెళ్లి తలుపు తట్టాడు. తలుపుతీసిన అవధానిగారు క్షణం తెల్లబోయి తర్వాత తృప్తిగా నవ్వారు.

''లోపలికి రావోయ్. నీ గురించే ఆలోచిసు

గొప్పవాడు [•]

— గుడిమెట్ల గోపాలకృష్ణ

అగాధాల్ని పూడ్చు
ఆత్మీయతల్ని రగిలించు
అనురాగాల్ని పంచు
సత్యాన్వేషణ జరుపు...
అవకాశాలు పొందు
అర్హతలు నింపు
ఆదరణలు పొందు
ఆత్మగౌరవం పెంచు...
చరిత్ర లిఖించు
మనుషుల్ని చదువు
దేశాన్ని పూజించు
నిన్ను నువ్వు తెల్సుకో...

కడుపు నింపుకో
కన్నీళ్ళు తుడుచుకో
కరువు పోగొట్టుకో
కష్టిస్తానని ప్రతిజ్ఞ చేసుకో...
జీవితాన్ని తెల్సుకో
జీవితాన్ని ఆనందించు
జీవితంలో జీవించు
జీవితాన్ని ప్రేమించు...
అన్నీ ఆచరించలేనపుడు
ఆదర్శాలు వల్లించక్కర్లేదు
'ఎదుటివాడి కన్యాయం చెయ్యకు'
ఈ లోకానికి గొప్పవాడివే !!

న్నాను నేను చేసింది తప్పేమోనని బాధ పడుతున్నాను.''

''నన్ను లోపలికి రానివ్వకుండా అన్నీ యీ మధ్యాహ్నపు వెన్నెలలో చెప్పేస్తున్నారు.''

అవధానిగారు నవ్వి ''రా, యెందుకో మనసు పరుగెడుతుంది. నేను చేసింది తప్పుకాదు అని నిరూపించుకోవటానికి తహ తహ లాడుతున్నాను'' అన్నారు లోపలికి దారితీస్తూ.

రాజారావు ఆయన్ని అనుసరించి కుర్చీలో కూర్చున్నాడు.

''మాస్టారు మీరు చెప్పింది నిజం'' అన్నాడు రాజారావు.

అవధానిగారు సంభ్రమాశ్చర్యాలతో చూసారు.

''దానికి పరిష్కారం చెప్పండి''

''అది నావల్ల కాదోయ్. జరుగుతున్నది కళ్ళకు చూపెట్టటం వరకే నావల్ల అయింది. సమస్య పరిష్కారం చెయ్యాలంటే అనేక మార్గాలున్నాయి. నేను చెప్పింగ నీకు నచ్చదు. నీ సమస్యలు అన్నీనాకు తెలియవు. ఒక్కసారి బుర్రలో ఆలోచనపడ్డాక అన్నీ పరిష్కరించుకోగలిగే విచక్షణశక్తి నీలోవుంది. నువ్వు నిజంగా గుర్తించావంటే నాకు చాల ఆనందంగా వుంది''

''నిజం గుర్తించాను కాని అది వొప్పుకోలేక పోయాను మీరు కుండబ్రదలు కొట్టినట్లు చెప్పి నన్ను సుషుప్తినుండి లేపారు. వస్తానండి. మీకు ఈ విషయం చెప్పివెళ్దామని వచ్చాను''అని లేచి బయటికి వెళ్ళిపోయాడు.

అవధానిగారి కండ్లల్లో సంతోషరేఖలు కొట్టు వచ్చినట్టుగా కనిపించాయి.

మర్నాడు ఆదివారం రాజారావు ప్రొద్దుటేలేచి తలస్నానంచేసి బయటకి వెళ్ళటానికి తయారవుతూ ''అమ్మా, టిఫిన్ చప్పునపెట్టు. నేను వెళ్ళాలి'' అన్నాడు.

''ఒక్క క్షణంఆగు. సురేష్‌ని ముందుగా తిన నియ్యి. వాడికి అర్జంటుగా పనివుందట.''

''మార్నింగ్ షోకి యింకా చాలటయింవుంది'' అన్నాడు రాజారావు.

'వారేయ్! నువ్వెప్పుడు అంతే. జీవితంలో ఆనందించే వయస్సు యిది. నువ్వు యెప్పుడూ వాడి వెనుక పడి సాధించటం బాగోలేదు.''

రాజారావు శూన్యంలోకి చూస్తూ కూర్చుండి పోయాడు. పది నిముషాల తర్వాత జానకి టిఫిన్ తెచ్చింది. రాజారావు టిఫిన్ తిననారంభించాడు.

''అన్నట్టు మరిచిపోయాను. నిన్ననే చెప్దామనుకున్నానుకాని నీ ధోరణి బాగోక చెప్పలేదు. మన రమేష్ వాళ్ళ క్లాస్‌మేటుని ప్రేమించాడట. ఆమె తల్లిదండ్రులు అంగీకరించి మాట్లాడటానికి నిన్న వచ్చారు. నీతో మాట్లాడదామనుకున్నారు. నేను మాట్లాడానులే'' అంది జానకి.

రాజారావు మాట్లాడలేదు.

''ఏం మాట్లాడవు ?''

''మాట్లాడటానికేముంది? నువ్వు యేమంటావో నాకు తెలుసు. ఇంట్లో పెద్దవాడుండగా చిన్నవాడికి పెళ్ళేమిటి అని అంటావు. అవునా'' అని ఆమె ముఖంలోకిచూసాడు.

జానకి ముఖంలో కళాకాంతులు మాయమై పోయాయి. సిగ్గుతో తల దించుకుని అచేతనంగా వుండిపోయింది.

''నేను అన్నదాంట్లో తప్పు వుందా'' అని అడిగాడు రాజారావు.

''లేదు. నీ పెళ్ళి అవ్వాలనుకో. ఏదీ సరిఅయిన సంబంధం వస్తేగా'' అంది మెల్లగా.

''నీ పిచ్చిగాని యెలా వస్తుంది ? దానికి అర్హతలుండాలి. ఏదో గానుగయెద్దు లాంటి జీవితం నడుపుతున్నాను. పెళ్ళికి చదువు, సంస్కారం, వయస్సు అన్నీ వుండాలి.. అందులో ఏ వొక్కటి నాలో లేవు. ఊరకే అన్నాను. ఇంతకి వాడి విషయం ఏమాలోచించావు.''

''అర్ధంకావటంలేదు. పిల్ల అందంగా వుంటుందట. వాడా ముచ్చటపడుతున్నాడు. ఇల్లు కళకళలాడుతుంది. చెయ్యటమే మంచిదని అనుకుంటున్నాను'' అంది రాజారావు వంక సాలోచనగా చూస్తూ.

''నిజమేనమ్మా! వాడికి యిరువయినాల్గేళ్ళు వచ్చేసాయి. నేను పదహారేళ్ళప్పుడు కుటుంబ బాధ్యతలు నెత్తిన వేసుకున్నాను. నీవు యింతకాలం వాడికి ఊపిరి సలపనిచ్చావు. కుటుంబ భారం వాడి కిచ్చి నేనుకూడ కొంచెం నడుం వాలుద్దామను కుంటున్నాను.''

''అంటే'' అంది జానకి విస్మయంతో.

''నేను పని మానేసి ఇంట్లో కూర్చుంటాను.''

''ఇల్లు యెలా గడుస్తుంది ?'' జానకి కంగారుగా అడిగింది.

''నీకేం బయంలేదు. చదువులేనివాణ్ణి, చిన్న వయస్సులోనే నే ఆదుకోగలప్పుడు, ఎం. ఏ. చదివినవాడు, తెలివిగలవాడు వాడికేం లోటు. వెంటనే నువ్వు ఉవ్విళ్ళూరుతున్నట్టు ఏ కలక్టరో అయిపోతాడు. నీకు కొడుకులు కోడళ్ళ సేవలకు కొదువవుండదు.'

''నీకు వాడి పెళ్ళి ఇష్టంలేదని నిష్కర్షగానే చెప్పవచ్చుగా'' అంది జానకి కోపంగా.

''నేను ఎవర్ని అడ్డుచెప్పటానికి ? చేసేదానివి నువ్వు. చేసుకునేదివాడు. అయితే ఆలోచించవలసిన విషయం ఇంకొకటి వుంది. సైకిల్‌షాపు రాజారావు యింట్లో అంత చదువుకున్నవాడు, వాడి శ్రీమతి యెలా వుండగలరు? రెక్కలు వచ్చాక యీ గూటిని నమ్ముకుంటారని అనుకోను.''

''అయితే అన్నగా నీ బాధ్యత ?''

''తల్లిగా నీ బాధ్యత ఎంత వుందో అందులో ఆరోవంతుకూడ నాదికాదు. అయినా ఎముకలు విరిగేట్టు పని చేస్తున్నాను. నన్ను యేనాడు తల్లిగా కాకపోయినా సాటి మనిషిగాకూడ చూడలేదు. నేను మీ అందరికి సేవ చెయ్యటానికి నా జీవితం వ్యర్థం చెయ్యదలచుకోలేదు.''

''అయ్యోరామ! ఏమిటి! యేనాడు లేనిది యివాళ యింత విపరీతంగా మాట్లాడుతున్నావు. పిచ్చిపట్టిందా ఏమిటి? ఏం మాట్లాడుతున్నావో నీకే తెలియదు.''


''ఇప్పుడే నిద్రనుండి మేల్కొన్నాను అమ్మా! వున్న పిచ్చి వదిలిపోయింది. నీకు ఏమి భయంలేదు. చెణుకులు లాంటి కొడుకులు ఇంకా ఇద్దరున్నారు. వాళ్ళిద్దరు నీకు రెండు కళ్ళలాంటివాళ్ళు. నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తారు. వాళ్ళ ఉద్యోగాలకు భయంలేదు. ఎంతకాలమని వాళ్ళు సైకిల్‌షాపు రాజారావు తమ్ముళ్ళుగా చెలామణి అవుతారు.''

''ఇంత అర్ధంతరంగా వాళ్ళని ఉద్యోగాలు వెతుక్కోమంటే యెక్కడ్నుంచి వస్తాయి.''

''నేను రెండు నెలలకు సరిపోయేందుకు రెండువేల రూపాయలు యిస్తాను. నేను పోతున్నాను. యీ యింటికి నాకు ఋణం తీరిపోయింది'' అని గబగబ బైటకు వెళ్ళిపోయాడు.

జానకి నిశ్చేష్టురాలై నేలమీద కుప్పగా కూలి పోయింది.

రాజారావు అదివారం అయినా షాపు తెరిచాడు. పనివాళ్ళు యెలాగు రారు. పార్వతి యెప్పుడు వెళ్ళేది, ఎప్పుడు వచ్చేది రాజారావుకి కంఠస్థంగా వచ్చు. ఆదివారాలు సరిగ్గా పది గంటలకు వెళ్తుంది ట్యూషన్లు చెప్పటానికి.



పార్వతి దూరంగా కనిపించగానే లేచి రోడ్డు మీదకి నడిచాడు. పార్వతి తెల్లటిచీరలో అందంగా కనిపించింది. నుదుటిమీద బొట్టు లేకపోవటం దేవుడు చేసే అన్యాయాల్ని గుర్తు చేసింది. పార్వతి దగ్గరకు రాగానే ''నమస్కారమండి' అని నమస్కరించాడు.

పార్వతి తలయెత్తి రాజారావుని చూసింది. రాజారావు ఆమెకు తెలుసు. రోజు వచ్చిపోయేటప్పుడు రాజారావుని చూస్తూనే వుంటుంది. పార్వతి రాజారావువంక ప్రశ్నార్థకంగా చూసింది.

''మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి. మీరు వస్తే షాపులో కూర్చుని మాట్లాడుకుందాం''

పార్వతి ఆశ్చర్యంగా చూసి ''నాకు ట్యూషన్‌కి టైం అయిపోయింది. అయినా నాతో మీకేం పని'' అంది.

''వుంది. యిది మన వ్యక్తిగత విషయాలకు సంబంధించింది. నేనంటే మీకు భయమనుకుంట''

''లేదు. మీ గురించి అంతా తెలుసు. సరే పదండి.''

రాజారావు పార్వతికి కుర్చీ చూపించాడు. పార్వతి కూర్చున్నాక ''మీకు యెలా చెప్పాలో నాకు అర్థం కావడం లేదు. మనిద్దరికీ పెద్దవాళ్ళున్నా లేనట్లుగానే వుంది. మీరంటే నాకు యెంతో అభిమానం, గౌరవం వున్నాయి. నాకు మీతో తూగగల చదువు, సంస్కారం లేవు. అయినా సాహసిస్తున్నాను. మీరు నన్ను ఎంతో ఆకట్టుకున్నారు. మీకు అభ్యంతరం లేకపోతే మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాను. నన్ను పెళ్ళి చేసుకుని నా జన్మను పునీతం చెయ్యండి'' అన్నాడు.

పార్వతి కూర్చున్నచోటే బిగుసుకు పోయింది. తర్వాత సంభాళించుకొని ''నేను వితంతువుని. పెళ్ళి చేసుకుంటానని యెలా అనుకున్నారు'' అంది మెల్లగా.

'వితంతువు అయినంత మాత్రాన చేసుకోకూడదని యెలా అనుకున్నారు. మగవాడు పునర్వివాహం చేసుకోగలిగినప్పుడు ఆడవాళ్ళకు ఆంక్షలెందుకు. నాకేమి అభ్యంతరం లేదు. మీరుకూడా నాలాగే బాధిన జీవితం గడుపుతున్నారు. మీ అన్నయ్య

జయచిత్ర నూతన గృహ ప్రవేశ మహోత్సవంలో ఎన్. టి. ఆర్.



రచయితలకు విజ్ఞప్తి

★ ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ప్రచురణకు పరిశీలనార్థం మా కార్యాలయానికి చాలా ఎక్కువ సంఖ్యలో రచనలు, బొమ్మలు వస్తూంటాయి. నిబంధనలు పాటించి రచయితలు మాతో సహకరిస్తే తప్ప — ఆయా రచనల వైనం వారికి తెలియజేయడం సాధ్యం కాదని మేము పదే పదే విజ్ఞప్తి చేయటానికి కారణంకూడా అదే.

మా కార్యాలయానికి స్వయంగా వచ్చి రచనలు, కార్టూన్‌లు అందజేసేవారుకూడా పరిశీలనానంతరం వాటి వైనం తెలుసుకునేటందుకు తమ రచనలతో పాటు స్వంత చిరునామాగల స్టాంపులు అతికించిన కవరు వుంచడం అవసరం. రచనపై అంగీకారం కాని, అనంగీకారంకాని ఆయా రచయితలకు తెలుపటానికి కనీసం ఆరు వారాలు పట్టవచ్చును. అది కూడా పోస్టు ద్వారా తెలియజేయడమే సాధ్యం.

★ రచనలతోగాక, విడిగా స్టాంపులు పంపడం, స్వయంగా వచ్చి రచనలు, కార్టూన్‌లు యివ్వమని కోరడం చాలామంది చేస్తూంటారు. ఇది చాలా యిబ్బంది కలిగించుతుంటుంది కనుక - తమ రచనతో లేదా బొమ్మలతో స్వంత చిరునామా, హామీ పత్రం మున్నగునవి, జత చేసి యివ్వడం లేక పంపడం చాలా అవసరం.

★ కార్టూన్‌లు పంపేవారు వారికి తిరస్కరింపబడిన కార్టూన్‌లు తిరిగి కావాలనుకుంటే స్వంత చిరునామాగల స్టాంపు లతికించిన కవరు జత చేసి తీరాలి.

★ గేయాలు పంపేవారు వాటితోపాటు స్వంత చిరునామాగల తపాలా కార్డు జత చేయాలి. గేయాలు త్రిప్పి పంపబడవు. —సం.

విముక్తి

పేరుకి సంఘ సంస్కర్త అయినా మీకు పెళ్లి చెయ్యడు. చేస్తే నెలకు అయిదువందల రూపాయలు నష్టపోతాడు, పైగా జీతం భత్యంలేని పని మనిషి పోతుంది.'' అన్నాడు ఉద్వేగంతో.

పార్వతి కళ్ళల్లో నీరు తిరిగింది. ఆ సత్యం ఆమెకుకూడ తెలుసుకాని స్త్రీగా తెగించి ఏమీ చెయ్యలేకపోయింది. మౌనంగా వుండిపోయింది.

''మీకు ధైర్యం చాలకపోతే పెళ్లి అయ్యాక వేరే ఊరు వెళ్లిపోదాం. భవిష్యత్తుకేమీ భయంలేదు. అది నా హామీ. ఏమంటారు.''

''ఏమో అర్థంకావటంలేదు. ఇటువంటివన్నీ కథల్లో బాగుంటాయి. నిజ జీవితంలో జరుగవు. మరి మీవాళ్ళ సంగతి.''

''ఈ క్షణంలో నాకు యెవరు లేరు. నేను ఏకాకిని. ఆ బెంగ మీకు అక్కర్లేదు. ఈ పెళ్లి వలన మీకు విముక్తి నాకు విముక్తి.''

''సరే అన్నయ్యను అడగండి'' అంది పార్వతి.

రాజారావు ఆమెవంక దీనంగా చూసి ''మీదగ్గర అంత విచక్షణాజ్ఞానం లేదనుకోలేదు. మీరు ఇంకా మీ అన్నయ్యమీద నమ్మకం వుంచుకున్నారా. అంతకంటే కసాయివాడ్ని నమ్మటం మంచిది. చేతులార పెన్నిధి ఎవరు పోగొట్టుకోరు. మీ అన్నయ్య కుసంస్కారుడు.''

''మరి ఏం చెయ్యమంటారు'' అంది అయోమయంగా.

''అయితే నేను చెప్పినట్టు చెయ్యండి. శుక్రవారం సరిగ్గా పదిగంటలకు మీరు అవధానిగారింటికి వచ్చెయ్యండి. అక్కడ్నుంచి రిజిస్ట్రారు ఆఫీసుకి వెళ్ళి పెళ్లి చేసుకుందాం.''

పార్వతి కండ్లల్లో జ్యోతులు వెలిగాయి.

''మీరు మీవాళ్ళకోసం జీవితం అర్పించారు అని విన్నాను కాని మీరు యింత విశాలహృదయులు అనుకోలేదు. మీరు యీవిధంగా తటస్థపడటం నేను చేసిన పూజాఫలం'' అని నమస్కరించి బయటకు నడిచింది పార్వతి.

అవధానిగారు అంతా విని ''చల్లటి వార్త చెప్పావోయ్ ! నువ్వు మకాం ఇక్కడికి మార్చెయ్యి' అన్నారు.

రాజారావుకి ఆ క్షణంలో అవధానిగారి అండ చూసుకొని వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టు అయింది.

శుక్రవారం సరిగ్గా పదిగంటలకు పార్వతి అవధానిగారి తలుపు తట్టింది. రాజారావు వెళ్లి ఆమెను ఆహ్వానించాడు. పార్వతి బుగ్గలు కెంపులయ్యాయి. రాజారావు తలుపులువేసి పార్వతి రెండు చేతులు తన చేతిలోకి తీసుకుని 'రారేమోనని కంగారుపడ్డాను'' అన్నాడు.

'అదృష్టం తలుపు తట్టినప్పుడు నిరాకరించేంత మూర్ఖురాల్నికాను'' అంది.

రాజారావు లోపలికి వెళ్ళి ఒక పేకెట్‌తెచ్చి ఆమె చేతిలో పెట్టి ' పెళ్ళి చీర, త్వరగా తయారవ్వాలి మరి'' అని నవ్వాడు.

పార్వతి ముఖంలో సిగ్గు అలంకరించింది. పేకెట్ పుచ్చుకుని లోపలికి పారిపోయింది. అయిదు నిముషాలతర్వాత పార్వతి గులాబి రంగుచీర,మాచింగ్ బ్లౌజ్ వేసుకుని అప్సరసలా వచ్చింది.

రాజారావు కళ్ళల్లో జ్యోతులు వెలిగాయి. ''అద్భుతంగా వున్నారు. కాని లోటు వొక్కటే'' అని లోపలికి వెళ్ళి కుంకుమ డబ్బా తెచ్చి ''యీ సింధూరం మన జీవితాలనే మార్చేస్తుంది.'' అని ఆమె నుదుటున బొట్టు పెట్టాడు.

పార్వతి వంగి రాజారావు కాళ్ళకు నమస్కరించింది. రాజారావు ఆమెను లేవదీశాడు. యిద్దరి కళ్ళల్లో వుద్వేగంతో ఆనందాశ్రువులు రాలాయి. ఆ మధురక్షణం అలాగే నిలిచిపోవాలని యిద్దరు మనస్సులో ప్రార్థించుకుంటున్నారు.

అంతలో బయట కారు హారన్ వినిపించింది.

''అవధానిగారు టాక్సీ తెచ్చారు'' అని రాజారావు వెళ్ళి తలుపు తెరిచాడు. నిలువెత్తు పూల దండలు పట్టుకుని గుమ్మంలో నుంచున్న అవధానిగారు యిద్దర్నిచూసి తృప్తిగా నవ్వారు.

ఆ ఇద్దరు ఆయనకు పాదాభివందనం చేసారు.

కోవచ్చునని వాళ్ళే అన్నారు. వాళ్ళకయితే పది హేను వరకూ మనసుంది. కానీ చివరకు పన్నెండుకు దిగారు. అంతకు మించి తగ్గ లేరేమో కూడా'' అన్నాడు.

చలపతిరావు తలపంకించి, క్షణం ఆలో చించాడు. తరువాత భార్యవైపొకసారి చూసి ''రేపుగానీ ఎల్లుండిగాని ఏ విషయం మీకు కబురుచేస్తాము'' అన్నాడు!

''శుభం'' అని లేచి ''ఓ నాలుగైదు వేల దగ్గర ఆలోచించకండి. అమ్మాయి సుఖ పడుతుంది. ఆడపిల్ల పెళ్ళంటే ఆడవిలో పడిపోవడమే! వాళ్ళసంగతి మనమూ ఆలో చించాలి గదా! అంతంత కట్నాలిస్తామన్నా సంబంధాలు కాదని ఇంత తక్కువకు అంగీక రిస్తున్నారంటే అది మన అదృష్టం. అమ్మాయి సౌభాగ్యం అనుకోవాలి. అబ్బాయి యిప్పటికే ఏడువందల వరకూ సంపాదిస్తు న్నాడు. రేపో ప్రమోషన్ కూడా వస్తే... వెయ్యిపైనే జీతం. అదంతా మన అమ్మా యిదే కదా! ఒక విధంగా ఈ కట్నం చాలా తక్కువనే చెప్పాలి. ఈ రోజుల్లో స్కూలు ఫైనలు తప్పినవాడికి అయిదువేలు, పాసైన వాడికి పదివేలు పోస్తున్నారు'' అన్నాడో మధ్య వర్తి నవ్వుచెప్పే ధోరణిలో!

''నా సంగతి మీకు మాత్రం తెలీని దేముంది? ఏదో కొంపంటూ నెత్తిమీద ఉంది గనుక దీనికింద నిశ్చింతగా బ్రతుకు తున్నాం. ఆడపిల్ల ఉన్న తరువాత పెళ్ళి చేయకా తప్పదు. కట్నాలు కానుకలు ఇవ్వనూ తప్పదు. ఏదో వకటి చేస్తాము లెండి. ఏ విషయం వీలైనంత త్వరలోనే కబురంపు తాము'' అన్నాడు చలపతిరావు!

''సరే వస్తానుమరి'' అని శలవు తీసు కొని వెళ్ళిపోయాడతను.

అతను వెళ్ళిన తరువాత చాలా తర్జన భర్జనలు జరిగాయి, కట్నం పన్నెండు వేలయితే... లాంఛనాలు, సార్లె, పెళ్ళిఖర్చులు అంతా కలిపి!మరో ఎనిమిది మొత్తంఇరవై!

''మంచి సంబంధం. ఇంత చవకలో ఇటువంటిది మళ్ళీ దొరకడం కష్టం. తప్పేముంది? ఇల్లు తాకట్టు పెడితేసరి'' అన్నాడు చలపతిరావు.

''ఔను. అలా చేద్దాం...'' అంది కామా క్షమ్మ, మద్దతుగా!

కానీ రామం చప్పరించేశాడు ... ''ఈ యిల్లు అసలే పాతది. దీనిమీద ఇరవైవేలు

తమసో మా జ్యోతిర్గమయ

(11వ పేజీ తరువాయి)

అప్పివడిసాడు. అమ్మితే ఓ పాతికో, ముప్పైయ్యో రావచ్చు...'' అన్నాడు.

''ఇల్లు అమ్మడమా?'' అంది కామా క్షమ్మ... విస్మయంగా!

''అల్లుడిని కొనాలంటే ఇల్లు అమ్మాలి. అల్లుడో, ఇల్లో... ఏదో వకటి తేల్చుకో...'' అన్నాడు మురళి!

''అది కాదే ... ఇంకా నాకు బోలెడంత సర్వీసుంది. ఈలోగా రామానికి, మురళికి ఉద్యోగాలు రాకపోవు. ఏదో అద్దెకొంపలో ఉండొచ్చు. ఏదో వంశపారం పర్యంగా వచ్చింది గనుక... ఇల్లొకటుందని అనుకోవ డమేగాని... ఈ లోకంలో అందరూ స్వంత ఇళ్ళలోనే బ్రతుకుతున్నారా?'' అన్నాడు చలపతిరావు.

''మీ యిష్టం. నాకుమాత్రం ఏం తెలు స్తోంది? దాని పెళ్ళయి అది సుఖపడితే ... అదే చాలు...'' అంది కామాక్షమ్మ!

ఇల్లమ్మితే ఎంత రావచ్చో... లెక్కలు వేయసాగారు. అందరూ చేరి. అంతవరకూ మౌనంగా అంతా వింటున్న సుజాత...

''నాన్నా...'' అంటూ పిల్చింది!

చలపతిరావు కూతురివైపు చూసి ... ''ఏమమ్మా...'' అన్నాడు.

''రేపు రామం అన్నయ్యగాని, చిన్నన్నయ్య గాని... వాళ్ళ కూతుళ్ళకు పెళ్ళిళ్ళు చేయా లంటే... ఎవరి యిళ్ళు అమ్ముతారు?'' అని అడిగింది. తండ్రివైపు సూటిగా చూస్తూ!

చలపతిరావు, అతనితోపాటు మిగిలినవాళ్ళు కూడా తెల్లబోయి చూశారు ఆమె వైపు.

''మనకున్న సర్వస్వం. ఈ యిల్లొక్కటే. దాన్ని నా ఒక్కర్తి పెళ్ళికోసం అమ్మేసి! మీరంతా ఎక్కడుంటారు?'' అంది,సుజాత. అందరివైపు కలియ చూసి!

''మరోయింటిలో! లేదా.. కొన్నవాడు యిష్టపడితే, ఇదేయింటిలో అద్దెకుంటాం. సరేనా! నువ్వేం కంగారుపడకు...'' అన్నాడు, రామం.


సుజాత అతని మాటలు పట్టించుకో కుండా. తండ్రితో అంది. ''పెళ్ళికోసమేగా యిల్లు అమ్మాలను కుంటున్నారు. అసలు పెళ్ళే జరగకపోతే?''

''ఎందుకు జరగదు?'' చలపతిరావు ఆశ్చర్యంగా అన్నాడు.

''నాకు యిష్టంలేదు కనుక...''సుజాత స్థిరంగా అంది.

ఈ సారికూడా తెల్లబోవడం.. మిగిలినవారి వంతే అయింది. అందరికంటే ముందు తేరు కున్నది, కామాక్షమ్మ!

''ఎందుకే. ఎందుకని యిష్టంలేదునీకు? అబ్బాయికేం తక్కువని?''అంది, కూతురివి



మింగేసేలా చూస్తూ!

"ఎవరికేదో తక్కువైనా, ఎక్కువైనా. మనకేమమ్మా. నాకు యిష్టం లేదన్నాను అంతే!"

'అదే. ఎందుకు యిష్టం లేదని అడుగుతున్నాను..."

"ఇష్టంలేదని చెప్తున్నానుగా. ప్రతి దానికి కారణాలుండవు..." సుజాత చిరాగ్గా అంది.

తమసోమా జ్యోతిర్గమయ

"కారణం నేను చెప్తాను..." మురళి అన్నాడు "ఈ పెళ్ళిమూలంగా మనం ఈ యిల్లు అమ్మేసి బజారున పడిపోతామని దాని భయం. ఈపాటి ఆదర్శాలు మనకూ తెలుసు 'కట్నాలు తీసుకోరాదు' అంటూ వేదికలెక్కి ఉపన్యాసాలిచ్చే పెద్దమనుషులే చాటుగా కట్నాలు యిస్తున్నారు, పుచ్చుకుంటున్నారు."

"ఔనమ్మా! ఆదర్శం అంటూ ఉండడం మంచిదే. కాదనను. కానీ. ఆదర్శం మనిషిని సంఘంలో వంటరివాడిని చేస్తుంది. సంఘం, సమాజం. అంటే, అదొక సజీవ ప్రవాహం దానికి మంచి, చెడు అన్నదిలేదు తనకు అడ్డు పడిన దేన్నయినా నిర్దాక్షిణ్యంగా ముంచేస్తుంది. అందుకే. ఎన్ని శాసనాలు చేసినా, అవన్నీ కేవలం అనుకోవడానికే మిగిలిపోయాయి. మార్పంటూవస్తే.. అది ఒక్కసారిగా, ఉప్పెనలా రావాలి. ఏ ఒక్కరిలోనో వచ్చినంతలో ప్రయోజనం లేదు..." అన్నాడు, చలపతిరావు!

"మీరెన్ని చెప్పండి. నాకిప్పట్లో అసలు పెళ్ళిచేసుకోవాలని లేదు" సుజాత మొండిగా అంది.


"నా మాట వినమ్మా" చలపతిరావు అనునయంగా అన్నాడు. "నువ్వు చిన్నపిల్లవు. నీకు కొన్ని విషయాలు అర్థంకావు: నేటి ఉడుకు. దుడుకే రేపటి జీవితంలో వడిదుడుకులను సృష్టిస్తాయి. నువ్వనుకున్నంత సులభం కాదు, ఆశయాలను నమ్ముకొని బ్రతకడం."

"వెనుకటి కెవరో వెర్రి కుదిరిందంటే రోకలి తలకి చుట్టమన్నాడట. బాగానే ఉంది వరస. అది పెళ్ళి వద్దనడం, మీరేమో నచ్చ చెప్పడం! ఏ వయసులో ఆ ముచ్చట జరగాలి. కాలిదగ్గరకు వచ్చిన సంబంధాన్ని కాలదన్నుకుంటే తరువాత అసలు పెళ్ళే కాదు" అంది కామాక్షమ్మ కోపంగా.

"పెళ్ళి కాకపోతే కలకాలం కన్యగానే ఉండిపోతాను" సుజాత రోషంగా అంది. "అంతే గాని ఆచారాలపేరిట ఆత్మవంచన చేసుకోలేను. ఆడపిల్లను కనడమే అష్టమ దరిద్రమనుకొని, ఆ దరిద్రాన్ని వదిలించుకోవడానికి ఏమైనా చేయడానికి సిద్ధం! ఛీ...ఛీ...ఏం బ్రతుకులు మనవి! తినడానికి తిండి కొనుక్కోవాలి. కట్టుకొనడానికి బట్ట కొనాలి. కాపరం కోసం మొగుణ్ణి కొనుక్కోవాలి. ఇదేనా జీవితం? ఇదేనా జీవితానికున్న పరమార్థం? మీరెన్ని చెప్పండి నాకు యిష్టం లేదు. కాదు, కూడదని బలవంతం చేశారో తరువాత ఏం జరిగినా, దానికి బాధ్యతమీదే"

అనుకోని బెదిరింపుకు అందరూ అవాక్కయారు. చిలికి చిలికి పరిస్థితి తీవ్ర రూపం దాల్చడంతో చలపతిరావుకు మతిపోయినట్లయింది. (ఇంకా వుంది)

జారిపోయిన పెన్నిధి



శ్రీమతి మంత్రవాది ఇందిర

గట్టిగా వేసిన జడ. జడచివర పిల్లకు ప్పెలు. జడలో ముద్ద బంతిపువ్వు చెవులకు జూకాలు కాళ్ళకు గజ్జెల పట్టీలు. లేతనీలంరంగు వెంకటగిరి జరీచీర అదేరంగు జాకెట్టు పచ్చగా. కొంచెం బొద్దుగా తగినంత పొడవుతో పెద్ద పెద్ద కళ్ళతో చకచక తిరుగుతున్న ఆ అమ్మాయిలో నూటికి నూరుపాళ్ళూ తెలుగు దనం పుట్టి పడుతుంది.

'ఎవరే యీ సుబ్బలక్ష్మి?' అప్పుడే నిద్ర లేచిన సూర్యం పక్కింటో అమ్మాయిని పరీక్షగా చూస్తూ అడిగాడు చెల్లెలు సరోజను. సూర్యం వాళ్ళు ఆ యింటోకి అద్దెకుదిగి నాలుగు రోజులు అయింది సూర్యం రైల్వేలో ఉద్యోగం చేస్తున్నాడు

'ఏమో నాకేం తెలుసు సుబ్బలక్ష్మో, వెంకటలక్ష్మో.. చూస్తుంటే అలాగే వుంది' మూతి తిప్పుతూ అంది సరోజ మాటకు ముందు మూతి తిప్పటం సరోజకు బాగా అలవాటు. ఇంటరు మొదటి ఏడు మూడు సార్లు ప్రయత్నించినా దాటలేక "ఇక నేను చదవను బాబూ' అంటూ మొండికేసి ఇంటో కూర్చుంది సరోజ అతిగా పావుచేసే సరోజకు తన అందంమీద ఎంతో నమ్మకం ఒదిగిన ఆకాస్త చదువును ఎక్కువగా భావించుకుని తనంతవారు లేరన్నట్లు ప్రవర్తిస్తుంది. పక్కయింట్లో అమ్మాయిని చూడగానే అనుకుంది సరోజ 'అమ్మమ్మలాగవుంది ఈమెతో తనకు స్నేహమేమిటి' అని ఇలా అనుకున్న తర్వాత మరింక ఆమెతోమాట్లాడే ప్రయత్నం చేయలేదు.

సూర్యం నవ్వుకుంటూ బాత్ రూముకేసి నడిచాడు.

మరునాడు సాయంత్రం ఇంటికి వచ్చిన సూర్యానికి చిన్న కబురు ఒకటి చెవిలో వేసింది సరోజ.

"అన్నయ్యా! పప్పులో కాలువేశావు. ఆవిడ పేరు సుబ్బలక్ష్మికాదు. జయశ్రీట" మూతి తిప్పుతూ చెప్పింది

'ప్చ్! మనవాళ్ళకు మనిషికి తగిన పేరు పెట్టటము తెలియదు. సుబ్బలక్ష్మి అయితే చక్కగా సరిపోయేది" నిట్టూర్పు విడిచాడు సూర్యం.

ఆరోజు ఆదివారం. సూర్యం గదిలో కూర్చుని ఏదో రాసుకుంటున్నాడు. పెరటి గోడదగ్గర తల్లి పక్కయింటి ఆమెతో

మాట్లాడటము విని వినిపించి అనుకోకుండా ఒక చెవి అటు పడేశాడు.

పక్కయింటి ఆమె అంటూంది

'నా జయశ్రీని చూశారుగా వదినగారూ. అదిమా మాటకు అడ్డు చెప్పదు. మంచిరోజు చూసుకుని మా యింటికొకసారి వచ్చి అమ్మాయిని చూడండి. పెళ్ళిచూపులంటూ వున్నాయిగా. పిల్లా, పిల్లవాడు ఇష్టపడితే మనదేముంది. చేతనయినంతలో ఏలోటు వెయ్యము కలిగింది పెడతాము ఏమంటారు?'

"అభ్యంతరాల కేమిటికాని, మావాడు రైల్వేలో వుద్యోగం చేస్తున్నాడు. చదువుకున్న పిల్లకావాలని ముచ్చట పడుతున్నాడు. వాడి ముద్దు ముచ్చటలు కూడా మేము చూడాలికదా మాఇద్దరి అమ్మాయిల పెళ్ళిళ్ళు అంటే ఎలాగో చేశాముకాని సరోజ పెళ్ళి వాడికి వచ్చిన కట్నంతోనే చేయాలి కాబట్టి పిల్లనాకు అన్నివిధాల నచ్చాలి కట్నకానుకలు బాగా ఇవ్వగలగాలి. అయినా మీరు చెప్పారు కాబట్టి యీ ముక్క ఆయన చెవినవేసాను'

"మరి మీ అమ్మాయి ఏమన్నా చదువుకున్నదా?" నిర్మొహమాటంగా అడిగింది ఆవిడ

ఆవిడ తీరు, ధోరణి చూసి తారెత్తిపోయింది. పిల్ల తల్లి సీతమ్మగారు చిన్నబోయిన ముఖంతో ఆమె ఏదో అనబోయింది.

'అమ్మా! నాన్న పిలుస్తున్నారు' లోపల నుండి కోపంగా కేకపెట్టింది జయశ్రీ.

'మామాటకు అడ్డు చెప్పదు' అన్నఆమె మాట గుర్తువచ్చి నవ్వుకున్నాడు సూర్యం. రైల్వేలో వుద్యోగం చేస్తున్నవాడు మొగుడవుతాడు అంటే అడ్డుచెప్పేందుకేముంటుంది.

అందులో సుబ్బలక్ష్మి వంటి వాళ్ళకు... సూర్యాని కెందుకో ఆమెను 'జయశ్రీ'గా అనుకోవాలంటే నామోషి. 'పేరులోవున్న అందంకూడా వేడుతుంది' సుబ్బలక్ష్మి అయితేనే అతికినట్లు సరిపోతుంది' అనుకుని మళ్ళీ కాగితాలలో తల దూర్చాడు.

'ఏమిటమ్మా నువ్వు మరీను. నాన్నగారు వాళ్లకు మాట ఇచ్చానంటే కాదనలేక 'సరే' అన్నాను... కాని, ఆవిడ అంత దూకుడుగా మాట్లాడుతుంటే పట్టించుకోకుండా నువ్వు ఏమిటో చెప్పబోతావు దేనికి? అయినా మీరు నా పెళ్ళిని గురించి ఎవరినీ దేవిరించనక్కర లేదు' ఇంట్లోకి వచ్చిన తల్లితో విసురుగా అంది జయశ్రీ.

సీతమ్మగారు కూతురివంక తెల్లబోయి చూసింది.

జయశ్రీ అంత కోపంగా మాట్లాడటానికి తగిన కారణముంది. పక్కయింటి వారి వ్యవహారం మొదటి నుండి ఆమెగమనిస్తూనే వుంది. ముఖ్యంగా ఆ అన్నా చెల్లెలి సంగతి ఏమి బాగుండలేదు. వాళ్ళు తనని చూసి ఎగతాళిగా మాట్లాడుకోవటము... నవ్వుకోవటము ఆమె చూస్తూనే వుంది.

'అమ్మా జయా! నా కళ్లజోడు ఎక్కడ పెట్టావమ్మా' తండ్రి అడగటము విని లేచి వెళ్ళింది జయశ్రీ.

సూర్యం తండ్రి కేశవరావుగారు కోపంగా చిందులు వేస్తున్నారు

సూర్యం తండ్రి ఎదుట తలవంచుకుని నిలబడ్డాడు.

'ఆ అమ్మాయి కేమి తక్కువరా. బంగారు బొమ్మలాగ వుంటుంది. పైగా చక్కగా"... ఆయనను వాక్యం పూర్తి చెయ్యనివ్వలేదు.

'నాకిష్టంలేదు నాన్నా' సూర్యం మధ్యలోనే అందుకున్నాడు.

కేశవరావుగారు కొడుకువంక వురిమి చూశారు.

'వాడికిష్టంలేదని చెబుతున్నాడు గదా. దానికి ఇంత హంగామా ఎందుకు. ఇది కాకపోతే ఇంకొకటి. అన్ని విధాల వాడికి నచ్చిన రాజాలాంటి సంబంధం వస్తుంది' సుందరమ్మగారు కొడుకుని వెనకవేసుకు వచ్చింది.

'సరే మీ ఇష్టం వచ్చినట్లు అఘోరించండి. ఆ పెద్దమనిషికి మాటఇచ్చాను. మాట తప్పితే బాగుండదు. రేపు వాళ్ళ ఇంటికి పెళ్ళి చూపులకు వెళ్ళి తీరాలి. తర్వాత ఏమన్నా నిర్ధారించండి' కండువా దులిపి భుజంమీద వేసుకుని బయటకు నడిచారు కేశవరావుగారు.

పెళ్ళిచూపులు అంతా మామూలుగా ముగిసింది పెద్దవాళ్ళు ఇద్దరూ మాటల్లో పడ్డారు సూర్యం ముఖం ముడుచుకుని కూర్చున్నాడు కాఫీ ఫలహారాలుకూడా అయినవి. వాకిటిలో ఎవరో పిలవటము వలన కేశవరావుగారు లేచి 'ఇపుడే వస్తా' నంటూ వెళ్ళారు.

"అమ్మాయి ఏం చదువుకున్నది?" వున్నట్టుండి సూర్యం తల్లి సుందరమ్మగారు ప్రశ్నించింది. సీతమ్మగారు మాట్లాడలేదు.

జయశ్రీ తండ్రివైపు కళ్ళు పెద్దవి చేసి చూసింది


"అబ్బే... ఏదో..." నసిగారు రామారావుగారు.

సుందరమ్మగారి ముఖంలో రంగులు మారటము జయశ్రీ స్పష్టంగా గమనించింది.

సరోజకూడా వూరుకోలేదు. అడ్డదిడ్డమైన ప్రశ్నలు ఏవో వేసి తన ఆధిక్యతను కూడా నిలుపుకుంది.

నాలుగు రోజుల తర్వాత విషయం. కేశవరావుగారు బయటకు బయలుదేరుతుంటే





జారిపోయిన పెన్నిధి

పక్కింటి వసారాలోవున్న రామారావుగారు చూసి గేటుదగ్గరకు వచ్చారు.

'ఏమి అనుకోకండి కేశవరావుగారు. మా జయశ్రీకి ఏమంత సుముఖంగా లేదు. అమ్మాయిని కాదని నేను ఏమి చెయ్యలేను.' చెప్పలేక చెప్పారు.

'అమ్మయ్య! బ్రతికించారు. నేనూ అదే చెబుదామనుకుంటున్నాను. మావాడు సరే మిరా వద్దంటున్నాడు. అంత వద్దంటుంటే బలవంతంగా మనముకట్టి పడవేయలేము కదా. ఏమిటో... అంతా భగవన్నిర్ణయం... పోనీయండి సాయంత్రం చదరంగం ఆడు కుందుకు వస్తానండోయ్' అంటూ సాగి పోయారు కేశవరావుగారు.

రామారావుగారు నవ్వుకుంటూ కదిలారు.

తర్వాత చెప్పుకోతగిన విశేషాలు ఏమి లేకుండానే మూడు నెలలు గడచిపోయాయి.

పక్కయింట్లో సందడి తగ్గినది. అసలు మనుష్యులున్న జాడ కనిపించటములేదు.

'మన పక్కింటి సుబ్బులు ... అదే సుబ్బ లక్ష్మి కనిపించుటములేదు ఏమిటే సంగతి' చెల్లెల్ని అడిగాడు ఒకరోజు సూర్యం.

'కుట్లు, అల్లికలూ నేర్చుకుందుకు ఎక్కడకయినా వెళ్ళిందేమో' వ్యంగ్యంగా అంది సరోజ.

''అదేమికాదురా. వాళ్ళందరూ గుంటూరు వెళ్ళారు. అక్కడే ఆ అమ్మాయికి పెళ్ళి నిశ్చయంకూడా చేసుకున్నారుట. పెళ్ళి వాళ్ళ తాతగారి ఇంట్లోనే చేస్తారుట. మీ నాన్న గారి పేరుతో నిన్ననే శుభలేఖ కూడా వచ్చింది ఇక్కడే ఎక్కడో పెట్టాను. వుండు చూస్తాను'' ఆవిడ వెదకి తీసుకుని వచ్చి ఇచ్చింది. ఆవిడ ముఖంలో సూర్యానికి పెళ్ళి కలిసి రాలేదన్న బాధ తొంగి చూస్తోంది.

సూర్యం, సరోజ ముఖాలు చూసు కున్నారు

'పోస్ట్' పోస్టుమాను కేకపెట్టి వుత్తరాలు పడవేసి వెళ్ళాడు. సూర్యం తీసుకుని చూశాడు. ఒకటి సూర్యం మేనత్త రాసినది. ఇంకొకటి సూర్యం స్నేహితుడు శ్రీధర్ రాశాడు 'తనకు పెళ్ళి నిశ్చయమైనదనీ ... శుభలేక పంపుతున్నాను పెళ్ళికి తప్పక రమ్మనీ' సూర్యానికి రాశాడు. శుభలేఖ చూశాడు సూర్యం. పెళ్ళికూతురు పేరు జయశ్రీ. అనుమానం వచ్చి తల్లి ఇచ్చిన శుభలేఖ చూశాడు. పెళ్ళికొడుకు పేరు శ్రీధర్. మిగిలిన వివరాలు కూడా సరిపోయాయి.

నవ్వుకున్నాడు సూర్యం. శ్రీధర్ తనకు కాలేజిలో క్లాస్‌మేటు. తను కాలేజితో చదువుకు గుడ్‌బై కొట్టి వున్న ఒక్క డిగ్రీతో తంటాలు పడి ఎలాగో రైల్వేలో వుద్యోగం సంపాదించాడు. శ్రీధర్ ఇంకో డిగ్రీ కూడా తెచ్చుకుని కాలేజీలో లెక్చరరుగా చేస్తున్నాడు. పార్టుటైము రిసెర్చి చేస్తున్నాడని కూడా ఆ మధ్య ఎవరో అంటే విన్నాడు. అటు వంటి వాడు సుబ్బలక్ష్మిని చేసుకుంటున్నాడా అంటే... ఇంతకీ సుబ్బలక్ష్మి అదృష్టవంతు రాలు... పూర్‌ఫెలో శ్రీధర్' విటూ ర్చు గడిచాడు.

శ్రీధర్ తనకు ప్రాణస్నేహితుడేమీ కాదు తమ ఇద్దరిమధ్య వున్నది అంతంత మాత్రపు స్నేహమే. పెళ్ళికి తప్పనిసరిగా వెళ్ళాలని ఏమిలేదు. అదీగాక ఇది సుబ్బలక్ష్మి పెళ్ళి ... సూర్యానికెందుకో వెళ్ళాలని అనిపించ లేదు. శుభాకాంక్షలు మాత్రం పంపాడు.

తర్వాత ఏడెనిమిది నెలలు ఇట్టే గడచి పోయాయి.

గుంటూరు స్టేట్‌బ్యాంకులో పనిపడి వెళ్ళాడు సూర్యం. 'ఆఫీసరు' అన్న చిన్న బోర్డు గాపి నెమ్మదిగా స్ప్రింగుడోరు తీసు కుని లోపలకు వెళ్ళాడు. అక్కడ సీటులో కూర్చుని తల వంచుకుని చకచక వ్రాసు కుంటున్న ఆమెను 'మేడమ్' అని మర్యాదగా సంబోధించాడు సూర్యం.

'యస్' అంటూ తలెత్తిన ఆమె సూర్యాన్ని చూసి ఆశ్చర్యపోలేదు. పైగా చిన్నగా నవ్వి రాసుకుంటూనే కూర్చో మన్నట్లు చేతితో సైగ చేసింది ఆమె.

సూర్యం కూర్చోలేదు పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు. తల గిర్రున తిరుగు తూంది. ప్రపంచంలో ఎనిమిదో వింత చూస్తున్నట్టు వుంది అతనికి ఇది ఎలా సంభవం... ఎక్కడి సుబ్బలక్ష్మి... ఎక్కడి ఈమె. బంగారు బొమ్మలాగ.. కాదు కాదు.. బంగారు తీగలాగ వున్నది ఈమె. ఇది కలా... నిజమా... వచ్చిన పని మర్చిపోయి పిచ్చిపట్టినట్లు చూస్తున్నాడు సూర్యం.

వ్రాయటము ముగించి కాగితాలు ఎక్కడవ పెడుతు నిదానంగా అన్నది ఆమె.

'చూడండి సూర్యగారూ. మీరంత ఆశ్చర్యపోవలసిన పనిలేదు. నేను జయశ్రీని. మీరు అనుకున్నట్లు సుబ్బలక్ష్మిని మాత్రం కాను. ఒకవేళ నిజంగా సుబ్బలక్ష్మినైనా మీరు వూహించుకున్నంత హీనంగా వుండను. ఆల్‌రైట్. ఇపుడు చెప్పండి. మీరు వచ్చిన పని ఏమిటి?' గంభీరంగ, హుందాగా ప్రశ్నిస్తున్న ఆమెను నిశ్చేష్టుడై చూస్తుండి పోయాడు సూర్యం.

హెలికాప్టర్ రాసక్రీడ!

మిడ్నపూరుకు చెందిన కల్లైకుండ అనే ఊరిలో కొంతమంది హెలికాప్టరు నడపడం, సినిమాకు పనికొచ్చేలా కొన్ని ఫీట్లు చెయ్యడం గగన మార్గంలో నేర్చుకుంటుండగా ఆ హెలికాప్టరు ఓ కంగ్సాబతి అనే నదిమీదికి వచ్చిందట. క్రిందికి చూసిన కుర్రాళ్ళు ఆనందంతో గావుకేకలు వేశారట. క్రింద నదిలో కళ్ళు చెదిరిపోయేలా ఓ పుంజీడు ఆడవారు స్నానాలు చేస్తున్నారట అలనాటి శ్రీకృష్ణునికి లేనివసతి, తమకున్న వసతికి ఆ హెలికాప్టరును నది బారుగా దింపి, ఓ ఇద్దరు శ్రీకృష్ణులు క్రిందికి ఒంగి పోయి యిద్దరు స్త్రీలను ఒకామెను చీరతో, మరొకామెను చేతో దొరక పుచ్చుకున్నారట. దురదృష్టవశాత్తు చెయిజారి యిద్దరమ్మాయిలు నదిలోనే పడిపోయారట. హత్తెరీ అని మరో సారి ప్రయత్నం చేయబూనుకునే లోగానే ఆ ఆడ వారి అరుపులకు ఊరిలోని మగవారు కర్రలుచ్చుకు పరుగు గొచ్చినరికే వారు హెలికాప్టరుకు బుద్ధి చెప్పారట.

ఇలా॰ ఆతిథ్యం!

మంగళదాయేకు చెందిన శుక్లగూరిగస్ అనే గ్రామంలో పుల్నీసా అనే ఆవిడ తన యింటికి వచ్చిన సాధుజీలకు సంతృప్తిగా మాంసపుకూరతో సహా వంటలు వండి వార్చిందట. సాధుగార్లు మాంసపు కూరను చూసి, ఏ మాంసమని అడుగుతే పావురపు మాంసమని ఆమె చెప్పిందట. వారికా మాంసం పావురానికి సంబంధించినట్లు లేకపోయేసరికి యింకా వుత్సుకత పుట్టి రెట్టించారట. ఈ వాలకం చూసిన యింటాయన ఎంగిలిచేత్తో గమ్మున లేచి వంటింట్లోకి వెళ్లి చూసి కొయ్యబారి పోయాడట. వంటింట్లో పీట, కత్తి, నెత్తురు, చంటి పిల్లాడి కాళ్లు చేతులు, మిగతా భాగాలూ వున్నాయిట. సాధువులను అసంతృప్తిపరచ రాదనిమాంసానికి డబ్బులేక ఆ మహాతల్లి తన ఆర్నెల్ల పిల్లాడిని చంపేసి, ఆ పిల్లాడి మాంసం వండిందట. ఇది ఏప్రియల్ పదమూడో తారీఖున జరిగిందట ఇవన్నీ వినగా కనగా ప్రేమ అనే పదం కేవలం హా వుద్రేక సంబంధమైనదేనేమో, (అదే రక్తమైనా) అనిపిస్తుంది.

* * *

అమెరికా ప్రెసిడెంటుకు సంవత్సరానికి 18 లక్షల రూపాయల జీతము, నాలుగున్నర లక్షలు ఎలవెన్సులటాట— బాప్రే!

త్రాగుబోతుని నిరాకరించే కారు!

ప్రపంచ ఖ్యాతి పొందిన జర్మన్ హోండా మోటారు కంపెనీ వారు యిప్పుడు ఓ కొత్త పద్ధతిలో కారు రూపొందించారట. బాగా తాగిన వ్యక్తి కారు నడుపడానికి ప్రయత్నిస్తే ఆ కారు స్టార్టవ్వదట. మొరాయిస్తుందట. స్టీరింగులో వారు ఒక రకం యంత్ర సామగ్రిని అమర్చారట.

ఫెళ్ళు డైరి

తత్పరిత్తంగా బాగా త్రాగిన వారిని వారి వారిఉఛ్వాస నిశ్వాసలను బట్టి కనిపెట్టి, ఆ యంత్రం కారు యింజను స్టార్టవ్వనివ్వదట— ఆహా! హేట్సాఫ్ టుది సైన్స్!!

'ఆఖతీజ్' మళ్లీ ఎన్నాళ్లకో !

రాజస్థాన్‌లో మే నెల 24 వ తేదీన పదివేల పెళ్ళిళ్ళు వేద ఘోషల మధ్య జరిగాయట. రాజస్థాన్‌లో జరిగిన యీ పెళ్ళిళ్లలో పెళ్లికూతుళ్లు పెళ్లికొడుకుల్లో చాలా మంది తమ తమ తల్లి తండ్రుల ఒళ్ళల్లో పడుకుని నిద్రపోయారు కారణం. . వారి వయస్సే అంత. అనగా ఆ పది వేల పెళ్లిళ్ల చిన్న పిల్లలకేనట. పసి పిల్లలకు జరిపిన ఆ వివాహాలు అఖతీజా అనే మంచి వివాహాలకు శుభదినం అయిన రోజవడమే కారణమట. మళ్ళీ అఖతీజ్ ఎన్నాళ్లకొస్తుందోనన్న ఆత్రమన్న మాట— నో కామెంట్స్!

పాట్నా విశ్వవిద్యాలయంలో పరాకాష్ఠ నందుకున్న ప్రేమలీలలు!

పాట్నా విశ్వవిద్యాలయంలోని విద్యార్థినీ విద్యార్థులు విద్యార్జన తప్ప తతిమ్మా వన్నీ ఎంచక్కా నేర్చుకుని మంచి ప్రజ్ఞ గణిస్తున్నారట. స్త్రీల హాస్టలు గేటు కాపలా వారి సహాయంతో విద్యార్థినులు ఎంచక్కా తమకు తోచిన వారితో తోచినంత సేపు అనువైన చోట జీవితాన్ననుభవించి ఏ అర్ధ రాత్రో అపరాత్రో గూటికి చేరుకుంటారట. వీరితో అధ్యాపకులు కూడా యీ సరససల్లాపాల్లో సమ వుజ్జీలట. పాట్నాలో చీకటి పడ్డాక జంటలు జంటలుగా విద్యార్థినీ, విద్యార్థులు— విద్యార్థినీ, అధ్యాపకులు హాయిగా సిగ్గువిడిచి, స్వేచ్ఛగా ఏ చెట్టుచాటునో, పొద చాటునో ఆనందాన్ని అనుభవిస్తారట — ఇఫ్ !! స్టాపిట్ మనవల్లవుతుందా ఏం!!


పాముకాటు – కాళికిబలి

సాంగ్లి అనే ఊరుకు చెందిన 65 ఏళ్ల రంగా తాతోబామాండాకే అనే ఆమె తమ్ముడు పాము కరిచి విలవిలా తన్నుకుంటుంటే ఆ ఊరిలో కొందరు ఫలానా గుడికి తీసుకు వెళ్ళి ఫలానా వారిచేత మంత్రాలు చదివిస్తే ఆతడు బతుకుతాడనిచెప్పారట. ఆమె ఆ విధంగా ఆ గుడికి తీసుకు వెళ్లి తత్ప్రకారం తతంగం జరిపిస్తుండగా పూరాబాయి అనే ఒకామె ఆ గుడిలోకి వచ్చి మంత్రాలకు చింతకాయలు రాల్తాయా అన్నదట. కాస్సేపట్లో పాము కాటు వేసిన ఆ వ్యక్తి చనిపోయాడట. తన తమ్ముని చావుకు పూరాబాయి మాటలు, ఆమె అపచార ప్రవర్తన కారణమని రంగాతాతోబామాండాకే సర్రున గుడిలోని కాళీ దేవి కత్తితీసి ఆ పూరాబాయి శిరస్సు నేల తెగి పడేలా ఒక్కవేటు దెబ్బ వేసిందట. పూరాబాయి తల కొబ్బరికాయలా ఎగిరవతల పడి, మొండెం విలవిల్లాడి చనిపోయిందట. ఈ కేసు విచారించి జడ్జిగారు మాండాకేకి యావజ్జీవ శిక్ష విధించారట.

పెళ్లి కొడుకు చొరవ !

రోధాన్ అనేచోట ఓమగ పెళ్ళి వారు ఊరేగింపుతో జామ్మని పెళ్ళికి తరలి వెళ్తుండగా ఫోడ బోడమని వాన భయంకరంగా కురవనారంభించిందట దాంతో ఎక్కడి వారక్కడ దొరికిన చోట తలదాచుకున్నారట. పెళ్లికొడుకు గుర్రాన్ని అదిలిస్తే అది మొరాయించిందట. ఆతను వెంటనే గుర్రం దిగి వానలో వడుచుకుంటూ పెళ్లి వారింటికి ఏకాకిగా వెళ్ళి పోయాడుట. ముహూర్తం ముంచుకొచ్చేస్తోందని భయపడుతున్న ఆడ పెళ్ళితో వారిని జూసి, నే గొచ్చేశానోచ్ అని నేరుగా పీటల మీద కూర్చుని పెళ్ళి చేసేసుకున్నాడట.

ప్రేమో.



రూపాయి ఎమ్.ఓ



సి.వి.సూర్యనారాయణమూర్తి

పసితనంలో చెరిగిపోని ముద్రవేయగల శక్తి కొందరు ఉపాధ్యాయులకి ఉంటుందన్న నా అభిప్రాయానికి మూలకారణం రాఘవయ్యగారు. ఎప్పుడో పదిహేను సంవత్సరాల క్రిందట ఆయనచెప్పిన పాఠాలు తలచుకుంటే ఈనాటికీ మధుర స్మృతిగానే ఉంటుంది. విద్యార్థులను అయస్కాంతంలా ఆకర్షించే శక్తి ఆయన వ్యక్తిత్వంలో ఒక భాగం మాత్రమే.

మా అనుబంధం ఈనాటికీ కొనసాగడానికి గల ఒక కారణం, ఆయనపట్ల నా ఆరాధనా భావం అయితే, మరొకటి ఆయన కొడుకు మూర్తి, అతనూ, నేనూ పదేళ్ళపాటు కలిసి చదివాం. ఉద్యోగరీత్యా అతను దూరం వెళ్ళాడు. మా ఊరి హైస్కూల్లో రిటైరయిన రాఘవయ్యగారు మాత్రం, ఊరినానుకొని ఉన్న చిన్న పల్లెటూళ్ళో ఇల్లు కట్టుకుని స్థిరపడ్డారు. పేరుకు అది వేరే ఊరుగాని, అన్నివిధాలుగానూ మా పట్నంలో చేరినట్లే. సిటీబస్సులు కూడా ఆ ఊరు మీదుగానే వెడతాయి.

నేను సాయంకాలాలు షికారుకు బయలుదేరితే వాళ్ళ ఇంటివైపే నా కాళ్ళు దారి తీస్తాయి. ఓసారి మేస్టారిని పలకరించి, అనుభవసారములైన ఆయన మాటలు విని, మూర్తిని గురించి విశేషాలడిగి తిరిగిరావడం తరుచూ నేను చేసేపని.

ఆరోజు మామూలుగా పిచ్చా, పాటీ మాట్లాడి బయలుదేరబోతుంటే పోస్టుబంట్రోతు వచ్చి మనియార్డరొచ్చిందని మేస్టారిని పిలిచాడు. ఆయన సంతకంచేసి, కూపను తీసుకుని చదివి, "ఏమేవ్! మూర్తి దగ్గర్నుంచి మనియార్డరొచ్చింది" అని ఆవిడను కేకేశారు. పోస్ట్‌మాన్ జేబులోంచి ఒక రూపాయి నోటు తీసి ఆయన చేతిలో పెట్టాడు, ఇంతలో ఆవిడ బయటకు వస్తూ రెండు కప్పులతో కాఫీ తీసుకొచ్చి ఒకటి నాకూ మరొకటి ఆ పోస్టు బంట్రోతుకూ ఇచ్చింది, "కాఫీ తీసుకో రామయ్యా" అంటూ.

మరో నిముషం ఉండి మనియార్డరు కూపను తీసుకుని లోపలికెళ్ళిపోయింది.

పోస్ట్‌మేన్ కాఫీ తాగడం పూర్తిచేసి ఆయన దగ్గర శలవు తీసుకుని బయలుదేరాడు ఇంకా ఏదో డబ్బు ఇస్తాడేమో అని అనుకుంటున్ననాకు ఆశ్చర్యమే కలిగింది. మూర్తి

తండ్రికి ఒక్క రూపాయి పంపించడమేమిటి అడుగుదామని నోటిదాకా వచ్చింది. కాని మళ్ళా ఏదో ఆలోచన వచ్చి విరమించుకున్నాను.

సరిగ్గా అటువంటి సంఘటనే మరోసారి మరోసారి జరగడంతో నాలో చాలా రకాల అనుమానాలు వచ్చాయి. మూర్తి నాకు బాగా తెలుసు. ప్రస్తుతం రాఘవయ్యగారి కుటుంబం అతని సంపాదన మీదనే ఆధారపడిఉంది. అతనూ బాగానే సంపాదిస్తున్నాడు మరి ఇలా ఒకటీ రెండూ రూపాయలు పంపించడంలో అర్థమేమిటి?

నా ఆలోచనలు రకరకాలుగా సాగాయి. చిన్నతనంలో తల్లితండ్రులు తనమీద చూపించే ప్రేమను అనుభవిస్తూ చాలామంది పిల్లలు అనుకుంటారు— పెరిగి పెద్దయిన తరువాత వాళ్ళకు వీలైనంత సేవచేసి ఆనందం కలిగించాలని. అంతేకాదు, తనతోబాటు కష్టసుఖాలలో పాలు పంచుకున్న చెల్లాయిలనీ, తమ్ముళ్ళనీ, వాళ్ల కోర్కెలు తీర్చడం ద్వారా సంతోషపెట్టాలని మనస్ఫూర్తిగా నిర్ణయించుకుంటారు.

అయితే పెళ్ళిఅయి తనకంటూ ఒక కొత్త జీవితం ఏర్పడినాక, స్వార్థపు నీడలు మనసుని ఆవరించి, వాళ్ల ఆలోచనల స్వభావాన్నే మార్చేస్తాయేమో!

నా అనుభవంలో ఎంత గొప్పవాళ్లయినా తల్లితండ్రులను దైవాలుగా చూసే కొడుకులనూ చూశాను, సంపాదన మొదలుపెట్టినదే తడవుగా వారిని మరచిపోయిన దౌర్భాగ్యులనూ చూశాను. ఎన్నోరకాల మనుష్యులయినా యీ లోకంలో ఉండే అవకాశం ఉంది. అయితే, నాకు తెలిసిన మూర్తి వేరు. 'మంచివాడు' అన్న పదానికి ఉదాహరణలు ఇమ్మంటే నాకు తెలిసిన జాబితాలో మొదటి పేరు అతనిదే. అటువంటివాడు కూడా ఈ డబ్బు నిర్మించే స్వార్థపు వలలో చిక్కుకుని తల్లితండ్రులను అలక్ష్యం చేస్తున్నాడా? ఈ ఆలోచన నిజమైతే, మనుషులపట్ల నా విశ్వాసాలు చాల దెబ్బతింటాయి. మూర్తి కూడ అలా చేస్తాడంటే, నా మనసు నమ్మటం లేదు. అయినా, అంత స్వార్థపరుడైతే డబ్బు పంపకపోవచ్చు. కాని ఈ 'ఒక రూపాయి' మనియార్డరేమిటి?

మేము కాలేజీలో చదివే రోజుల్లో, ప్రతి నెల మొదటివారంలో మూర్తికి మనియార్డరు వచ్చేది. వందలకి వందలు, అడగనవసరం లేకుండా తనకు పంపిన తండ్రిని ఈనాడు ఇలా బహూకరిస్తున్నాడా మూర్తి? ఒకరూపాయి పంపడానికి అతనికి సిగ్గులేదూ! అందుకు ఏ కారణం చెప్పుకుని అతను అంతరాత్మను సరిపెట్టుకుంటున్నాడో!

విప్లవం

విప్లవం కాదు పిల్లలాట
అది మేధావుల మెదళ్ళలోని పోరాటం
కత్తులూ, కాగడాలతో రాదు విప్లవం
కాలేకడుపులూ, గుండెలు కలిసి
పుట్టించేదే విప్లవం
వినాశనానికి దారితీసేదికాదు విప్లవం
సస్యశ్యామలం వైపుకు సాగిపోయేదే
విప్లవం
కలకలలాడడానికి కావాలి విప్లవం
గలగలలాడుతు సాగడానికి పుట్టాలి
విప్లవం
విప్లవంలేని జాతిచరిత్ర
ఉంటుంది చప్పగా

— యం. బాలకృష్ణ

మూడోవ్యక్తిని నాకేఇంత బాధగా ఉంటే ఆ మహానుభావుడు రాఘవయ్యగారు ఈ అవమానం ఎలా సహిస్తున్నారో! ఆ విషయం అడిగి మరింత బాధపెట్టిన వాణ్ణి అవుతానేమోనన్న ఊహతోనే ఆయనను అడగలేదు. అయితే ఆయన మాటల్లోగానీ, ప్రవర్తనలో గానీ, ఏ రకంగానూ బాధపడుతున్నట్లు నేను గమనించలేదు. ఆ మూర్తిగాడు ఎప్పుడు వస్తాడా! ఎప్పుడు విషయం తేల్చేద్దామా! అని కాచుకున్నాను.

ఈలోగా ఇంకో చిత్రమైన విషయం తెలిసి, నా ఊహల్ని మరింత బలపరిచింది. రాఘవయ్యగారుంటున్న చిన్నఊరికి తపాలా బట్వాడా సౌకర్యం ఉన్నప్పటికీ, అక్కడ పోస్టాఫీసు (అంటే మనియార్డర్లూ, రిజిస్ట్రేషనూ వగైరాలు చేసేది) లేదు. అటువంటి వాటికి వాళ్ళు టౌనులోకి రావలసిందే. మా కొట్టుకి ఒగ్గర్లో ఉన్న పోస్టాఫీసుకే ఆయన వస్తుంటారు.

ఆ పోస్టుమేస్టారొకరోజున నాతో "మీ మేస్టారు ఎప్పుడూ కొడుక్కి ఒక రూపాయి పంపుతాడేమిటండీ! అదేమన్నా 'అచ్చి' వచ్చిందా?" అని అడిగాడు నవ్వుతూ. ఆయన ఉదహరిస్తున్న 'మేస్టారు' రాఘవయ్యగారే. మా కిద్దరికీగల సాన్నిహిత్యం ఆయనకి తెలుసు. కాగా, మరిన్ని వివరాలడిగి నేను తెలుసుకున్న విషయంయొక్క సారాంశము ఏమిటంటే, రాఘవయ్యగారుకూడ మూర్తి పేర తరుచూ ఒక రూపాయి మనియార్డరు పంపుతుంటారు. ఈ కొత్త విషయం తెలుసుకుని, అందుకు కారణాలు ఊహించసాగాను. ఇలా జరుగుతున్నదంటే అందుకు ఒక కారణం, ఆయన అప్పట్లు అదివాళకు కలిసివచ్చిన పని అయివుండొచ్చు లేదా మూర్తి పంపిస్తున్న ఆ మనియార్డర్లకు అవమానం చెంది ఆయన తిరిగి పంపేస్తున్నాడనుకోవాలి.

ఎలా అనుకున్నా నా ఊహల్లో బలం లేకుండానే ఉంది. ఈ చిక్కుసమస్య నా అంతటనేను విడదీయలేకపోగా, ఆ తండ్రీ కొడుకుల మధ్య ఏ పరిణామాలు రూపుదాలుస్తాయోనన్న భయం ఒకటి నన్ను బాధిస్తోంది.

* * *

కొన్నాళ్ళకు మూర్తి రానేవచ్చాడు. ఆ రోజే పనికట్టుకొని రోడ్డుమీదకు లాక్కుపోయాను.

"మూర్తీ! నీ స్వంతవిషయమే అయినా, ఒక ప్రశ్న అడుగుతాను. సరిగా సమాధానం చెబుతావా?"

ఆశ్చర్యంగా చూశాడు. "ఏమిట్రా అంత గొప్ప విషయం?" అడిగాడు.

మా అత్తగారితో అరగంట తగువాడితే చాలు నాకు ఆయాసం నీరసం గుండెదడ వచ్చేస్తున్నాయి డాక్టర్ మంచి టానిక్ రాసివ్వండి!



…ముకుటుంబం సమిదనేగదా ముఖ్యంగా ఆధారపడి ఉంది? నువ్వు వాళ్ళ సంగతింరిగా చూస్తున్నావా ?"

"ఏం ఎందుకలా అడుగుతున్నావు?" అడిగాడు మూర్తి.

"ఏం లేదు వాళ్ళకు కనీసం నెలకి రెండుమూడు వందలయినా కావాలిగదా! నువ్వు ఆ మొత్తం పంపించలేని దరిద్రంలో ఉన్నావనుకోను. కాని నువ్వు చేస్తున్నదేమిటి? మీ నాన్నగారిలాంటి తండ్రికి ఒకటి రెండూ రూపాయలు మనియార్డరు చేస్తావా?"

రూపాయి ఎమ్. ఓ.

అంతవరకూ 'సీరియస్'గా నా మాటలు విన్న మూర్తి పకపక నవ్వడం మొదలు పెట్టాడు. నా కోపాన్ని పట్టించుకోకుండా "పద మా యింటికి!" అన్నాడు.

"ఎందుకూ ఇక్కడే చెప్పొచ్చుగా?"

"పదరా!" అంటూ బలవంతంగా లాక్కుపోయాడు. రాఘవయ్యగారు వాలుకుర్చీలో కూర్చుని ఉన్నారు.

"నాన్నా! మీ 'బ్యాంకు ఎకౌంటు' పుస్తకం ఒకసారి ఇవ్వండి" అన్నాడు మూర్తి. ప్రక్కనే అలమారలోనించి తీసి ఇచ్చారాయన.

"చూడరా!" అంటూ అది నా చేతికిచ్చాడు. అందులో ప్రతినెలా మూడు వందల రూపాయల చొప్పున ఆయన ఖాతాకు మెయిలు ట్రాన్సఫరు ద్వారా జమకట్టబడుతున్నట్లు అంకెలు తెలుపుతున్నాయి. అందులో కొంత కొంత తీసుకోవడం జరిగింది. మిగిలింది నిల్వలో ఉంది. ఈలోగా మూర్తి ద్వారా విషయం విన్న మేష్టారు నవ్వుతూ,

"అసలు నాదీ కొంత పొరపాటుఉందోయ్ నువ్వు ఆ మనియార్డర్లు రావడం చూసి నపుడే ఆ విషయం చెప్పి ఉండవలసింది. అయితే అవి తెచ్చిన రామయ్యముందు ఆ రహస్యం చెపితే అసలు వాటి ఉపయోగమే ఉండదు. ఆ తరువాత ఆ విషయం నువ్వు గమనించావన్న సంగతి మరిచిపోయాను" అన్నారు.

"అయితే అసలు విషయం ఏమిటి సార్" అడిగాను. మూర్తి అందుకున్నాడు, "బలే! అయితే యిది పెద్ద 'సస్పెన్స్' తెచ్చిపెట్టిందన్నమాట. నీకు అసలు విషయం చెప్పాలంటే మా ఊరి పోస్టాఫీసు గురించి కొంచెం చెప్పాలి. పంతులుగారు తెలుసుగా, నీకు? ఆయన గౌరవ పోస్టు మేష్టరు. ఆయన డ్యూటీ కార్డులూ, కవర్లూ వగైరాలు అమ్మటం, టౌనులోనుండి యీ ఊరి టపా తెప్పించి బట్వాడా చెయ్యడం దాని నిమిత్తం యీ రామయ్య నియమించబడ్డాడు. ఇవి రెగ్యులర్ ఉద్యోగాలు కావు. జీతాలు కూడా చాల స్వల్పంగానే ఉంటాయి."

నాకు విసుగనిపించి, "ఈ సొదంతా ఎందుకురా చెబుతావు? అసలు విషయం చెప్పు" అన్నాను.

"దానికే వస్తున్నాను. మా ఊరికి రోజూ పది, పదిహేను ఉత్తరాలు మాత్రం వచ్చేవి. వాటిని తీరికగా అందజేసేవాడు రామయ్య. ఈమధ్య మరిన్ని కొత్త కుటుంబాలు ఏర్పడటంలో రోజూ వచ్చే ఉత్తరాల సంఖ్య బాగా పెరిగింది. అయితే రోజూ అన్ని ఉత్తరాలు మన వూరికి అక్కర్లేదని రామయ్య అభిప్రాయం, పూర్వం లాగానే రోజుకి పదో పరకయ్యో 'రిలీజ్' చేస్తాడు. అలాగ్నే

మిగతావి పారేసాడని కాదు సుమా! ఎప్పుడో అసలు ఉత్తరాలు లేని రోజుల్లో వాటిని తీసి ఇవ్వవచ్చుగదా అని అతని ఉద్దేశం కావచ్చు.''

ఇంతలో మేష్టారు అందుకున్నారు, ''వాడు ఆ పద్ధతి అవలంబించడం చేస్తూండటం వల్లా, ఇంగ్లీషు అక్షరాలు చదవడం అతనికి అంత యిష్టమైన పని కాకపోవడం వల్లా, మూర్తి రాసిన ఉత్తరాలు చాలా రోజుల పాటు అతని బొత్తిలో ఉండిపోయేవి. ఒక్కో సారి అసలు మనకు చేరేవే కాదు. ఈ సంగతులు తెలీక, మూర్తి ఉత్తరాలు రాయడం నిర్లక్ష్యం చేస్తున్నాడని తలచి విస్తారంగా రాశాను. దానికి సమాధానంగా వాడు రిజిష్టరు పోస్టులో ఉత్తరం రాస్తూ ఆనెలలో నాలుగు ఉత్తరాలు రాసిన వైనం తెలిపాడు. వెళ్ళి పంతులుగారిని అడిగితే, ఆయన రామయ్యా ఉత్తరాల బొత్తి వెతికించాడు. దానిలో మూడు ఉత్తరాలు బయట పడ్డాయి,''

నేను ఆశ్చర్యంగా వింటున్నాను.


''నేను కష్టంగా మాట్లాడేసరికి రామయ్యకి కోపం వచ్చింది. మీ ఉత్తరాలు మీకేవచ్చాయిగదా! ఇంకా ఎందుకలా గొంతు చించుకుంటారన్నట్లు మాట్లాడాడు. ఉత్తరాలు సమయానికి అందవలసిన అవసరం గురించి అతనికి నచ్చచెప్పటానికి ప్రయత్నించాను కానీ, నా ఉపాధ్యాయఅనుభవం అక్కడ వ్యర్థమైంది''

''రిపోర్టు చేయలేకపోయారా?'' అడిగాను.

ఆయన నవ్వుతూ, ''చేయవచ్చుననుకో ! వాళ్ళు తగినచర్యలు కూడా తీసుకొంటారు — అయితే ఇటువంటి చిన్న ఊళ్ళలో అలాంటి చర్యలవల్ల ప్రయోజనం అంతగా వుండదు— వ్యక్తిగత వైషమ్యాలు రావడం తప్ప.'' అన్నారు.

''మరి, యీ మనియార్డర్ల కథ ఏమిటి?''

''అక్కడే మనకుకాస్త కలిసివచ్చింది. ఒక రోజున యథాలాపంగా పంతులుగారు రామయ్యకు ఏవోవిషయాలు ఉపదేశిస్తుండగా నేను వినడం తటస్థించింది. దాని సారాంశమేమిటంటే, రామయ్యని ఎవరూ ఏమీ చేయలేరుగానీ డబ్బువిషయంలోఅంటే మనియార్డర్లు విషయంలో ఏమన్నా తకరారు జరిగిందా అది అంతటితో వదలదనీ, జైలు ప్రాప్తికూడా సిద్ధించవచ్చుననీహెచ్చరించారు. అది రామయ్య మనసులో బాగాహత్తుకున్నట్లు నాకుతోచింది అప్పుడే నాకు యీ ఆలోచన కూడావచ్చింది. ఉత్తరం రాయాలంటే పదిహేను పైసలో, ఇరవై పైసలో అవుతుంది గదా! మరో అయిదు పైసల ఖర్చుతో పది రూపాయలవరకూ మనియార్డరు పంపవచ్చు. మనలోమనం రాసుకునే ఉత్తరాలబదులు ఇలా మనియార్డర్లు పంపుకుంటే, మనడబ్బు మనదగ్గరే ఉంటుంది, కావలసిన ముఖ్య విషయాలు ఆ మనియార్డరు కూపనులోనే రాసుకోవచ్చు. ఖచ్చితంగా అందుతాయి అంతే కాదు, అందినట్లు తిరుగు రశీదుకూడా మనకు వస్తుంది. అదీ సంగతి'' అన్నారు. ఇప్పుడుకూడా, ఆశ్చర్యపోవడం నా వంతే!



బాలల అకాడమీ సభ్యుల వినోదార్థం విజయవాడలో నృత్యం చేసిన కుమారి మంజరి.

పరాజిత

గేయకావ్యము. రచన: శ్రీ కనపర్తి. 98 పేజీలు, వెల ఆరు రూపాయలు. ప్రతులకు: శ్రీ బుక్‌హవుస్, నారాయణగూడ, హైదరాబాద్, లేక రచయిత పేర 4—2—25, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లా.

అవీ ఇవీ అన్నీ

శ్రీసాయీ అనుసరణము.

రచయిత: కీ. శే. బాపట్ల హనుమంతరావు. 332 పేజీలు, వెల 12 రూపాయలు. ప్రతులకు: 1. శ్రీ బాపట్ల వెంకటపార్థసారధి, శ్రీ సాయి నిలయం, చెరువు [పోస్టు] గుంటూరు జిల్లా. 2. శ్రీ సి. సాంబమూర్తి, శ్రీ షిర్డిసాయి ప్రేమ మందిర్, 1—8—426, చిక్కడపల్లి, హైదరాబాద్—20.

భగవద్రామానుజ స్తుతి

భక్తిసాహితి 31 వ పుష్పము. పరిష్కర్త ఉ. వే. బ్ర. శ్రీమాన్ శ్రీవచన భూషణం చక్రవర్తి వెంకట నృసింహాచార్యులు. ఇరామానుజ నూత్నాద్దికారికై ప్రబంధమునకు సంస్కృత శ్లోకానువాద కర్త. తిరువిసనూర్ ఆసూరి శ్రీనివాసాచార్యులు. 204 పేజీలు, వెల 8రూపాయలు, ప్రకాశకులు: శ్రీ గోదాగ్రంథమాల, ముసునూరు , కృష్ణాజిల్లా.

త్యాగశిల్పము

లేపాక్షి దేవాలయ చరిత్ర పద్యకావ్యం. రచన: శ్రీ లంకా కృష్ణమూర్తి, శ్రీ పసి కాల్వ చెంచు సుబ్బయ్య, వెల రు. 6.50.సోల్ డిస్ట్రిబ్యూటర్స్: సుదర్శన పబ్లికేషన్స్, కమలా నగర్, అనంతపురం.

ఎర్రనేల

పద్యకావ్యము. రచన: శ్రీ 'రామకృష్ణకటాక్ష 52 పేజీలు, వెల 5 రూపాయలు. ప్రచురణ సుమిత్రా పబ్లికేషన్స్ 17—4—40, సుందరయ్య వీధి, చిత్తూరు.

మే 29న నటరాజ కళామండలిలో నాట్యం చేసిన ''విజయవాడ నాట్యత్రయం'' విద్యార్థులలో నాట్యంచేస్తున్న ఒక బాలిక కుమారి సుమ




రిజల్ట్సు వచ్చేసాయ్!
రాగతి పండరి
నీకెలా తెలుసూ?

పై వారమే ప్రారంభం!

"కస్తూరి" గొలుసు కథ సం॥



Grant.7 TL

జెనెటిక్స్ పరిశోధన ద్వారా మధుమేహం రోగులకి విముక్తి

శాన్‌ఫ్రాన్సిస్కోలోని కాలిఫోర్నియా యూనివర్సిటి శాస్త్రజ్ఞులు జెనెటిక్ పరిశోధనలో ఒక మహాద్భుతాన్ని సాధించారు. ఒక ఎలుకలో ఇన్సులిన్‌ని తయారుచేసే జీన్‌ని వెలికి తీసి, దాన్ని బాక్టీరియా లోనికి పంపగలిగారు. మానవునిలో ఇన్సులిన్‌ని ఉత్పత్తి చేయటానికి ఇది ప్రథమ సోపానంగా చెబుతున్నారు. పపంచంలో నానాటికి పెరిగిపోతున్న మధుమేహం రోగులకు ఈ పరిశోధనా ఫలితం వరప్రసాదం కాగలదు.

ఈ పరిశోధనకు సంబంధించి జరిగిన ప్రకటనలో పలు విశేషాలున్నాయి.

1. ఇన్సులిన్ జీన్ పరిశీలన ఇంతకు ముందు ఎప్పుడూ జరిగి ఉండలేదు కొందరిలో మధుమేహం రావటానికి కారణమేమిటో తెలుసుకోవటానికి ఈ పరిశోధన తోడ్పడగలదు.

2. ఇన్సులిన్ జీన్ ని విజయవంతంగా పునరుత్పత్తిగావించటం. మూషికం నుంచి తీసిన జీన్‌ని బాక్టీరియాలోనికి పంపి భారీ ప్రమాణంలో దాన్ని పునరుత్పత్తిగావించటం జరిగింది.

కాలిఫోర్నియా పరిశోధనలో చేయవలసిన కార్యం, జీన్‌ని పని చేయించటానికి లేక పని చేయకుండా ఆపుచేయటానికి తోడ్పడే జెనెటిక్ పదార్థం తయారు చేయటం. ఇంకా రెండేళ్లలో అది సాధ్యం కావచ్చునని ఈ యూనివర్సిటీ బయోకెమిస్ట్రీ, బయోఫిజిక్సు విభాగానికి చెందిన డాక్టర్ విలియమ్ జె. రట్టర్ చెప్పారు.

3. అన్నిటికంటె ముఖ్యమైనది, మానవ జీన్‌ని బాక్టీరియా 'ఫ్యాక్టరీల'లోకి మార్పిడి చేసి తద్వారా మానవ ఇన్సులిన్‌ని తయారు చేయటం. ఇది అయిదు సంవత్సరాలలో సాధ్యం కావచ్చునని డాక్టర్ రట్టర్ అన్నారు. అప్పటికి ప్రపంచంలో తీవ్రమైన ఇన్సులిన్ కొరత ఏర్పడగలదని చాలా మంది భయపడుతున్నారు.

ప్రస్తుతం పశువులు, పందుల నుంచి తీసే ఇన్సులిన్‌ని శుద్ధిచేసి మానవులకు ఉపయోగిస్తున్నారు. ప్రపంచంలో మధుమేహం రోగుల సంఖ్య నానాటికి పెరుగుతున్న కారణంగా ఈ పదార్థం కొంత ఏర్పడే ప్రమాదం ఉన్నది. అంతేకాకుండా జంతువుల నుంచి తీసే ఇన్సులిన్‌ని మనుషులకు వాడుతున్నందువల్ల అది గిట్టని వారికి కొన్ని ఇతర జబ్బులు వస్తున్నాయి.

జీన్‌ని విడదీయటం అనే కార్యం సాంకేతిక విజ్ఞానాభివృద్ధి ఫలితంగా సాధ్యమైంది. కొన్నేళ్ళ క్రితమే ఈ పద్ధతిని కాలిఫోర్నియా శాస్త్రజ్ఞులు రూపొందించారు. డి. ఎన్. ఏ. మాలిక్యూల్, డియోగ్జిరిబోన్యూక్లియిక్ యాసిడ్‌లతో ఈ పని చేయగలిగారు. ఈ రెండు పదార్థాలతోనే జీన్లు తయారు అవుతాయి. డి. ఎన్. ఏ. మాలిక్యూల్ తాలూకు ఒక నిర్దిష్ట భాగంలో ఇన్సులిన్‌ని ఉత్పత్తిచేసే జీన్సు ఉంటాయి. డి. ఎన్. ఏ. మాలిక్యూల్ నుంచి ఈ భాగాన్ని కత్తిరించి మరొక ఆర్గానిజమ్ తాలూకు డి. ఎన్. ఏ. మాలిక్యూల్ కి అతికిస్తారు. అప్పుడు వంశ పారంపర్య లక్షణాలు ఒకదాని నుంచి మరొక దానిలోనికి బదిలీ అవుతాయి.

ఈ పరిశోధనలో ఇన్సులిన్ ఉత్పత్తి కారకమైన జీన్ ఏదో ముందుగా తెలుసుకోవాలి. ఇది అతి క్లిష్టకార్యం. ఈ ప్రయోగంలో ఉపయోగించే బాక్టీరియాలో 3,000 మొదలు 4,000 దాకా జీన్సు ఉన్నాయి. కాగా మనుషులలో లక్షలాది జీన్సు ఉంటాయి.

మూషిక ఇన్సులిన్ ఉత్పత్తికి సంబంధించిన జీన్‌ని కనుగొని, వెలికి తీసిన తరువాత దాని రసాయనిక లక్షణాలను గురించి కాలిఫోర్నియా పరిశోధకులు పరిశీలించారు. తరువాత దాని కాపీ తీశారు. తరువాత దాన్ని 'ప్లాస్మిడ్స్' అనే బాక్టీరియా డి ఎన్. ఏ.కి అతికించారు. ఇది బాక్టీరియా డి. ఎన్. ఏ కి ప్రధాన భాగం వెలుపల ఉంటుంది. ఇందుకుగాను శాస్త్రజ్ఞులు కాపీ చేసిన జీన్‌కి బాక్టీరియా డి. ఎన్. ఏ కి ఒక ఎంజైమ్‌ని కలిపారు. ఈ ఎంజైమ్ డి. ఎన్. ఏని నిర్దిష్ట ప్రాంతాలలో నరికివేసింది. అలా నరికిన గరుకైన కొసలకు, అదేవిధంగా నరకబడిన మరొక డి ఎన్ ఏ గరుకైన కొసలకు అంటించటం జరిగింది.

ఆ విధంగా కాపీ చేయబడిన మూషిక ఇన్సులిన్ జీన్ బాక్టీరియా డి ఎన్ ఏ తో కలిసిపోయింది. దీన్నే రీకాంబినెంట్ డి ఎన్ ఏ అంటారు. తరువాత కొంత రీకంబైన్డ్ డి ఎన్ ఏ ను బాక్టీరియాలోపలికి పంపారు. అప్పుడు కొత్త డి ఎన్ ఏ తో కూడిన బాక్టీరియా మూషిక జీన్‌ని కాపీ చేసింది. అదే ఇన్సులిన్‌ని ఉత్పత్తి చేసింది.

[ఇనర్షీ డిస్పాచ్]

అట్టమీదబొమ్మ

17—6—77ది పత్రిక జయశ్రీ (టి) చిత్రం మమ్ములను ఉత్తేజపరిచింది. ఇలాంటి ముఖచిత్రాలు తరచుగా వేస్తే మాలాంటి వారు సంతోషిస్తారు. నాలుగు కథలూ బాగున్నాయి. దారి తప్పిన తండ్రి సీరియల్ చాలా మలుపులు తిరిగి సుఖాంతంగా అయిపోయింది. ఏదైనా ఈ వార పత్రిక టాప్.

శిరగడం లక్ష్మీనారాయణ, శేషేశ్వరి, కె. గౌరి, కె. కన్నతల్లి (అనకాపల్లి)

*

మా కార్యాలయమునకు 4 లేక 5 లెటర్స్ వ్రాసినా పత్రికలలో ప్రచురించటంలేదు. ఉత్తరాల శీర్షిక ఈ మధ్య చాలాబోరుగా ఉన్నది. 10.6.77 తేది ఆంధ్ర సచిత్ర వారపత్రిక అట్టమీద బొమ్మ అగు కుమారి జయమాలిని పోటోమాకు చాలసంతోషము కలిగించినది. ఆమె ముఖమునందలి అందము పరవశింప చేసినది. ఆమె చిరునవ్వు నందలి ఆ పలువరుసవలన ఆపోటోకి అందము చేకూరినది.

పి. భక్తవత్సలం, వి. సురేష్, (హిందూపురం)

*

10—6—77 జయమాలిని ముఖచిత్రం ఆంధ్రపత్రికకు ఇంతకు ముందు ఎన్నడూలేని అందాన్నిఇచ్చింది. ముఖ్యంగా కవర్ పేజీకలర్, పేపరు చాలాబాగున్నాయి. కవర్ పేజీ చూస్తే స్టార్‌డస్ట్‌ను కాలదన్నే విధంగాయుంది. ఎప్పుడు ఇలాగే అందిస్తారని ఆశిస్తున్నాను. సుగుణా ఆర్ట్సు పిక్చర్స్ వారి చిత్రం పేరు రాజా—రమేష్ ఏమి బాగాలేదు. పేరు మార్చనిచో ఆలుమగలు—బంగారు బొమ్మలాగ ఘోరంగా దెబ్బతింటుంది. దీప ముఖచిత్రం త్వరలో వేస్తారని ఆశిస్తున్నాను.

ఎం. ఫారూక్ (కర్నూలు)

* * *

మీ (మా) 10.6.77 వారం పత్రిక ముఖచిత్రం, అందాలబొమ్మ జయమాలిని ముఖచిత్రంతో అందంగా మురిపించింది. అయినా ఆ పోటో ఏ చిత్రంలోనిది కాకుండా, ప్రైవేట్‌గా అయినపుడు ఇలా అర్ధనగ్నంగా చూపించటం చాలా బాధగా ఉంది. చిత్రాలలో అయితే సరే, కానీ యీ పత్రికల్లోనయినా అందంగా చీరెకట్టి కనిపించేట్టు చేయండి ఏ తారయినా. ఇంతటి అందాలరాణి (జయమాలిని)ని యిలా అర్ధనగ్నంగా చూపించి నందుకు విచారిస్తున్నా (ము)ను.

కోట వెంకటరమణ (బరంపురం)

* * *

27—5—77 నాటి పత్రికలో సీరియల్ దారి తప్పిన తండ్రి మా ఇంట్లో అందరినీ ఆకర్షించింది. సాటి ఆడదానిపై సానుభూతితో తన భర్తనే కాల్చివేసిన అన్నపూర్ణమ్మగారి సాహసానికి ధైర్యానికి మేమెంతో మెచ్చము. ఆస్తి అంతస్థు డాబు అధికార దర్పంతో కన్ను కానక భుజంగరావుగారి క్రింద అల్లిలాటి స్త్రీలు బలికావడమే భుజంగరావుగారికి ఇది



తగిన శాస్తి. ఈ సీరియల్ రచించిన వారికి ప్రచురణ చేసిన మీకు మా ధన్యవాదలు.

—ఎ. ఝాన్సీలక్ష్మీ వెంకటేశ్వరరావు [నర్సరావుపేట]

* * *

3—6—77 చంద్రలేఖ ముఖచిత్రంతో వెలువడిన సంచిక ఎంతో ఆకర్షణీయంగా వుంది శవ పంచాయితీ కథ చాలా ఇంటరెస్ట్‌గా ఉంది. ఈ కథలోని ఎన్నోశవాలను తన చేతితో కోసిన వాడు. చివరకు తన భార్యను కూడా తన చేతుల మీద కోస్తాడని ఊహించలేకపోయాను. శాంతి కథ కూడా బాగుంది. స్వయం వరం కథ మమ్మెల్నెంతో ఆకర్షించింది.

నడిగట్ల సత్యవతిమల్లేశ్వర్, [నరసింగపల్లి]

> **ఉత్తరాలు :**
> **పాఠకులకు మనవి**
>
> ★ ఉత్తరాలు క్లుప్తంగా తెలుగులో వ్రాసి చివర స్పష్టంగా తమ పేరు చిరునామా వ్రాయాలి.
>
> ★ సంతకాలు పెడితే పేరు అర్థం కాదు కనుక దాని క్రింద పూర్తి పేరు కూడా వ్రాయాలి.
>
> ★ ఉత్తరాలు త్రిప్పి పంపమంటూ కొందరు తపాలా బిళ్ళలు పంపుతున్నారు. ఉత్తరాలు తిప్పి పంపడం సాధ్యం కాదు.
>
> ★ వచ్చిన అన్ని ఉత్తరాలు వేయడం ఎప్పుడూ సాధ్యం కాదు. కొన్నింటిని సంక్షిప్తం చేసి వేయవలసి ఉంటుంది. కూడా. ఏ ఉత్తరమైనా వ్రాసేవారి చిరునామాతో కూడా ఉండటం అవసరం. —సం

సినిమా

మే 8వ ఉదయం ఆరు గంటల సమయంలో రామారావుగారి ఇంటిలో, నిర్మాతలు, దర్శకులు, నటీనటులు, అభిమానులు సుమారు వెయ్యిమంది దాకా (తనకు) కనిపించిన నిజాన్ని శ్రీనివాస్‌గారు పాఠకులకు తెలిపారు (3—6—77). రామారావుగారింట్లో స్పెషల్ మార్నింగ్‌షో ఏదయినా ప్రదర్శింపబడలేదుకదా !

యమునిసతిగా ఎన్టీఆర్ ప్రక్కన నిలబడి నటించగల నటి జమునతప్ప మరెవ్వరున్నారు అని సూటిగా ప్రశ్నిస్తున్నారు శ్రీనివాస్‌గారు. పురాతిణోహాసాల గూర్చి, ముఖ్యంగా యముని సతి గురించి, అంతగా పరిజ్ఞానం లేని మాలాంటి వాళ్ళు శ్రీనివాస్ గారి సూటి ప్రశ్నకు జవాబివ్వలేక పోవచ్చును అయినా సినీ నటీమణుల గూర్చి వారి, వారి నటనల గూర్చి బాగాతెలిసిన శ్రీనివాస్‌గారిపై నిర్ణయాన్ని (జమునగూర్చి) కాదనగల పాఠకులు (ప్రేక్షకులు) మనలో ఎవరున్నారు ?

ఏంతయినా అలంకారాలు (ముఖ్యంగా అతిశయోక్తులు) రాయటంలో శ్రీనివాస్‌గారు ఏవన్

ఎ. ఉమాదేవి, ఎ. జ్ఞానేశ్వరరావ్, (సిద్ధిపేట)

సీరియల్

ప్రేమ పరీక్ష, మందు కథలు చాలాకొత్త తరహా ఉన్నవి ఒకకన్య చెప్పిన కథ సీరియల్ చాలా చాలాహుషారుగా సాగిపోతోంది. దారి తప్పిన తండ్రి సీరియల్ చాలా ముమ్మరంగా ముగిసింది.

ప్యాట రమేష్‌బాబు, (కరీంనగర్.)

27—5—77, 3—6—77 వతేదిలలో సంచికల ముఖచిత్రాలు చూశాక నాకీ అభిప్రాయం వ్రాయాలనిపించింది. మా [మీ] పత్రికను ప్రతీ కుటుంబంలో చిన్నా, పెద్ద చదవవలసిన పత్రిక, కాని పత్రిక స్థాయి ఈ మధ్య దిగజారి పోతున్నదేమోననిపిస్తున్నది. పై తేదీల గల సంచికల ముఖచిత్రాలు చాల సెక్సీ గావున్నాయి. ఇలాంటి ముఖచిత్రాలు ప్రచురించకపోతే పాఠకులు చదవరని భయమా? కొనరని భయమా? మా [మీ] పత్రిక పైమాలాంటి పాఠకుల అభిమానం ఎప్పుడూ వుంటుంది.

—గరుగు రమణ [బొబ్బిలి]

కథలు

హిందీతార జయశ్రీ ముఖపత్రంతో వెలువడిన ఆంధ్రపత్రిక కొత్త వెలుగులను విరజిమ్మింది. కథలలో రాంగ్‌నంబర్ కథ ముగింపు హాస్యాన్ని అందించింది. పరోపకారి కథ చాల బాగుంది. భార్య ముచ్చట తీర్చబోతున్న సంతోషంతో వస్తు మధ్యలో ఒక స్త్రీని దుండగులు బలత్కారంచేస్తున్నారని కాపాడి చివరికి తన ప్రాణానికే ముప్పుతెచ్చుకొన్నాడు. దారితప్పిన తండ్రి సీరియల్ అత్యంత ఆసక్తితో సాగిపోయింది.

కందిగట్ల ప్రభాకర్ (జనగామ).

ఉత్తరాలు

హైదరాబాద్ నోట్ బుక్

10—6—77 సంచికలో హైదరాబాద్ పాట కుడిలేఖ చదివిన తరువాత ఈ లేఖ వ్రాయాలనిపించింది. (1) వారి ప్రశ్న 3లో ఆంధ్రప్రదేశ్‌ను ఆరంభ శూరప్రదేశ్‌గా సంబోధించారు. ఇది ఆక్షేపణీయం. తన వ్యక్తిత్వాన్ని అందరికి వర్తింప చేయుటం వారి ఆవేశాన్ని తెలియ జేస్తుంది గాని ఆలోచనను మాత్రంకాదు. (2) రాజకీయవాదులంటే అవకాశవాదులని పేర్కొన్నారు అది నిజం. (3) కాంగ్రెస్‌లోని అవకాశవాదులు అధికార దుర్వినియోగం చేస్తే వ్యక్తిగతంగా శిక్షార్హులు కాని సంస్థ మాత్రంకాదు. (4) జనతాప్రభంజనం చల్లారిందనడానికి గోవాఎన్నికల ఫలితాలు నిదర్శనం.

వేదాంతం విజయసారధి. (వుంచికలపూడి)

* * *

గత మూడువారాల సంచిక నుంచి పత్రిక కవర్ పేజీలపై చాలా సెక్స్ ఫోటోలు ప్రచురిస్తున్నారు ఇవి చూడడానికి ఎంతో జుగుప్సాకరంగా ఉంటున్నవి. మునుపు ఎంతో చక్కటి ముఖచిత్రాలు ఇస్తున్న మీరు ఈ విధంగా ప్రచురించుటలో ఉద్దేశమేమో తెలియకున్నది.

ఆర్వేటి జగదీష్‌గుప్త (కర్నూలు)

హైదరాబాద్ నోట్ బుక్

(5వ పేజి తరువాయి)

చేపట్టిన కార్యక్రమాలు వివరించారు. డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ బూదరాజు రాధాకృష్ణ కృతజ్ఞత తెలిపారు. తెలుగు, కన్నడ, తమిళ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు భాషా శాస్త్రవేత్తలు పరిశోధన వ్యాసాలు చదివారు. చర్చలు జరిపారు. రెండవనాడు సమాపకోపన్యాసం కావించిన భారతీయ భాషల కేంద్ర సంస్థ డైరెక్టర్ డాక్టర్ డి. పట్నాయక్ నిత్య వ్యవహార భాషకు పాఠ్య గ్రంధ భాషకు పరిపాలన భాషకు మధ్య గల అంతరాన్ని తొలగిస్తే, అధిక సంఖ్యాక ప్రజలు పరిపాలన వ్యవస్థ నుంచి వేరు కారన్నారు. దేశంలో 41 కోట్ల మంది నిరక్షరాస్యులని, ప్రపంచంమొత్తంలోని నిరక్షరాస్యులలో వీరు సగమని, పిల్లలందరికీ ప్రాథమిక విద్యను అందిస్తే తప్ప ఈ సమస్య పరిష్కారం కాదని అన్నారు. ఉన్నత విద్యాశాఖా డైరెక్టర్ శ్రీ వి. రామచంద్రన్ ముగింపు సమావేశానికి అధ్యక్షత వహించారు. అనువాదగ్రంథాల ప్రచురణకన్నా మూల గ్రంధాల ప్రచురణకు ప్రాధాన్యమివ్వాలని తెలుగు అకాడెమీని కోరుతూ గోష్టి తీర్మానించింది. చివరని శ్రీ ఎస్. ఎస్. మోహన్‌రావు వందన సమర్పణ చేశారు.

ఉపశ్రుతి

"ఏమిటండీ దోసెలో ఎలుక పెంటికలున్నాయే! ఇంత అజాగ్రత్తగా వుంటే ఎలాగండీ అని ప్రశ్నించారు శ్రీమతి గూడాలి సుబ్బరత్నమ్మ రవీంద్రభారతి పక్కన వున్న కామత్‌హోటల్ యజమానిని. శ్రీమతి సుబ్బరత్నమ్మ వెంకటేశ్వరా విశ్వవిద్యాలయంలో రాజశేఖర శతావధాని గ్రంథాలపై ఎం. ఫిల్ కోసం పరిశోధనచేస్తూ రాజధానిలోని గ్రంథాలయాలు చూడడానికి వచ్చి జూన్ 6 వ తేదీన కామత్ హోటల్‌లో అల్పాహారానికి వెళ్ళినప్పటి దుర్ఘటన ఇది. ఊరంతా ఎలుకలున్నాయండీ పెంటికలు పడ్డాయి. దానికింత రాద్ధాంతమా? అన్నాడు ప్రొప్రయిటర్. ఇంత అసహ్యమైన పని జరిగినందుకు విచారం ప్రకటించక పోగా "ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే [దొంగే కొత్వాలును బెదిరించిన] సామెతగా ప్రొప్రయిటర్ మాట్లాడే వేళకు ఆమె అవాక్కయి పోయారు. పాపం! ఆమె సంగతి ఎలావున్నా ప్రభుత్వ ఆరోగ్యశాఖ వారయినా ఇలాటి హోటలు వారిని అడపా దడపా పరామర్శించాలని కోరుతున్నాను.

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna




"చాణక్య—చంద్రగుప్త" లో ఎన్. టి. ఆర్.

17, మొదటి మెయిన్‌రోడ్డు, లేక్ ఏరియా,

(వళ్లువరుకోటవు ప్రక్కన)

the Nature's spectacular impression and expression of the varied aspects of EDUCATION.



16 ఏండ్ల వయస్సునకు పైబడినవారు

ఒకే సంవత్సరములో

ఆంగ్లములో

తపాలా


విశ్రాంతి సమయములో

ప్రారంభమునుండి కాని - లక్ష్యలక్షణ పరిశోధన పద్ధతిలోకాని

ఇంగ్లీషు

నేర్చుకోవచ్చును.


ప్రారంభించు క్రొత్త తరగతులగూర్చి నేరుగా వచ్చికాని, 20 పైసల తపాలాబిళ్లతో లేఖను వ్రాసికాని పూర్తి వివరములను తెలిసికొనండి. వెంటనే చేరండి.



పసిడి కిరణములను ప్రపంచములో
ప్రసరింపజేసి, సముద్రపు పశ్చిమ మట్టమువైపునకు
విశ్రాంతిగొనుటకై త్వరపడు భానునకు, ఆకాశము ఇంద్రధనుస్సుగా మారి,
వేదికవేసి, పాన్పును పరచును. ఇంద్రధనుస్సుయొక్క సప్తవర్ణములు, సంధ్యాసూర్యుని కెంపు వర్ణముతో కలసిమెలసి ఉవ్వెత్తుగా పొంగిపొరలు కడలి అలలనురుగులో కలియును. ఆ రంగుల నురుగుపై తీరమునుచూచు జాలరుల తెప్పలు తేలును. రమ్యమైన రంగులరూపము. కనులకు విందు — ఆరగింప వీలుకాలేదు.

భానునకు విశ్రాంతినిచ్చి, ఆతనినుండిపొందినకాంతిని ప్రపంచమునకు ప్రతిఫలింప, విహరించు మేఘములకు చంద్రవంక ముందుగా చొచ్చుకొనివచ్చును. కాంతిలోని కొరతను నింపుటకు తారలు దానిని చుట్టుముట్టును. మందహాసమైన సంధ్యాకాంతి కనులకు విందు — ఏకాంతముగానారగింప వీలుకాలేదు.

వెన్నెల వసారానుండి ప్రియునిరాకకై ఎదురుచూచి ఆరాటపడు ప్రియురాలు. మేతపిదప ఇంటికిమరలు గోసమూహము. ఆహారము వెదక వెళ్ళిన తల్లిపక్షికై గూటియందు తల్లడిల్లు గువ్వపిట్టలు. తన జంటను వెదకి అలమటించు ఆడపావురము. తటాకములో రేకులువిప్పి కలువలను ముద్దిడు ముల్లెలు. వికసించిన నవపుష్పములను ఆశించు తుమ్మెదలు. శోభాయమానమగు సంధ్యాసమయము ప్రకృతి ప్రసాదించు మధురామృతము — ఏకాంతముగానారగింప మనసొప్పలేదు! కావుననే మంచి విందును బంధుమిత్రులు చుట్టుముట్ట మిత్రత్వముతో అందరుకలిసి ఆరగింపవలెనని భగవంతుడు ప్రవక్తయైన మహమ్మదుమూలముగా లోకమునకు చాటెనో? విద్య ప్రసాదించు వివేకమనెడి విందును ఒక్కుమ్మడిగా కలిసి రుచిచూచెదము. అందరు రారండు!



G. SHANMUGASUNDARAM